సత్యనారాయణ, వేలూరి

ఫాహియాన్ భారతవర్షయాత్ర

బెజవాడ, 1926

Record no. 812

Satyanārāyaṇa, Vēlūri

Phāhiyān Bhāratavarṣayātra

Bejavāḍa, 1926

Record no. 812

సత్యనారాయణ, వేలూరి, 1898-1943.
ఫాహియాన్ భారతవర్షయాత్ర : బౌద్ధమహాయుగమునకు అనుబంధగ్రంథము / గ్రంథకర్త వేలూరి సత్యనారాయణ.- బెజవాడ : క. కోదండరామయ్య, 1926.
12, 180 p. :ill. ;18 cm.
Record no. 812

Satyanārāyaṇa, Vēlūri, 1898-1943.
Phāhiyān Bhāratavarṣayātra : Bauddamahāyugamunaku anubandhagranthamu / granthakarta Vēlūri Satyanārāyaṇa.- Bejavāḍa : Ka. Kōdaṇḍarāmayya, 1926.
12, 180 p. :ill. ;18 cm.
Record no. 812

పాకీరు యానీ శ్రీనాథ వద్ద ఉంది

645
13935

చరిత్ర

812

# ఫాహియాన్ భారతవర్షయాత్ర



గ్రంథకర్త:

వేలూరి సత్యనారాయణగారు, బి. ఏ.

విజ్ఞానచంద్రికా గ్రంథమాల 35.



# ఫాహియాన్ భారతవర్షయాత్ర

బౌద్ధమహాయుగమునకు

అనుబంధగ్రంథము.



గ్రంథకర్త:

శ్రీయుత వేలూరి సత్యనారాయణగారు, బి. ఎ.



బెజవాడ:

ఆంధ్రగ్రంథాలయ ముద్రాక్షరశాల (లిమిటెడ్) యందు

క. కోదండరామయ్యగారిచే ముద్రింపబడి

ప్రచురింపబడియె.

1926.

 [వెల రు 1—4—0.

చందాదారులకు రు 1—0—0.

# కృతిసమర్పణము

మదీయమిత్రులు ఆంధ్రభాషాసేవాభిరతులు, శ్రీ జయంతిపుర సంస్థానాధిపతులు శ్రీవాసిరెడ్డి దుర్గా సదాశివేశ్వర ప్రసాదరాయ బహద్దరు సుధీమణికి ఈగ్రంథమును సమర్పించితిని.

గ్రంథకర్త.

# తొలిపలుకు

ఇప్పటికి పదునైదు శతాబ్దముల క్రిందట ఫాహియాను అను చీనా యాత్రికుడు నాటి బౌద్ధమత వైభవ హైందవనాగరికతల వర్ణించుచు వ్రాసిన యాత్రాగ్రంథ మింతవరకును తెనుగుభాషయందు లేకుండుటెంతయు సంతాపకరము. ఈకొదువ దీర్చుటకే నే నీగ్రంథమును వ్రాయబూనితిని. మఱియు మనయాంధ్రభాషయందు నవలలు, నాటకములు, శతకములు, ప్రబంధములు కుప్పతెప్పలుగ కలవుగాని చరిత్రగ్రంథము లంత విశేషముగ గన్పింపవు. అదియేమి దౌర్భాగ్యమోగాని మన యాంధ్రయువకులకు నవలలపైగల యభిమానము నాటకరచనలయందుగల యభిలాష వీనిపై లేకున్నది. జగద్విఖ్యాతమై వరలిన భారతజాతి నేడు కాలవశమున అధఃపతనమై ప్రాచీన వైభవమును గోల్పడి అత్యంత దైన్యస్థితియందు పొర్లాడుచున్నది, పరాధీనతయే యీదుర్గతికి కారణము. ఈ మహాదుస్థితిని తొలగించుటకు మన ప్రాచీన నాగరికతల వర్ణింపగల చరిత్రగ్రంథములు మిగులతోడ్పడగలవు. ఈకారణముగూడ నన్నీకార్యమునకు ప్రేరేపించినది.

ఇంక గ్రంథవిషయము. ఇది యేగ్రంథమునకును అనువాదము కాదు, జైల్సు, వెగ్గ్, మున్నగు సుప్రసిద్ధ చరిత్రకారుల గ్రంథముల ననుకరించి వ్రాయబడిన యొక స్వాతంత్ర్యగ్రంథము. ఇందు స్వకపోలకల్పన లణుమాత్రమైన లేవు. ఫాహియాను వ్రాసిన యంశములనెల్ల యున్నవియున్నట్లు ఏట్టిమార్పులను జేయకయె యథాతథముగ తెనుగుభాషయందు వివరింప ప్రయత్నించితిని. ఈతని యాత్రవృత్తాంతము చదువరులకు సులభముగ గ్రాహ్యమగుటకై అచ్చట వ్యాఖ్యల జేర్చితిని. వీనిని పెక్కు గ్రంథముల పరిశోధించి వ్రాసితిని. ఫాహియాను వివరించిన రాజ్యములిప్పుడు చాలవరకు కాలవాహినిలో గలసిపోవుటచే అవి పూర్వమెచ్చట విలసిల్లినవో గుర్తింప ప్రయత్నించితిని. ఫాహియాను జీవితసంగ్రహమునుగూడ ఇందు జేర్చితిని.

బౌద్ధమతవ్యాప్తికై కట్టబడి భారత శిల్పసౌందర్యముల వెదజల్లు శిలాస్తంభములు, స్తూపములు విహారములు, చైత్యములు మున్నగు ప్రాచీన

కట్టడముల యాకార మెట్లుండునో సూచించుటకు కొన్ని చిత్రపటముల నిందు జేర్చితిని. ఆతడు పోయినమార్గమును దెల్పు భూగోళపటముగూడ ఇందు గలదు. ఇంకను జేర్చవలసిన చిత్తరువు లెన్నియో గలవు గాని గ్రంథమూల్యము పెరిగిపోవునను భీతిచే జేర్పలేదు. అదృష్టవశమున నీగ్రంథము ఆంధ్రమహాజనుల యాదరణకు పాత్రమగునేని ద్వితీయముద్రణమున జేర్పవలయునని యున్నది.

నన్నీ గ్రంథరచనకు పురికొల్పినది అత్యంతఉదారస్వభావులును, సరస్వతీపత్రికాసంపాదకులును, శ్రీ జయంతిపురసంస్థానాధిపతులు నగు శ్రీ వాసిరెడ్డి దుర్గాసదాశివేశ్వరప్రసాదరావు బహద్దరు జమీందారు వారు. ఇదివరకెన్నడును ఇట్టిగ్రంథమును వ్రాయవలెనను సంకల్పము నాకు జనింపలేదు. పుణ్యవశమున శ్రీవారితో నాకు పరిచయముగల్గుట సంభవించినది. ప్రసంగవశమున నొకనాడు శ్రీవారు ప్రాచీనహైందవనాగరికతాసౌభాగ్యముల వర్ణింపగల గ్రంథమును దేనినైన వ్రాయరాదాయని నన్ను హెచ్చరించిరి. అప్పుడు ఫాహియాను హ్యూయనిత్సాంగు మెగస్తనీసుల గ్రంథములు నామదికి స్ఫురించినవి. అప్పటినుండియే నే నీగ్రంథమును వ్రాయసాగితిని. శ్రీవారు బెజవాడ దయచేసినపుడెల్ల నాగ్రంథమును జూచి పోవుచు నాకు పలుతెఱంగుల ప్రోత్సాహ మొసంగుచుండిరి. హ్యూయనిత్సాంగు మెగస్తనీసుల గ్రంథములగూడ వ్రాసి ఆంధ్రలోకమునకు సమర్పింపవలెనని యున్నది. ఈశ్వరానుగ్రహమువలన నివి యు శీఘ్రకాలముననే పూర్తి చేయగలనను నమ్మకము గలదు.

ఈగ్రంథమును నేవడుగకుండగనే విజ్ఞానచంద్రికా గ్రంథమండలిలో నొక యనుబంధగ్రంథముగ ప్రకటించుటకియ్యకొనినందులకు తన్మండలి సంపాదకులగు శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు పంతులుగారికి నాకృతజ్ఞతాభివందనము లర్పించుచున్నాను. ఈగ్రంథరచనకు నన్ను ప్రోత్సాహించిన శ్రీజయంతిపుర సంస్థానాధిపతులకు నే నెంతయు కృతజ్ఞుండను.

ఇందెన్నిగాని దోషములుండును. ప్రాజ్ఞులు దెల్పినచో ద్వితీయముద్రణమున సవరించుకొందును.

విజయవాడ,
4—2—25.

వేలూరి సత్యనారాయణ.



## నాకీగ్రంథరచనయందు తోడ్పడిన గ్రంథములు.

| | |
|---|---|
| బౌద్ధ భారతము | రైసు డేవిడ్సు |
| జాతకకథలు | కోకిల్ యాషిన్ |
| బౌద్ధమతసంగ్రహము | హార్డీ |
| ఫాహియనుయాత్రలు | లెగ్గీ |
| ఫాహియానుయాత్రలు | జైల్సు |
| బుద్ధచరిత్ర | అశ్వఘోషుడు |
| లలితవిస్తర | |
| హ్యూయనిత్సాంగుయాత్రలు | బీలు. |

## ఫాహియాన్ జీవితసంగ్రహము.

నూతనరాజ్యముల నన్వేషించుటకును భూగర్భమున నిక్షిప్తమైయున్న సువర్ణరాసుల వెదకి కనుగొనుటకును, కష్టభూయిష్టములగు ప్రయాణముల సల్పిన మానవులెందరో లోకమున కలరుగాని పవిత్రగ్రంథముల వెదకి తెచ్చుటకై దీర్ఘయాత్రల సల్పి యిడుమలబడి యాపదల ననుభవించిన మహామహులీ భూమండలమున నంతగ గానరారు. అట్టియోధులలో నగ్రగణ్యుడు ఫాహియాను. వినయసూత్రగ్రంథముల వెదకి తెచ్చుటకై యీ సన్యాసి ఆర్యావర్తమునకు ప్రయాణమొనర్చి మహాకష్టముల బడి యితిహాసరంగమున ప్రఖ్యాతిగాంచెను. పదునైదు వందలేండ్లక్రిందట భారతవర్షమును దర్శింప చీనాసామ్రాజ్యమునుండి యిటకరుదెంచిన సుప్రసిద్ధబౌద్ధయాత్రికు డీతడే, ఈతని చరిత్ర నిచ్చట క్లుప్తముగ వర్ణింతును.

ఫాహియాను చీనాసామ్రాజ్యమందలి షాంగన్నగరమున నివసించు ఒకానొక బౌద్ధసన్యాసి. ఈతడు క్రీ. శ. 370 వ సంవత్సరప్రాంతమున జననమొంది పూర్వసిన్ను వంశరాజుల రాజ్యకాలమున వరలినవాడు.

పసితనముననే యాతడు విరాగియై సన్యాసదీక్షగైకొని బౌద్ధమతోద్ధరణకై తన జీవితశేషమంతయు ధారవోసెను. ఈతడన్యదేశమున బుట్టి అత్యంత ప్రాచీనకాలమున జీవించినవాడగుటచే ఈతని జీవితచారిత్రమును గూర్చి తెలుపగల గ్రంథము లంతగా గానరాకున్నవి. క్రీ. శ 519 సంవత్సర

ప్రాంతమున వ్రాయబడిన "సుప్రసిద్ధబౌద్ధసన్యాసుల జీవితములు" అను గ్రంథరాజమున ఫాహియాను జీవితము, సంగ్రహముగ వర్ణింపబడినది. ఇదివరకు యీసన్యాసుని విమలచరిత్రమునుగూర్చి నుడువగల యితరములగు నాధారములేవియు గన్పింపవు.

ఫాహియాను "కంగు" వంశమున బుట్టినవాడు. చీనాదేశమందలి "పియాంగ్" మండలములోని "ఉయాంగ్" పట్టణమాతని జన్మస్థానము. పుట్టినది వుయాంగ్ పట్టణమైనను ఫాహియాను చిరకాలము పాంగన్నగరము ననే నివసించెను. అచ్చటనె పెరిగి పెద్దవాడయ్యెను. ఈతని తలిదండ్రుల కీతడు నాల్గవతనయుడు. కాని పాపమీతనికి మూడేండ్లయిన నిండకమున్నె యీతని సోదరులు మువ్వురును మృత్యువాతంబడి తమ జననీజనకుల దుఃఖసాగరమున ముంచిపోయిరి. పుత్రవియోగములచే బొగిలి కృశించి యీతని తండ్రి విరక్తుడై యెచ్చటనైన బ్రతికియుండిన చాలునని తలచి ఫాహియాను నొక బౌద్ధమఠమున విడిచివచ్చెను. కాని పాపమాతడు తన ప్రేమపాశముల ద్రెంచుకొనజాలడయ్యెను. చావక బ్రతికియుండిన యొకడసారికుఱ్ఱ నెడబాసియుండలేకపోయెను. కతిపయదినములైన గడువకమున్నె యీతడు మరల మఠమునకేగి తన చిన్నితనయుని గొనివచ్చి యింటనుంచుకొని అతిగారాబమున బెంచుకొనజొచ్చెను. కాని యది యేమిపాపమోగాని యింట నడుగుపెట్టిననాటనుండియు నాబాలుడు వ్యాధిగ్రస్తుడయ్యెను. నానాటికి రోగము ముదిరెను. సుళువు దప్పెను. ఎన్నియౌషధములు ప్రయోగించినను కార్యము లేకపోయెను. ఇక జీవించుట కష్టమని యెల్లరును నిరాశ జెందిరి. మరల బౌద్ధమఠమునవిడచిన జీవించునేమోయను నాశతో నతని తండ్రి కన్నీరు గార్చుచు ప్రాణావశిష్టుడైయున్న యీపాపని భుజముపై నిడికొని మోసికొనిపోయి మఠమునడించివచ్చెను. తోడనె శాపముదీరినట్లు ఫాహియానునకు వ్యాధి మరలెను. క్రమక్రమముగ రోగము దిగజారి స్వస్థుడయ్యెను. ఆరోగ్యము గనినంతనే, యాతనితండ్రి మరల ఫాహియానునింటికి దీసికొనిపోవజూచెను. కాని యాపసిపాప దండులకు సమ్మతింపలేదు! అంతటనుండియు నాతడామఠమునందే తన జీవితమంతయు గడపెను. అప్పుడప్పుడాతని తలిదండ్రులు మఠమునకేగి బాలుని యోగక్షేమముల నరసి పోవుచుండిరి. ఇట్లు కొన్నివత్సరములు గడచెను. ఫాహియా



నునకు పదియేండ్లప్రాయము వచ్చెను. అప్పటినుండియు నాతనికి కష్టములు ప్రారంభమయ్యెను. ఈయేట నేతన్నెంతయో ప్రేమతో జూచికొనుచు, తనతోడిదే లోకమని మురియుచుండిన తనయనుంగుతండ్రి తన్నువిడచి దివికేగెను. తల్లి భర్తృవిహీనయై దిక్కులేని జీవమయ్యెను. శోకపరితప్తయై కన్నులనీరునింపుచు తల్లడిల్లుచుండెను. పాపమాపసిబాలుడేమిచేయును? కాని యీపాపని మనోధైర్యమేమియోగాని యాతడావంతయు చలింపడయ్యెను. తన మనోనిశ్చయమును విడువడయ్యెను. అతని మేనమామ, తనసోదరి దీనావస్థజూచి భరింపజాలక ఆతురముతో ఫాహియానుకడకు జని "తండ్రీ! నీజనని భర్తృవియోగముచే నేకాకియై వలవలనేడ్చుచు నీకై అహోరాత్రములు పరితపించుచు కృశించి పోవుచున్నది. నీదీక్షవదలి దుఃఖార్తయగు నీతల్లి నూరడింపుము. ఆమె బెంగగొనినది. ఆమెను ధైర్యముగనైన మాతృఋణము దీర్చుకొనుము." అని జాలిగదుర బల్కెను. కాని యాతని పల్కులు ఫాహియానుని నిశ్చయమును గదలింపలేకపోయెను. "అయ్యా, నాజీవితశేషమంతయు సన్యాసవృత్తియందే గడుప నిశ్చయించుకొంటిని. నాతండ్రి యనుమతి బడసి నేనీభిక్షుకవృత్తిని స్వీకరింపలేదు. క్షణభంగురములగు నీప్రాపంచిక సుఖముల నన్నంటకుండుటకే, నేనిట్లు విరాగినైతిని. "అయ్యా దుఃఖభాజనమగు సంసారజలధియందు నన్నేల బడద్రోయజూచెదవు. క్షమింపుము. నాసంకల్పమును విడనాడజాలను." అని ఫాహియాను నిర్మలకంఠస్వరముతో ప్రజ్వలితనయనములతో ప్రత్యుత్తరమిచ్చెను. ఆబాలుని నిశ్చలవైరాగ్యమునకు విస్మయుడై యాతడు మాఱుబల్కజాలక "యింక నేమి జెప్పినను ప్రయోజనములేదు. నామాట లీతని చెవికెక్కవు" అని ఖిన్నుడై వెడలిపోయెను.

మరికొంతకాలమునకు అతని తల్లియు భర్తృమరణమునకై యడలి, యడలి కాగి, కృశించి యెట్టకేలకు కాలముదీరి ప్రాణములవిడచెను. ఈదుఃఖవార్త వినినతోడనే, ఫాహియానుని హృదంతరాళముల మణగియుండిన ప్రేమతరంగము లొక్కసారిగ పొంగి ప్రవహిల్లెను. అతని కనుగవలనుండి బాష్పధారలు గురిసెను. పిమ్మట నతడు తనతల్లిమృతకళేబరమునకు గావింపవలసిన సమాధిసంస్కారాదికృత్యములొనర్చి వచ్చి మరల మఠమున ప్రవేశించెను. ఆహా, ఏమి యీతనిత్యాగశీలత? వైరాగ్యగరిమ?

ఫాహియాను చిన్ననాటనుండియు తన యనన్యధైర్యసాహసములకు ప్రసిద్ధిగాంచెను. ఒకనాడాతడు తనతోడి సన్యాసులతో గలసి యూరిబైటనున్న వరిపొలమును కోయుచుండ, నాకస్మికముగ దొంగలగుంపొకటి వచ్చి వారిపైబడెను. నిరాయుధులగు సన్యాసులు భయకంపితులై ధైర్యముజెడి పికాపికలైపరుగులెత్తిరి. ఫాహియాను మాత్రము మహాసాహసియై వెరువక యచ్చటనే నిలచి విభ్రాంతులై తన చర్యల నవలోకించుచున్న చోరులజిక్కు మొగంబై గంభీరస్వరముతో నిట్లు పన్యసింపసాగెను:—చోరులారా మీరు సస్యమును కోరివచ్చితిరేని మీయిచ్చవచ్చినంత గొనిపొండు. కాని మీదుస్థితిని జూచిన నాకు మిగుల జాలియగుచున్నది. పూర్వజన్మమున మీరు దుర్గుణయుతులై, ధర్మశూన్యులై యొరులకు బెట్టకుండుట చేతనే మీకీజన్మమున యిట్టిదుర్భరదారిద్ర్యము దాపురించినది. ఈజన్మమున గూడ మీ రవినీతులై చరించుచున్నారు, మీదుమిక్కిలి చౌర్యమునకు గూడ గడగితిరి. అయ్యో, మీకీ దారిద్ర్యమింక తప్పదు. ఎన్నిజన్మములకైన మిమ్మది వెన్నాడి పీడించుచుండును, అని విలపించి ఫాహియాను అచ్చోటు వాసి వెడలిపోయెను. చోరులాతని పల్కులు విని నిశ్చేష్టులై పోయిరి. ఫాహియానుని సాహసచర్యయు అతని పరితాపము ఆచోరుల హృదయసీమలయం దద్భుత పరివర్తనము గల్పించెను. ఒక్కక్షణములో వారి చిత్తవృత్తులు మారిపోయెను. దొంగలు పశ్చాత్తప్త హృదయులై సస్యమును ముట్టకయె వెడలి పోయిరి. అప్పటినుండియు నాచోరులు తమ దుష్పథమును వీడి సన్మార్గగాములైరి. సోదర భిక్షువులాతని నిశ్చల సాహసమున కచ్చెరువంది యాతని యెడ ననురాగబద్ధులైరి. అతని ప్రసిద్ధి చీనాసామ్రాజ్య మంతటను వ్యాపించెను.

నిర్ణీతమగు శిక్షణకాలము ముగియగనే ఫాహియాను బౌద్ధగ్రంథరాజమగు వినయ పీఠికను సంపాదించి తెచ్చుటకై ఆర్యావర్తమునకు బయలుదేరెను. అతని యాత్రావృత్తాంతమును చీనాదేశమునకు దిరిగిపోవునపుడు మార్గమున నతని కొదవిన కష్టములును అతని గ్రంథమున సాకల్యముగ వర్ణింపబడినవి.

ఫాహియాను క్రీ. శ. 399 సంవత్సరమున (అప్పటి కాతడిరువది యైదేండ్ల ప్రాయమువాడు) భారతవర్షయాత్రకై సాంగన్నగరము నుండి



బయలుదేరి పాదచారియై ఆరుదీర్ఘవర్షము లహోరాత్రములు ప్రయాణ మొనర్చి గోబీ యెడారిమున్నగు నిర్జన ప్రదేశముల నిర్గమించి అత్యున్నతము లగు పర్వతశ్రేణుల దాటి ఆర్యావర్తమును జేరెను. అచ్చట నారుసంవత్సరము లుండి సంస్కృతభాష నభ్యసించి పెక్కుమతగ్రంథముల సముపార్జించి యటనుండి మరల పయనమై మూడేండ్లు సముద్రయాన మొనర్చి సింహళ, యవద్వీపములజుట్టి మాతృదేశమునకు మరలిపోయెను. యాత్రాసౌకర్యము లంతగా లేని యాప్రాచీన కాలమున స్వమతపోషణకై యంతదూరప్రయాణ మొనర్చి పదునైదు వత్సరము లన్యదేశముల చరించిన ఫాహియానుని స్వమతాభిమానకార్యదీక్ష లనన్యములు. అత్యంతప్రశంసనీయములు.

ఆకాలమున నంతటి దూరప్రయాణము చేయుట మిగుల కష్టసాధ్యమైయుండెను. ఫాహియాను మార్గమధ్యమున నెన్నియో శ్రమల బడెను. నిర్మానుష్యమై, భీషణవాయు దుమారముల కాకరమై దుర్గమమగు గోబీ యెడారిని దాటెను. వడవడ వణకించు శీతలవాయువులకు నిలయములగు నున్నతపర్వతావళుల నిర్గమించెను. పర్వత శిఖరములనుండిజారి యతివేగమున బారు సెలయేటి ప్రవాహములదాటెను. నిర్జలమై శిలావృతమై క్రూరమృగ జాలముల కావాసభూములగు పర్వతప్రాంతములబడి ప్రయాణమొనర్చెను. మార్గమున, షెన్ షెన్, ఉస్తాన, కేచా, కన్యాకుబ్జ, కోసల, గాంధార, మగధ, మున్నగు రాజ్యముల నెన్నియో అవలోకించెను. ఉస్తానఉదయన, గాంధార రాజ్యముల గూర్చి యీతడు గావించిన ప్రశంసలు చరిత్రపరిశోధకుల కత్యంతోపయుక్తములైనవి. చైనాసామ్రాజ్యము నుండి భారతవర్షము దనుక నాతడు గాంచిన దేశములన్నియు, భారతరాజ్యౌన్నత్యమునకు దోసి లొగ్గినవి. అన్నిటియందును భారతవర్ష దిగ్విజయపతాక మెగురుచుండెను. ప్రాచ్య ప్రపంచమున భారతదేశ ఆధ్యాత్మిక సామ్రాజ్యము సుస్థాపిత మయ్యెను. ఈరాజ్యము లన్నిటికిని, ఆచార నడవడులందు వేషభాష మర్యాదలయందు, విజ్ఞాన వ్యవహారములందు, శిల్పచిత్ర కళాసాహిత్యము లందు భారతవర్షము శాసనకర్తయై విరాజిల్లెను. ఇటీవల పూర్వతురుష్క స్థానమందు, భూగర్భమునుండి బయలు వెడలిన శిల్ప శిథిలములు ప్రాచీన భారతసామ్రాజ్య విభవమునకు సాక్షీభూతములు.

ఎట్టకేలకు ఫాహియాను ఆర్యావర్తము జేరెను. హుగ్లీ సింధునదుల మధ్యనుండు యావద్భాగభూమిని వీక్షించెను. ఇతిహాస ప్రసిద్ధములగు పట్టణముల పుణ్యతీర్థముల పెక్కింటిని దర్శించెను. వైద్యశాస్త్రమునకును, శస్త్రచికిత్సకును భూవలయమున ప్రసిద్ధిగాంచి సకలశాస్త్రపారంగతులగు పండితులకు నిలయమై ఏడు శతాబ్దములు మహోన్నత పదవి ననుభవించి ప్రపంచమున నన్ని ప్రాంతములనుండి విద్యార్థుల నాకర్షించిన తక్షశిలానగరమును గాంచెను. హిందువులకు పావన క్షేత్రమగు వారణాసికేగెను. శాక్యసింహుని జన్మ స్థానమగు కపిలవస్తుపట్టణమును సేవించెను. గౌతముడు బుద్ధత్వము నొందిన గయాక్షేత్రమును వీక్షించెను. ఆతడు నిర్యాణము నొందిన కుశనగరమును గాంచెను. బుద్ధభగవానుని జన్మభూమిని దర్శించి ఫాహియాను పులకాంకితుడయ్యెను. ఆ తేజోమూర్తి పూర్వకాలమున నిచ్చోటనే యవతరించి సురంగమ సూత్రముల బోధించినాడు. అదృష్టహీనుడనగు నేనీకాలమున జన్మించి ఆలోకకల్యాణుని జూచుభాగ్యమును నోచుకొననైతిని. అతడు పావన మొనర్చిన పుణ్యభూముల మాత్రము గాంచగల్గితి"నని విలపించెను.

అత్యున్నతమై బుద్ధభక్తులకు మహాపవిత్రమగు బోధిద్రుమమును గాంచి ఫాహియాను భక్తిపరవశుడయ్యెను. అశోకసార్వభౌముని మనోహారిణి లావణ్యరాశి తిష్యరక్షిత తన విభునకొక్క తరువుపైడ నింత ప్రేమ యేలకో యని అసూయాగ్రస్థయై యావృక్షమును దెగనరికించిన యుదంతమును అశోకభూపాలుని భక్తి ప్రభావమున నావృక్షరాజము మరల జిగిర్చి శాఖలతోడిగి విస్తరించుటయు లోనుగాగల చిత్రకథనమును ఫాహియాను మనోహరముగ వర్ణించినాడు. ప్రాచీన భారతేతిహాస క్షేత్రమున ప్రసిద్ధిగాంచిన రాజగృహపట్టణ పరిసరములనుండు గృధ్రకూటపర్వతము నధిరోహించి యందలి చిత్రముల నారసెను.

ఫాహియానునితో భారతవర్షమున కరుదెంచిన తోటి యాత్రికుడు ఆర్యావర్తవైభవమును జూచి సమ్మోహితుడై "నేను బుద్ధత్వమును బడయువరకు నిందేయుండెదను. పరభూముల ద్రొక్కను" అని పాటలీపుత్ర నగరమున తన నివాసమేర్పరచుకొని యచ్చటనే యుండిపోయెను. ఫాహియాను మాత్రము తక్షణమే భారతఖండమునుండి మరల బయలుదేరెను.



అతని మతాభిమానమెంత గాఢమైనదో యాతని దేశానురాగమంత ప్రబలమయినది. బౌద్ధశిక్షణ గ్రంథములు లేమి తనరాజ్యమునకు వాటిల్లిన కొరత దీర్చుటకై ఫాహియాను ఆర్యావర్తమునకు పయనమయ్యెను. ఈ పవిత్రకార్య సాఫల్యమునకై యాతడు మాతృదేశమునకు మరల మరలి పోవలయును. అందుచే నాతడు దిన్నగ ప్రయాణమై హుగ్లీనదీముఖద్వారమున నోడనెక్కి సింహళమునకుబోయి యచ్చట రెండేండ్లు గడపి మరల నావనెక్కి చీనాసామ్రాజ్యమునకు వెడలిపోయెను. అతడెందుచేతనో దక్షిణాపథమును దర్శింపలేదు.

అతనికి సముద్రమున నెన్నియో కష్టములొదవెను. ఓడ ప్రళయమగు తుపానుల జిక్కుకొని మునిగిపోవుటకు సిద్ధమయ్యెను. తాను పదునయిదు దీర్ఘవత్సరములు దేశాటనమొనర్చి శ్రమలకోర్చి గొనివచ్చుచున్న అమూల్య గ్రంథములు సముద్రగర్భమున మణిగిపోవునేమోయని దిగులుపడెను. బౌద్ధశ్రమణకుల యనుగ్రహము వలన నాగండము గడచెను. సురక్షితముగ ఫాహియాను మాతృదేశమును జేరెను. అతని సముద్రయాన వృత్తాంతము హైందవుల నౌకాశిల్పనాచాతుర్యమును నౌకాయాన విద్యాకౌశలమును వేనోళ్ళ జాటి భారతీయులకు నౌకాయాన కళానైపుణ్యము పూజ్యమని వాపోవు పాశ్చాత్య చరిత్రకారుల కుత్సితపువ్రాతలెంత యదార్థములో బయటపెట్టుచున్నది.

ఫాహియాను చీనాదేశమును జేరిన పిమ్మట ♦ బుద్ధభద్రునితో కలసి తాను భారతదేశమునుండి గొనివచ్చిన సంస్కృత గ్రంథముల తన మాతృభాషలోని కనువదింపదొడగెను. కాని యింతటితో నాతని యాయువుజెల్లిపోయెను. గ్రంథమింకను పూర్తిగాకమున్నె యాతడు ఎనుబదిరెండవ యేట

---


♦ బుద్ధభద్రుడు ఆర్యావర్తమునుండి చీనా సామ్రాజ్యమున కేగిన ప్రఖ్యాత బౌద్ధపండితుడు. ఆకాలమున రాజ్యమేలిన చీనా సామ్రాజ్యవిభునిచే నాహ్వానింపబడి యాదేశమునకు బోయెను. ఫాహియాను తన యాత్ర ముగించి చీనాదేశమును జేరునప్పటికి పండితవర్యుడు చీనా సార్వభౌముని యాస్థానమున నుండెను. పూర్వకాలమున నిట్లు చీనాదేశ చక్రవర్తులచే నాహ్వానింపబడి పెక్కండ్రు హైందవ పండితులా దేశమునకు బోవుచుండిరి.

కింగ్ చౌ పట్టణమున "సిన్సు" అనునొక బౌద్ధ సంఘారామమున నస్తమించెను.

ఈతడు ఎనిమిది దీర్ఘవర్షము లుత్తరభారతసింహళ ద్వీపములఁ గుమ్మరి యచ్చట దాఁగాంచిన విశేషముల నప్పటి, భారతమత సాంఘిక, రాజ్యాంగ పరిశ్రామిక వ్యవస్థలవర్ణించి యున్నాఁడు. చరిత్రాధారము లంతగా లేని యా కాలమునాటి భారతవర్షచారిత్ర నిర్మాణమునకు నితని గ్రంథ మమూల్య సాధనము. ఈతడు తన యాత్రావృత్తాంతము వెదురుబద్దల మీదను పట్టువల్లువల మీదను వ్రాసెను. ప్రాచీనభారత నాగరికతా విభవముల నీతడు వేనోళ్ల ప్రస్తుతించినాఁడు. పూర్వకాలమున ప్రాచ్య పాశ్చాత్య ప్రపంచములందు భారతఖండ మెట్టి యగ్రస్థాన మలంకరించినదో మన మెఱుగము. ఇటీవల గావింపబడిన చరిత్రపరిశోధనలు మన కన్నులఁదెరచినవి. నాల్గవ శతాబ్దకాలమున భారతవర్ష మెట్లుండెనో వర్ణించి ఫాహియాను మనకెంతయు చిరస్మరణీయుఁడయ్యెను. కాలవాహినిలోఁబడి మ్రగ్గిపోవుచుండ ప్రాచీన భారతనాగరికతా చిహ్నములు భూలోకమున విస్మృతమై పోవుచుండ కాపాడి ఒక్క భారతవర్షమునకే గాక నాగరికతా ప్రపంచకమున కంతకును గూడ మన పాంథుఁడు చిరస్మరణీయుఁ డయ్యెను.



# ఫాహియాన్ భారతవర్షయాత్ర.


ఫాహియాన్
భారతవర్షయాత్ర
— అతడు పోయినమార్గము
బంగాళా
సముద్రము
హిందూ మహాసముద్రము
బోర్నియో
సయాం
మహానది
వారణాశి
గయ
మధుర
సింధునది
సింగ్ ఛౌ
లంగ్
హొయాంగ్ హో
సుమత్రా
యవద్వీపము

# ఫాహియాన్
# భారతవర్షయాత్ర

## మొదటి ప్రకరణము

### ప్రయాణము

ఫాహియాను ఛంగన్నగర* నివాసియగు నొక బౌద్ధ సన్యాసి. ఈతడు చీనాసామ్రాజ్యమునందలి బౌద్ధశిక్షణ(సూత్ర) గ్రంథముల జీర్ణావస్థగాంచి మిగులచింతనొంది యాకొరంత దీర్చుటకై యుంర్యావర్తమునకుబోవ సంసిద్ధుడయ్యెను.

---

(*) ఛంగన్నగరము ప్రాచీన చైనాసామ్రాజ్యమున ప్రసిద్ధిగాంచినయొక గొప్పనగరరాజము. పురాతన కాలమున చైనాదేశమున విలసిల్లిన "హాన్న," 'సూయి' సామ్రాజ్యముల కిదియే రాజధానీ నగరము. మన పాంథుడగు ఫాహియాను జీవించిన కాలమున నీపట్టణము 'సిన్న' రాజ్యత్రయములోని ప్రధానరాజ్యమునకు రాజధానియయ్యెను. ఈనామ మునబరగు జిల్లాయొక్కటి 'షెన్సే' మండలమున నప్పటికిని గలదు.

'వాంగ్‌షే'♦ శక 'కేహే' నామసంవత్సరమున నీతడు తనమిత్రులగు హ్వ్యాయింగ్, హ్వ్యాకై, హ్వ్యాకింగ్, టౌచింగ్‌ల వెంటగొని సూత్రగ్రంథముల‡ నరసి తెచ్చుటకై భారతవర్షమునకు బయలుదేరెను.

మన యాత్రికు లట్లు ఛంగన్నగరమునుండి బయలు

♦ వాంగ్‌షే- ఇది యొక శకనామము. ఈ శకము క్రీ. శ. 399వ సం॥న ప్రారంభమై 414 వ సంవత్సరమున నంతమయ్యెను. కాన ఫాహియాను క్రీ. శ. 399వ సంవత్సరమున చైనారాజ్యమునుండి బయలుదేరెనని నిర్ణయింపవచ్చును. పై నుదహరింపబడిన 'కేహే' సంవత్సరము 399 వ సంవత్సరమునకు సరియగును. 'కేహే' ప్రభవ, విభవ, మున్నగువానివలె చైనాభాషలో నొక సంవత్సరనామము. "విఖ్యాతసన్యాసుల జీవితముల" రచించిన గ్రంథకారుడు తనగ్రంథమున ఫాహియాను భారతవర్షయాత్రకై 'లంగన్' శక తృతీయవత్సరమున చైనాదేశమునుండి బయలువెడలెనని వివరించియున్నాడు. లంగన్ శక తృతీయవత్సరమును 399 వ సంవత్సరమే యగును. "లంగన్"- యిదియును నొకశకనామమే. ఈ శకము "తూర్పుసిన్న" వంశపు రాజులచే బ్రారంభింపబడినది.

§ ఈ నామము లన్నియు, 'ఫాహియా'ను నామము వలెనే, చైనాదేశమున బౌద్ధసన్యాసుల కొసంగబడు బిరుదనామావళి.

‡ శిక్షణగ్రంథములు. సూత్ర, వినయ, అభిధర్మపీఠకలు మున్నగు గ్రంథములను శిక్షణగ్రంథము లనిపేరు. బౌద్ధవాఙ్మయమున నియ్యవి ప్రసిద్ధిగాంచిన గ్రంథరాజములు.



వెడలి లంగు¶ రాజ్యమును నిర్గమించి గొన్ని దినములకు కీన్వోయి*నృపాలుని రాజ్యమును జేరిరి. అంతలో వర్షఋతువు ప్రారంభమయ్యెను. వర్షకాలమున బౌద్ధసన్యాసులు ప్రయాణము సలుపరాదు♦. మన పాంథు లందుచే వర్షకాలము గతించువరకు నిందేయుండి పిమ్మట బయనమై నౌటాను† భూవరుని రాజ్యమును సమీపించి యా ప్రాంతముననున్న 'యాంగ్'లో బర్వతావళులదాటి 'ఫాంగ్‌యీ'కి బోయిరి. ఈతరుణమున నీరాజ్యమంతయు నరాజకమై కల్లోలభూయిష్ఠమైయుండుట వలన మన బాటసారు లీరాజ్యమున బ్రయాణమొనర్చుటయే కష్టమయ్యెను. బాటలన్నియు చోరులకును, దురాచారులగు దుండగీడులకును శరణ్యములై రక్షణశూన్యములై యపాయకరములై యుండెను. అదృష్టవశమున నీదేశమును బాలించు రాజుమాత్రము దయాశీలుడు. ఈతడు మన పథికులకు దనరాజ

¶ లంగు - ప్రాచీన చైనాసామ్రాజ్యమునందలి యొక చిన్న రాజ్యము.

* కీన్వోయినృపాలుడు, పశ్చిమసిన్నవంశపు రాజులలో రెండవవాడు. సిన్నవంశము ప్రాచీన చైనాసామ్రాజ్యమున ప్రసిద్ధిగాంచిన రాజవంశము.

♦ ప్రార్థనాది కృత్యములొనర్చుచు బౌద్ధభిక్షువు లేదేని నొక బౌద్ధమఠమున వర్షకాలమంతయు గడుపవలయును. బౌద్ధమతమున నిదియొక యాచారము.

† నౌటాను భూవరుడు చైనాసామ్రాజ్యమునందలి పశ్చిమ ప్రాంతమున రాజ్యపాలనమొనర్చు యొకానొక నృపాలుడు.

ఖానీపట్టణమున నాశ్రయమిచ్చి, వేయితెరంగుల వారి నాదరించి వలయు సౌకర్యముల నొనగూర్చి 'దానపతి'§ యను బిరుదనామమునకు బూజ్యత నార్జించుకొనెను.

ఇచ్చటనే మన తెరువరులు చేయాన్, యూకిన్, సాంగ్ షో, హోయాన్, సాంకింగు‡ మున్నగు మరికొందర చైనాయాత్రికుల దారసిల్లిరి. వీరును చైనారాజ్యమునుండి-యాత్రార్థమై భారతఖండమునకు బోవుచుండిరి. ఉభయులకును గమ్యస్థాన మొక్కటియే యగుటచే వార లచ్చట తారసిలినందుల కెంతయు సంతసించుచు, మార్గమున నొండొరులారసినవింతల జెప్పుకొని యానందించుచు సంతోషమున వర్షకాలమంతయు నిచ్చటనే గడిపిరి.

వర్షఋతువు గతించినంతనే మనపాంథు లిచ్చటనుండి పయనమై కొన్నిదినములకు చైనాసామ్రాజ్యమునకు బశ్చిమసరిహద్దులలోనున్న 'టన్వాంగు' బట్టణమును జేరి యొక్కమాస మిచ్చటనుండి మార్గశ్రమం బుడిపికొనిరి. ఇచ్చటనుండి మనయాత్రికులు రెండుతెగలుగ జీలిపోయిరి. ఫాహియానును, నాతని నల్వురుమిత్రులును 'హాయూను' మున్నగువారల నీపట్టణమున

§ బౌద్ధమఠ నిర్మాణ పోషణాది ధర్మకార్యము లొనర్చుచు బౌద్ధమత వ్యాపనకై తోడ్పడు రాజన్యుల కొసంగబడు బిరుదనామము.

‡ వీరును భారతభూమిని దర్శించుటకై బయలువెడలిన చైనాయాత్రికులె. వీరిలో "హోయున్" మిగుల ప్రసిద్ధినొందినవాడు. ఇతడు భారతవర్షము నుండి దనమాతృదేశమునకు తిరిగివచ్చినపిదప పెక్కు సంస్కృతగ్రంథముల దన మాతృభాషలోనికి కనువదించెను.



విడచి మున్నగా బయలుదేరి, యొకానొక రాయబారి¶ నను గమించి ముందునకు సాగిపోయిరి.

టన్వాంగుపట్టణమును వీడి కొంతదూర మరుగునరికి మన యాత్రికుల కొక మహాయెడారి గాన్పించెను. ఇదియె భయానకమగు 'గోబీ' యెడారి*. మన పాంథులీ సైకత పారావారమును దాటిపోవలయు. మార్గసౌకర్యము లంతగాలేని యాప్రాచీనకాలమున యెడారులదాటుట మిగుల గష్టసాధ్యముగ నుండెను. ఇదియునుగాక గోబీ యత్యంతభయంకరమగు నెడారి. ఇదిదుష్టపిశాచగణముల కావాసభూమి. భీకరమగు వేడిగాడ్పు లిందు తరుచుగ వీచుచుండును. పాంథు డెవ్వడేని దౌర్భాగ్యవశమున నీయుష్ణవాయువులవాత బడినచో వాడింక జావక బ్రతుకుటకల్ల. ఈయెడారియం దెంత వెదకినను జీవరాసులెవ్వియు గానరావు. గగనపథమున సంచరించు విహంగములుగాని,

¶ ఈ రాయబారి యెవ్వరో, యే దేశమునుండి యెచ్చటికి బోవుచుండెనో తెలియుటలేదు. ఫాహియానుని వ్రాతలలో దెలిసికొనుట కట్టి యాధారములును గానరావు.

*గోబీయెడారి:— "కోబీ" యనికూడ దీనికి నామాంతరముగలదు. ఇది మంగోలియా రాజ్య పరిసరములనుండి టర్కీస్థానము వరకును రెండువేల మైళ్ళ పొడవున వ్యాపించియుండు మహాయెడారి. అంతయు నిర్జీవ, నిర్జల ప్రదేశము. అప్పుడప్పు డీయెడారిలో ప్రళయభీకరమగు గాలి దుమారములు రేగి యూళ్ళనుగూడ గప్పివేయుచుండును. ఒక్కమా రుపద్రవకరమగు ఝంఝామారుతములేచి యొక్కనాటిలో మున్నూటయరువది మహానగరముల నిసుకలో బూడ్చివైచెనట!

పృథ్వీతలమునదిరుగు మృగసంతతులుగాని, కనుచూపుమేరదూరమున నెచ్చటను మచ్చునకైన గాన్పింపవు. మృగ, పక్షి, క్రిమి, కీటకాశూన్యమై, నిర్మానుష్యమై యీయెడారి యెంతయు భీతిగొల్పుచుండును. ఎంతదూర మరసినను యీమహాయెడారిలో మార్గము గానరాదు. మనుజులేగిన పదచిహ్నములైన గన్పింపవు.

అచటచ్చట బడియుండు విగతజీవుల శల్యఖండములు దక్క నీయెడారిభూమియం దెచ్చటను ప్రాణిసంచారమే కానబడదు.

టన్వాంగుపురాధీశ్వరుడగు లేహో* మిగులదయార్ద్రహృదయుడు. ఇతడు మన చైనాయాత్రికులకీయెడారిదాటుటకు వలయు ప్రయాణసాధనముల సమకూర్చి బున్నెముగట్టుకొనెను.

## రెండవప్రకరణము

### 'షెన్షన్' 'ఖోటను' రాజ్యములదర్శించుట

మనపాంథులెట్లో యీమహాయెడారినిదాటి యటుపిమ్మట బదునేడహోరాత్రములు ప్రయాణమొనర్చి నూటయేబది క్రోశములదూరమరిగి, యెట్టకేలకు షెన్షన్♦ నను రాజ్యమును జేరిరి. ఈ రాజ్యము పాషాణభూయిష్ఠమగు పర్వతప్రాంతము. భూమియంతయు నిస్సారమగు కటిక నేల. ఇందునివసించు జనసామాన్యము మోటువస్త్రముల దాల్చెదరు.

'హాన్న' + నామ్రాజ్యమందలి ప్రజాళివలెనే యిచ్చటను గొందరుజనులు సన్ననిరోమవస్త్రముల ధరింతురు. ఈరాజ్యమేలునృపవరుడు బౌద్ధమతావలంబుడు. ఇచ్చట నాల్గువేలమంది బౌద్ధసన్యాసులుగలరు. వీరందరును హీనయానులు.§

---

*లేహో:— టన్వాంగు పట్టణాధిపుడు, ఉదారచరితుడు. విద్యాసంపన్నుడు. సుగుణరాశి. సుపరిపాలనచే దన ప్రజల సౌఖ్యముల దేర్చి కీర్తి పొందిదయ్యెను. ఇతని కృపావిశేషమువనే దుర్గమభూమియగు గోబీయెడారిని మన పాంథులు దాటగల్గిరి.

♦ ఈ రాజ్య మెచ్చట విలసిల్లెనో సరిగా జెప్పుటకు వీలులేకున్నను లాబ్ సరస్సున కనతిదూరమున నుండెనని మాత్రము చెప్పుటకు బెక్కునిదర్శనములు గలవు. ఇయ్యది టన్వాంగు పట్టణమునకు మున్నూరుమైళ్ళదూరమున నుండెనని ఫాహియాను యాత్రికుడే తెల్పుచున్నాడు. ఈ రాజ్యమును ఎకు బదునేడుదినములు పట్టెగావున మన తెరువరులు రోజునకు బదునదిమైళ్ళకంటె నెక్కువదూరము ప్రయాణము చేసియుండవలెను.

+ చీనాసామ్రాజ్యమునకు వేరొకనామము. ఫాహియాను తనమాతృభూమియగు చీనాసామ్రాజ్యమును తన యాత్రావృత్తాంతమున నీ నామమునచే సర్వదా పేర్కొనుచుండును. హాన్నవంశజులచే బాలింపబడినరాజ్యము గావున దీనికి హాన్నసామ్రాజ్యమని పేరుగల్గెను.

§ హీనయానము యానత్రయములో మొట్టమొదటిది. బౌద్ధమతమున సంసారజలధిని దాటి నిర్వాణతీరమును జేరుటకు హీనయాన, మధ్యమయాన, మహాయానము లనబడు మూడుమార్గములు గలవు. వీనినే బౌద్ధమతగ్రంథము లందు "యానత్రయ" మందురు. బౌద్ధమతము క్షీణదశ నొంది భిన్నశాఖలుగ జీలిపోయిన పిమ్మట ఒక్కొక్కశాఖ కొక్కొక్క సిద్ధాంతము బయలువెడలెను. ఈ సిద్ధాంతవిభేదములకే హీనయానము మున్నగు నామములు వాడబడ జొచ్చెను. "హీనయాన"ము నిర్వాణసాధనక్రియమున గడపటి సాధనము. బ్రహ్మచర్యవైరాగ్యాది సన్యాసవిధులం దిమిడియున్నవి.

ఈ రాజ్యమందును, నీ పరిసరరాజ్యములందును నివసించు ప్రజాళియు శ్రమణకులును * భారతవర్షమున ప్రబలుచుండెడి బౌద్ధమతాచార విధానముల ననుసరించుచుండిరి. హైందవులు వీరికంటె నెక్కుడత్తురయుక్తముగాను విధివిధానముగను వీని ననుష్ఠించెదరు. మతానుష్ఠానములందు భారతప్రజకును వీరికిని నింతియె తారతమ్యము. ఇచ్చోటనుండి పశ్చిమముగ బ్రయాణమొనర్చుచు మన పాంథులు దర్శించిన రాష్ట్రములందలి ప్రజలెల్లరును నిట్లే భారతదేశమున ప్రబలుచుండిన బౌద్ధనియమములనే పాటించుచుండిరి. కాని వీరు మన తెరువరులకు దురవగాహమై కర్ణకఠోరమగు ♦ నొక యడవిభాషను మాట్లాడుచుండిరి. సంసారముల త్యజించి సన్యాసదీక్షగైకొనిన బౌద్ధభిక్షువులుమాత్రము హైందవగ్రంథముల బఠింపుచు హైందవ భాష నుచ్చరించుచుండిరి. ఇచ్చట మన యాత్రికులొక్క మాసముండి పిమ్మట నీ రాజ్యమునువిడి పశ్చిమోత్తరదిశగా జని పదునైదు దినములకు వూయి + యను దేశమును సమీపించిరి. ఇదియును బౌద్ధరాజ్యమే. ఇందు నివసించు బౌద్ధసన్యా

బౌద్ధసన్యాసులకు శ్రమణకులని పేరు.

మంగోలియా తార్తారుభాషయై యుండనోపు.

+ ఈ దేశమెచ్చట నున్నదో యింతవరకును గుర్తింపబడలేదు. ఇందు నాలుగువేల బౌద్ధసన్యాసులుండిరని వర్ణించుటచే నిది యొకగొప్పరాజ్యమై యుండనోపునని యూహింపవలసియున్నది. ఇయ్యది "కుత్సక" "కరస్కరు"ల మధ్య నుండియుండునని కొందరు చరిత్రకారు లూహించుచున్నారు.



సులు నాల్గువేలకు పైగానుందురు. వీరందరును హీనయానులు. తమ గ్రంథమున జెప్పబడిన విధమున నిసమైన దప్పకుండ వీరు బౌద్ధనియమముల ననుష్ఠింతురు. సిన్ను (చైనా) రాష్ట్రమునుండి చనుదెంచుచుండిన మన యాత్రికులు నియమానుష్ఠానముల యందు వీరితో తులదూగలేకపోయిరి. ఇచ్చటి బౌద్ధమఠమున కుద్దేశికుడగు (మఠాధిపతి) ఫూకంగుసను ♦ యనుమతి వేడి మనపాంథులీ భిక్షుకాలయమున రెండుమాసములుండి విశ్రాంతిగొనిరి. ఇచ్చటనే పాయూనును నాతని మిత్రులును మరల వీరినిగలిసికొనిరి.

బౌద్ధమతావలంబులైనను యీ 'వూయీ' రాజ్యమున నివసించు ప్రజలు మిగుల క్రూరస్వభావులు. అతిథి మర్యాదల నెరుంగని మూఢులు. దూరదేశమునుండి వచ్చుచుండిన మన పాంథులకు వీరుచితమర్యాదల నొసంగి యాదరింపరైరి. గృహస్థధర్మముల నిట్లు మంటగలిపిరి. తూష్ణీంభావమున మెలగుటచే మనబాటసారులాశాభంగులై విసుగుజెందిరి. చేయాఙ్, యూకీఙ్, హ్యూంవె లింక నీదేశమున నుండనొల్లక వెనుకకు మరలి తమ యాత్రాసాఫల్యమునకై వలయు ధనమును సమకూర్చుకొనుటకై కోషాంగు* రాజ్యమునకు బయనమైపోయిరి. ఫాహి

ఫూకంగుసను:— "వూయీ" రాజ్యమున నీతడొక మఠాధిపతి. మఠాధిపతులకు బౌద్ధగ్రంథములందు "ఉద్దేశికు" లని పేరు. ఈతని నామములోని "ఫూ" యనునది యీతని యుద్యోగనామమును, కంగ్సను ఈతని నిజనామము నయి యుండనోపు. ఈతని పేరునుబట్టి యీత డొకసామంత మండలాధీశ్వరుని సంతతిలోనివాడని తోచుచున్నది.

ప్రకృతి 'టాంగూట్' జిల్లా సమీపమున విలసిల్లిన చిన్నరాజ్యము.

యానును నాతని యనుచరులును మాత్రము ఫూకంగ్సను దయావిశేషమున ముందునకు సాగిపోవ గలిగిరి. తిన్నగా వీరలు నైఋతిదిశాభిముఖులై నడచిపోయిరి. ఆప్రాంతమంతయు జనశూన్యమై భీతిగొల్పుచుండెను. మార్గమున వీరి కొదవిన కష్టపరంపరలు కడు విషాదకరములు. మహావేగమున బారు కొండవాగుల దాటునపుడు వీరు పడిన యిడుమల వర్ణింప నలవి గాదు. మున్నెవ్వరు నిట్టికష్టముల ననుభవించి యెరుగరు. ఇట్లెన్నియో శ్రమలబడుచు ముప్పదియైదు దినములు దీర్ఘప్రయాణ మొనర్చి యెట్టకేలకు మన తెరువరులు 'ఖోటను' రాజ్యమును♦ జేరుకొనిరి.

---

# మూడవ ప్రకరణము

## కుస్తానరాజ్యము

కుస్తానరాజ్యము మిగుల సౌఖ్యవంతమైనది. జనసంకీర్ణమై సౌభాగ్యసీమయై కలకలలాడుచున్నది. ఇందలి ప్రజలు సుఖులై యైశ్వర్యమున నోలలాడుచుండిరి. బౌద్ధమత మిచ్చట మిగుల వ్యాప్తినొందెను. ఇందునివసించు జను లెల్లరు బౌద్ధమతావలంబులు. వీ రెల్లెడల భజనలు సల్పుచు, గానకళావినోదముల బ్రొద్దులుపుచ్చుచుందురు. ఈరాజ్యమున

♦ దీనికి సంస్కృతమున 'కుస్తాన'మని పేరు. ఇయ్యది 'గోబీ' యెడారికి నైఋతిభాగమున 'క్విన్‌లన్' పర్వతపంక్తులనంటి తూర్పు పడమరలుగా మున్నూరు మైళ్ళవరకును వ్యాపించియుండు నొక చిన్నరాజ్యము.



బౌద్ధభిక్షువు లమితసంఖ్యాకులు గలరు. వీరెల్లరును మహాయాన శాఖకుజెందినవారు. సన్యాసులకు భోజనాదులొసంగు ధర్మసత్రము లనేకము లిచ్చటగలవు. ఈదేశమందలి గృహము లొకదానిసరస నొకటియుండక, గగనమండలమున మెరయు నక్షత్రరాశివలె, దూరదూరమున చెదరియున్నవి. ప్రతియింటి ముంగిటను, ముద్దులొల్కెడు చిన్ని, చిన్ని స్తూపములు* నిర్మింపబడియున్నవి. ఈస్తూపము లన్నిటిలోను మిగుల జిన్నది యిరువదియడుగులయెత్తున నుండును. దేశాటనమొనర్చుచు, అన్యప్రాంతములనుండి యరుదేను బౌద్ధభిక్షువుల విశ్రాంతికై మఠములందు గదులు నిర్మింపబడియున్నవి. బాటసారులై పరివ్రాజకులెవ్వరైన వచ్చినచో వారి నిందుండనియమించి కోరిన దెల్ల యొసంగుచు నతిథిపూజ లొనర్తురు.

కుస్తానరాజ్యమును బాలించురాజు ధర్మనిరతుడు. సుగుణశీలుడు. మనబాటసారులకు "గోమతి"♦ యను సంఘారామమున+ నాశ్రయమిచ్చి బహుతెరంగుల నాదరించెను. గోమతి మహాయానశాఖకుజెందిన గొప్ప బౌద్ధమఠము. ఇందు మూడువేలమంది బౌద్ధసన్యాసులు నివసించుచుండిరి. వీరిచే బాటింపబడు నియమము లతివిచిత్రముగనున్నవి. ఘంటా

* ఘంటాకృతిగలిగి యత్యున్నతములగు రాతికట్టడములు. శాక్యసింహుని యావాస పర్యటనాదులచే పవిత్రవంతములై దర్శనీయములైన చోటులను సూచించుటకు గట్టబడినవి.

కుస్తానరాజ్యమున ప్రసిద్ధిగాంచిన యొకానొక బౌద్ధమఠము.

బౌద్ధమఠమునకు సంస్కృతనామము.

నినాదములు+ వినవచ్చినంతనే, వీరు భోజనమొనరింప భోజనశాలకేగెదరు. ఇత్యాది "భోజనమునకు వేళయయ్యె, భోజనము సిద్ధమయ్యె, ఆలసింపక వేవేగ, భోజనమొనరింపరం"డని సన్యాసుల బిలుచుటకై గావింపబడు ఘంటారావములు ఘంటాధ్వానములట్లు మారుమ్రోగుచుండ, భిక్షువులందరును బిలబిలలాడుచు భోజనమందిరమున జొచ్చి, నిశ్శబ్దముగ నొకరివెంట నొకరు తమకై యమర్చియుంచబడిన పీఠములపై నాసీనులయ్యెదరు. భోజనశాలయందు వీరిచర్యలత్యంతగంభీరములై ప్రశాంతములై యొప్పారుచుండును. భోజనమందిరమున నడుగుపెట్టినదాది వీరు మౌనమువహింతురు. భుజించునప్పుడైనను నోరెత్తియెవ్వరిని బల్కరింపరు. నిశ్శబ్దముగ భోజనాదికృత్యములు జరిగిపోవుచుండును. కక్షపాల, కమండలముల నుండియైన యెట్టిధ్వనులును వినరావు. ఈ విమలవర్తనుల కేదియేని భోజనపదార్థము గావలసినపుడు కంఠమెత్తియడుగరు; అచ్చట వీరికి బరిచర్యలొనర్చు సేవకులకు హస్తములతో సంజ్ఞల గావింతురు.

"హ్యాకింగు", "టోచింగు", "హ్యాటా"* మున్నగు యాత్రికు లిచ్చటనుండి యందరికంటె మున్నుగా బయనమై "కీచా"♦ యను రాజ్యమును దర్శింపనేగిరి. ఫాహియానును, యాతనిమిత్రులును మాత్ర మీకుస్తానమున జరుగబోవు బౌద్ధ విగ్రహమహోత్సవముల నవలోకింప గుతూహలురై మాసత్రయమువరకు నిందే యుండిరి.

చిన్నచిన్న బౌద్ధమఠములుగాక (అట్టివిచ్చట బెక్కులు గలవు) విశాలమై పేర్వడసిన సంఘారామము లీకుస్తానదేశమున నాల్గుగలవు. ఆషాఢమాస (చతుర్థ) ప్రథమదివసమున నిచ్చట విగ్రహమహోత్సవములు ప్రారంభమగును. ఇంతకుమున్నె పురవీధులన్నియునూడ్చి నీరముల జల్లెదరు. ఈతరుణమున కుస్తాననగరమంతయు శోభాయమానముగ నలంకరింపబడును. పురద్వారోపరిభాగమున బెద్ద శిబిరమొండు నిర్మింపబడి నేత్రపర్వముగ నలంకరింపబడును. నృపాలుడును నాతని యర్ధాంగియు, సేవకాగణపరివృతులై యుత్సవములు ముగియువరకును యీ గుడారమున విడిది సేయుదురు.

గోమతిసంఘారామమున వసియించు బౌద్ధశ్రమణకులందరును మహాయానులు. కుస్తానభూమీశుచే నత్యంతపూజనీయులుగ బరిగణింపబడుచు మిగుల గౌరవింపబడుచుందురు. ఈ యూరేగింపు మహోత్సవమున వీరలే ప్రథమస్థానమలంకరింతురు. తక్కిన పురజనులు వీరివెనువెంట నడచివచ్చెదరు. పురద్వారమున కొక యరక్రోశమాత్రమున నత్యున్నతమగు రథమొకటి నిర్మింపబడియుండును. ఇత్యాది ముప్పదియడుగు లున్నతిగల్గి గదలిపోవుచున్న యొక దివ్యభవనము

+ ఈ మఠమున ఘంటారావములచే భిక్షువుల భోజనమునకు బిలుచుట యొక యాచారము.

* ఈతడెవ్వరో క్రొత్తయాత్రికుడైన గావలయు. లేనియెడల యీపేరు యాత్రికులలో నొక్కని నామాంతరమైన గావలయు.

♦ 'కీచా' రాజ్యమేదియైనదియు సరిగా గుర్తించుటకు దగిన యాధారము లెవ్వియు గానరాకున్నవి. 'కాశ్మీర'మని కొందరును, 'కార్ఛా'యని కొందరును బలువురు చరిత్రకారులు పలువిధములుగ నూహించుచున్నారు.

వలె గన్పట్టుచుండును. పట్టుతోరణములతోడను, చిత్రశోభితములగు వితానములతోడను నలంకరింపబడి సువర్ణమణివిలసితమై చూపరులకెంతయు నానందదాయకమై విరాజిల్లుచుండెను. ప్రధానవిగ్రహము (బుద్ధుని విగ్రహము) రథమధ్యభాగమున నుంచబడెను. ఈ మూర్తి కిరుకెలంకులందును బోధిసత్త్వుల ♦ విగ్రహములు రెండుగలవు. ఈప్రతిమలు బుద్ధునికి కైవారములు సల్పుచున్నట్లు మనోహరముగ జిత్రింపబడినవి.

బుద్ధవిగ్రహమునకు వెనుకపార్శ్వమున శిరోభాగమునుండి యనిమిషవిగ్రహము లెన్నియో వ్రేలుచుండెను. ఈవిగ్రహములు దేవత లాకాశగమన మొనర్చుచు బుద్ధభగవాను ననుగమించుటను సూచించుచుండెను. విగ్రహములన్నియు సువర్ణ, రజతలోహములతో నిర్మింపబడి కనులకు మిరుమిట్లు గొల్పుచుండెను. "రథము బయలువెడలినది. పురద్వారమును సమీపించుచున్నది. ఇంక నూరుబారల దూరమున నున్న"దను కేకలు వినవచ్చినంతనే కుస్తానదేశాధీశ్వరుడు క్రొత్తయుడుపులదాల్చి, శూన్యమస్తకుడై, హస్తమున పూజాద్రవ్యములగొని, యిరుకెలంకుల బారులుగట్టి సేవకానీకము వెంట నరుదేరుచుండ, పాదచారియై రథమున కెదురేగి, విగ్రహపాదమున కెరగి నమస్కరించును. పిమ్మట తన తోడ గొనివచ్చిన కుసుమజాలముల నామూర్తిశిరమున జల్లి,

♦ జ్ఞాన పరిపూర్ణులై యుత్తరజన్మమున బుద్ధులై యవతరింపనున్న సిద్ధులకు బోధిసత్త్వులని పేరు.



ధూపము లిడును. అంతటితో నృపాలుని యారాధన ముగియును. అరదము మరల సాగును. రథము ఇంక కొంతదూరమేగి పురద్వారమును జొచ్చినంతనే నృపుని మనోహారిణియు, నామె పరిచారికాగణమును పైనుండి రథముపై కుసుమరాసుల వెదజల్లి పుష్పవర్షము గురిపింతురు.

ఒక్క గోమతీసంఘారామమే గాక, తక్కటి భిక్షుకాలయములు గూడ నిట్టి మహోత్సవములు సల్పును. వానికిని రథావళి కలదు. ఒక్కొక్కమఠమున కొక్కరథము గలదు. ఆ రథసమూహములు బయలువెడలుటకు, వేర్వేరుదినములు నిర్ణయింపబడును. ఒక్కొక్కదినమున నొక్కొక్కమఠాలయ రథము మహావైభవముతో బయలువెడలుచుండును. ఈమహోత్సవము లిట్లు పదునైదుదినము లత్యంతవైభవముతో జరుగును. పిమ్మట రాజదంపతులు తమ ప్రాసాదమునకు మరలిపోయెదరు.

కుస్తానపురమునకు బశ్చిమభాగమున నేడెనిమిదిలీల దూరమున నృపాలుని 'నూతనసంఘారామ' మను నామమున బరగు ప్రసిద్ధసంఘారామ మొకటిగలదు. దీనిని గట్టుట కెనుబది వర్షములు పట్టెను. ముువ్వురు రాజన్యుల రాజ్యకాలము గడచిపోవువరకును నీమఠనిర్మాణము పరిసమాప్తి నొందలేదు. ఈభవనము మున్నూటయేబదియడుగుల యౌన్నత్యముగలిగి, శిల్పకళాచాతుర్యముల బ్రదర్శించు జిత్రవిచిత్రములగు చెక్కడపుబనులతో నలరారుచున్నది. దీని శిరోభాగమంతయు సువర్ణచ్ఛాదితమై, రత్నస్థగితమై, శోభాయమానముగ నున్నది. దీని

చెంత నెత్తగు స్తూపమొకటి గలదు. ఈ స్తూపమునకు వెనుకటి భాగమున నతిరమణీయమై, వైభవోపేతమగు విశాలమందిర మొకటి నిర్మింపబడియున్నది. దీనికే 'బుద్ధమందిర'మని పేరు. ఈ గృహమందలి కవాటశ్రేణులు, గవాక్షపంక్తులు, కంబములు, దూలములు అన్నియు పసిడిరేకులచే గప్పబడి మెరుగులీనుచున్నవి. ఇందు సన్యాసుల యావాసమునకై నిర్మింపబడిన గదులసొబగు వర్ణింప నలవికాదు. అత్యంతమనోహరముగ నలంకరింపబడి డోలు గొల్పుచున్నవి. వీని సౌందర్యము నిరుపమానము.

సంగు* పర్వతావళులకు బూర్వభాగమున రాజ్యమేలు అష్టరాజ్య♦ నృపాలురును, తెమకడనుండు ధనరాసులును, అమూల్య వస్తుచయమును తమ భోగవిలాసములకే వినియోగింపక యనుమాత్రము రాచకార్య నిర్వహణమునకై వినియోగించి దక్కినదెల్ల నీ సంఘారామపోషణాదికృత్యములకై దానమొసంగెదరు.

---

* వీనికే ఆనియన్ పర్వతములనియు, బిలర్‌టగ్ కొండలనియు నామాంతరములు గలవు. ఈ పర్వతపంక్తులు త్రివిష్టపమున కుత్తరభాగమున క్వీన్‌లన్ టీన్షను పర్వతశ్రేణుల నడుమనున్నది.

♦ ఈ అష్టరాజ్యము లెవ్వియో ఎచ్చట విలసిల్లెనో తెలియరాకున్నది.

# నాల్గవప్రకరణము

## సంగు పర్వతముల దాటి 'కీచా' యను రాజ్యమును జేరుట.

విగ్రహామహోత్సవములు సమాప్తమైనతోడనే సాంగుషోయను యాత్రికుడు బౌద్ధమత దీక్షగైకొనిన యొకానొక తార్తారుని వెంటనంటి కోఫేను♦ రాజ్యమును జూడబోయెను. ఫాహియాను తక్కిన యాత్రికులతో గలిసి యచ్చటనుండి తిన్నగా బయలుదేరి యిరువదియైదు దినములు ప్రయాణమొనర్చి జీహో* యను రాజ్యమును జేరెను. ఈ రాష్ట్రమును పాలించు రాజు బాహుబలుడు, సుగుణశీలుడు, బౌద్ధమతాభిలాషి. ఈ రాజ్యమున సహస్ర బౌద్ధసన్యాసులు గలరు. వీరిలో జాలమంది మహాయానులు.

ఇచ్చట పదునైదుదినము లుండి పిమ్మట మనపాంథులీ రాజ్యమును వీడి దక్షిణాభిముఖులై పోయి, నాల్గుదినములకు "సంగులింగు" పర్వతశ్రేణుల తారసిల్లిరి. ఈపర్వతముల

---

♦ ప్రస్తుత 'కాబులిస్థానమే' కోఫేను రాజ్యము. 'కోఫేను' కోఫస్ నదికి సంబంధించి యుండనోపు. సింధునదికుపనదియగు 'కాబూల్' నదియే కోఫస్‌నదియని కొందరూహించుచున్నారు. ఆఫ్గనిస్థానమునకు రాజధానీనగరమగు కాబూలు నగరమే కోఫేను నగరమై యుండవచ్చును.

* జీహో రాజ్యమేదియో తెలియవచ్చుటలేదు. ఖోటను రాజ్యమునకు వాయవ్యదిశగానుండు యార్కండుదేశమే జీహో యైయుండునని కొందరూహించుచున్నారు. ఈరాజ్యము 'కర్గలిక్' అయియుండునని తోచుచున్నది.

నెట్లోనాటి యుస్సరనుచు మన తెరువరులు "యూవీ"† యను రాజ్యమును జేరుకొనిరి. వర్షఋతువు అప్పుడే ప్రారంభమగుటచే, వర్షకాలమిచ్చట* గడపి పిమ్మట మరల బయనమై, మనయాత్రికులా పర్వతప్రాంతములబడి గొండల నెక్కుచు దిగుచు, యిరువదియైదు దివారాత్రములు ప్రయాణ మొనర్చి, 'కీచా' (కాష్ఘర్) యను రాజ్యమును జేరిరి. ఇచ్చట యూకింగు మున్నగు యాత్రికులు వీరిని గలిసిరి.

---

# ఐదవప్రకరణము

బౌద్ధసన్న్యాసుల పంచమ పరిషన్మహాసభ — బుద్ధుని యస్థిశకలములు — కీచారాజ్యవృత్తాంతము.

ఈతరుణమున కీచారాజ్య మంతయు సందడిగ నుండెను. ఈరాజ్యమేలు నృపవరుడు పంచమపరిషన్మహాసభ ♦ నొకటి

† చరిత్రపరిశోధకు లీ రాజ్య మెచ్చట విలసిల్లెనో నిర్ణయింపజాలకున్నారు. 'టాషికుర్గను' రాజ్యమైయుండునని యిటీవల గావింపబడిన చరిత్రపరిశోధనలవలన దేలుచున్నది. ఈదేశము ఆనియన్ పర్వతశ్రేణులలో నెచ్చటనో విలసిల్లియుండవలెను.

* మనయాత్రికులు బయలుదేరిన తరువాత నియ్యది మూడవ వర్షకాలమగుటచే వీరు చైనా సామ్రాజ్యమునుండి బయలుదేరి యిప్పటికి మూడువత్సరములయినదని యూహింపవలసియున్నది.

♦ ఇది యొక బౌద్ధమత మహాసభ. కలుషవిమోచనమార్గముల నరయుటకును, నైతిక ప్రాబల్యమార్గాన్వేషణమునకు నీ సభ అశోకసార్వభౌమునిచే స్థాపించబడెను.



గావించుచుండెను. తత్సభకు తనరాజ్యమునంగల బౌద్ధశ్రమణకుల నెల్ల బిలువనంపెను. మేఘపటలివలె భిక్షుకసంఘములు తండోపతండములుగ నరుదెంచి సభాస్థలి నిండిరి. సభామంటపము చిత్రవితానములతోడను, బట్టుతోరణములతోడను నేత్రపర్వముగ నలంకరింపబడెను. ప్రముఖులగు సదస్యులాసీనులగు పీఠములకు వెనుకభాగమున సువర్ణకమలము లమర్చబడియుండెను. స్వచ్ఛమగు చాపలపై సభాసదు లెల్లర నధివసింపజేసి, రాజును, నాతని యమాత్యులును యథావిధిగ బుద్ధభగవానునికి పూజ లొనర్చిరి. ఈ మహాసభ ప్రతివత్సరమును వసంతకాలమున చైత్ర, వైశాఖమాసములందు ప్రారంభమై రెండు, మూడుమాసములు జరుగును.

సభ ముగిసినంతనే రాజు సభాస్థలమున జేరియున్న భిక్షువు లందరకు పారితోషికముల నొసంగి సంభావింపు డని తన మంత్రుల కానతిచ్చును. ఇట్లయిదారుదినములు గడిచిపోవును. పిమ్మట నృపాలుడు తన యుత్తమాశ్వమును రావించి తాన యశ్వపాలకుడై, కళ్ళెము మున్నగు యశ్వోపకరణముల గుఱ్ఱమునకు దొడిగి ప్రధానామాత్యు నాతురగముపై నధిరోహింపచేయును. పిమ్మట దానును దన మంత్రులును, శ్రమణకులకు రత్నశాలువలు, సువర్ణభూషణములు మున్నగు నమూల్యవస్తువుల దాన మొసంగి సంప్రీతుల జేయుదురు.

ఈ రాజ్యము కొండలనడుమనుండు పర్వతప్రాంతమును, కడుశీతలప్రదేశమును నగుటచే గోధుమలుదక్క యన్యములగు సస్యము లెవ్వియు నిచ్చట ఫలింపవు. భిక్షువులు తమ

"సంవత్సరవిభాగమును" * గొనిపోయినతోడనే, ప్రభాత కాలములందు విపరీతముగ తుషారము గురియ నారంభించును. అందుచే తమ వార్షికమును గ్రహింపకమున్నె సస్యముల పుష్కలముగ ఫలింపజేయుడని† నృపాలుడు శ్రమణకుల వేడికొనును.

ఈ నృపాలునిరాష్ట్రమున బుద్ధుని నిష్ఠీవనపాత్ర యొకటి గలదు. ఇయ్యది శిలానిర్మితమై, వర్ణమున బుద్ధుని కత్తుపాలను బోలియున్నది. ఇచ్చటనే శాక్యసింహుని దంతము కూడ గలదు. దీనిపైనే డొకస్తూపము నిర్మింపబడియున్నది. ఈ స్తూపపరిసరములందు సహస్ర బౌద్ధశ్రమణకులు నివసించుచుండిరి. వీరలందరును హీనయానులు. పర్వతపంక్తులకు ప్రాగ్దిశగానుండు ప్రాంతములలో నివసించు ప్రజాళి సిన్నుసామ్రాజ్యమందలి జనులవలెనె మోటువస్త్రముల ధరించెదరు. కొందరు కాశ్మీరపువలువలవంటి మృదుతరములగు, సన్నని రోమనిర్మితమగు వసనముల దాల్తురు. ఇచ్చటి శ్రమణకులనుచరించు ఆచారనియమము లగణితములు. వాని నిచ్చట బేర్కొనుటకు దావులేదు.

* సంవత్సరవిభాగము. భిక్షువులగ్రాసమునకై రాజు తనరాజ్యమున బండినపంటలో గొంతభాగమును ఏటేట వారల కిచ్చుచుండును.

† కీచారాజ్యమందలి బౌద్ధశ్రమణకుల కమానుషశక్తు లున్నవని ఫాహియాను దెల్పుచున్నాడు. ఆతపశీతలములగూడ నుపశమింపజేయగల సామర్థ్యములు వీరికి గలవట!



'కీచా' రాజ్యము ఆనియాన్ పర్వతశ్రేణులమధ్య నున్నది. ఈకొండలదాటి ముందునకు బోయినకొలదియు బలువిధములగు వృక్షజాలములు గానవచ్చును. వీనిలో వెదురు, చెఱకు, దాడిమమున్నగు వృక్షములు తక్క దక్కటి తరుజాతులెవ్వియు సిన్నుసామ్రాజ్యమున గని విని యెఱుంగనివి.

---

# ఆరవ ప్రకరణము

## ఉత్తరభారతమును సమీపించుట

ఇచ్చటనుండి బయటవెడలి పశ్చిమాభిముఖులై మన బాటసారు లొక్కమాసము పయనమొనర్చి ఆనియాన్ పర్వతావళులదాటి యుత్తరభారతమును సమీపించిరి. ఆనియాన్ పర్వతశ్రేణులు మహోన్నతములై యేకాలమును హిమంబుచే గప్పబడియుండును. ఈకొండలలో క్రూరపన్నగములు నివసించుచుండును. వానిని రేపితిమేని విషవాయువుల గ్రక్కును. భయంకరమగు హిమవర్షము గురియించును. శిలావృష్టిచే నాభీలమై ప్రళయభీకరమగు తుపానుల వీవబంపును. ఈమహాసర్పములవాతబడిన మానవులు జీవములతో దప్పించుకొని బ్రతికి బయటపడుట గల్ల. ఈప్రాంతముల నివసించు ప్రజలీపర్వతములను "మంచుకొండ"లందురు.

మన పాంధులీపర్వతముల నిర్గమించి యుత్తరభారతమును ప్రవేశించినంతనే 'టోలెయి'† యను రాజ్యమొందు వారి దృష్టిపథమున బడెను. ఇది యుత్తరహిందూస్థానపు సరిహద్దులలోనుండు నొక చిన్నరాజ్యము. ఇచ్చోట హీనయానులగు బౌద్ధభిక్షువు లెందరో గలరు. పూర్వకాలమున నద్భుతప్రజ్ఞల గల్గిన యర్హతు♦ డొక్కడీరాజ్యమున నివసించుచుండెడివాడు. ఈతడు తన దివ్యమహిమచే (వృద్ధి సాక్షాత్క్రియాప్రభావముచే) నొక శిల్పకారుని తుషిత స్వర్గము*నకు గొంపో

† టోలెయి-ఇది దారద (డారెల్) రాజ్యమై యుండ నోపునని కొందరి యభిప్రాయము. దార్దులను తెగవారిచే నివసింపబడు ప్రదేశము గాన దీని కీనామము గల్గినది. అయినను ఫాహియాను దర్శించిన రాజ్య మిదియైయుండునా యను సందేహము పొడముచున్నది. ఏలన నీరాజ్యము సింధునదీ పశ్చిమ తీరమున నున్నది. మన పాంధులీతరుణమున సింధునదికి తూర్పుతీరమున నుండిరి. ఇంకను సింధునదీ జలముల దాటి పశ్చిమతీరమునకు బోవలేదు. ఈయుదంతము (మన యాత్రికులు సింధునదీ జలముల నిర్గమించిన యుదంతము.) ముందు ప్రకరణమున వర్ణింపబడినది.

♦ ధర్మపథమున జరియించి జితేంద్రియుడై జన్మరాహిత్యమునొందిన యార్యసత్త్వునకు "అర్హతు" డనిపేరు. అర్హత్త్వము సిద్ధించిన పుణ్యపురుషున కమానుషప్రజ్ఞలలవడునని బౌద్ధమతస్థుల విశ్వాసము. చైనాభాషయందీ 'యర్హతు'నకు లోహానుడని పేరు. చైనాదేశమున బుద్ధునియనుచరుల నందరనీనామముననే బిలచెదరు.

* స్వర్గములు నాల్గుగలవు. అందు తుషిత స్వర్గము నాల్గవది. బోధిసత్త్వులందరును బుద్ధులై భూలోకమున నవతరింపక మున్నిచ్చటజన్మింతురు. ఇచ్చటి జీవితపరిమాణము నాల్గువేల హాయనములు. ఇచ్చటియహోరాత్రములు గలిసి మర్త్యలోకమున నన్నూరు వత్సరములకు సమానమగును.



యెను. స్వర్గధామమున నున్న మైత్రేయబోధిసత్త్వుని *యాకారముఖలక్షణము లాశిల్పకారునికి జూపి, యాతని మూర్తిని భూతలమున జిత్రింపజేయుటకై నీ యర్హతు డాశిల్పిని స్వర్గమునకు దీసికొని పోయెను. ఇట్లాశిల్పకారుని మువ్మారు తుషిత లోకమునకు గొనిపోయి, మైత్రేయుని విగ్రహమాతనిచే బూర్తి చేయించెను. ఇయ్యది యెనుబది యడుగుల పొడవున జెక్కబడి మనోహరముగ నున్నది. ఉపవాస దినములలో నీదివ్య విగ్రహము, తేజఃపుంజముల వెలిగ్రక్కుచుండును. ఆపరిసరప్రాంతముల నేలు రాజన్యులీ మూర్తికి కానుకలర్పించుటలో నొకరి కొకరు తీసిపోవరు. ఈప్రతిమ పూర్వమెట్లుండెనో, యిప్పటికిని యట్లే నిలిచియున్నది.

---

# ఏడవ ప్రకరణము

## పాంధులు సింధునదీజలముల దాటుట

మన తెరువరు లిచ్చోటనుండి, యానియున్ పర్వతశ్రేణులనంటి నైఋతిదిశగా బదునైదుదినములు పయనముసల్పిరి.

* ఇతడు 'అజితు'డనికూడ బలుమారు పేర్కొనబడుచుండును. ఈతడొక బోధిసత్త్వుడు, బుద్ధభగవానుని శిష్యకోటిలో నగ్రగణ్యుడు. శాక్యసింహుని సామాన్య శిష్యగణమునందీతని నామ మెచ్చటను గానరాదు. బుద్ధుడీతని తుషిత స్వర్గమున తారసిల్లి ఐదువేలవత్సరములు చెల్లినవెనుక బుద్ధుడై, భూమండలమున నవతరించి తనస్థాన మాక్రమింపుమని యీతని నుద్యోగించెను. కావున ప్రస్తుతకాలమున మైత్రేయుడు తుషితస్వర్గమున నున్నాడనియు, బుద్ధుడై జన్మింపబోవుచున్నాడనియు బౌద్ధమతస్థులు విశ్వసించెదరు.

అంతట గండశిలావృతమై పదివేలయడుగుల యున్నతిగల్గి యంబరమునొరయుచు మహోన్నత పాషాణ కుడ్యము వలె గన్పట్టు నదీతట మొకటి వారి కెదురయ్యెను. దానియొంచకు బోయి క్రిందికిజూచినచో గన్నులు తిరిగిపోవును. అధోభాగమున నురగలగ్రక్కుచు, నదీప్రవాహ మొండు మహావేగమున ప్రవహించుచుండెను అయ్యదియె సింధు తరంగిణి. అచ్చటినుండి ముందునకు బోవుటకు మార్గము గానరాదు. అడుగు మోపుటకైన నాధారము గాన్పింపదు. ప్రాచీన కాలమున జనులీ పర్వతోపరిభాగమునుండి క్రిందికిదిగి నదీప్రవాహమును సమీపించుటకు గండశిలల మలచి పొడుగునను నిచ్చెన లమర్చి యొకవిధమగు మార్గ మేర్పరచిరి. ఇట్లమర్చబడిన నిచ్చెనల సంఖ్య యేడువందలకు పైగానుండును. నిచ్చెన కడుగు భాగముల నుండి యావలియొడ్డునకు బోవుటకు త్రాళ్ళతో నొకవిధమగు వంతెన నిర్మింపబడి యున్నది. ఇచ్చట సింధునది యెనుబది బారల వెడల్పున నుండును. ఇట్టి త్రాళ్ళవంతెనల యాధారముననే ప్రాచీనకాలమున జనులీ సింధునదీ జలముల నిర్గమించెడివారు. పశ్చిమ దిగ్విజయయాత్రకై బయలు వెడలిన హాన్నవంశ నృపాలుర సైనికవాహినుల * వెంట నరుదేరిన వ్రాయసకాండ్ర వ్రాతలలో నీ ప్రదేశవర్ణనలు గానవచ్చును.

* హాన్నవంశరాజులు పశ్చిమప్రాంతమంతయు జయింపవలె నను నాశతో పెక్కుసైన్యముల వెంటగొని పశ్చిమ దిగ్విజయయాత్రకై బయలు వెడలిరి.



కాని షాంకేను♦, కాన్వింగు* లైనను నీ దుర్గమప్రాంతమువరకును బోయిన జాడలు గాన్పింపవు.

మనయాత్రికు లెట్లో కష్టముమీద సింధు నదీజలముల దాటి యావలియొడ్డు జేరిరి.

ఇచ్చట సింధునదీతీరమున నివసించుచుండిన బౌద్ధ సన్యాసులుకొందరు మనపాంథుల దారసిల్లి "ప్రప్రథమమున బౌద్ధధర్మముల ప్రాచ్యదేశములకు గొంపోవబడిన దేకాలముననో మీ రెరుంగుదురా" యని ప్రశ్నించిరి. అందులకు ఫాహియాను "ఈవిషయమై నేనును దెలిసికొనగోరి యొకసారి ప్రాచ్యప్రపంచమున నివసించు ప్రజాళి నడిగితిని. వారీ ధర్మములు ప్రాచీనకాలము నుండియు, తమ తాతతండ్రుల నాటగోలె పరంపరానుగతముగ తమప్రాంతముల ప్రబలుచుండెననియు మైత్రేయబోధిసత్త్వుని విగ్రహప్రతిష్ఠాపన మైన పిమ్మట భారతభూమినుండి బౌద్ధశ్రమణకులు కొందరు సూత్రగ్రంథముల వెంటగొని యీసింధునదీ జలములు దాటి ప్రాచ్యఖండమున ప్రవేశించిరనియు దెల్పిరి.

♦ హాన్నసామ్రాజ్యవిభు డగు "వూ" సార్వభౌముని యమాత్యుడు. అవిలంఘ్య మగు పశ్చిమప్రాంతభూముల జొచ్చిన చైనాయాత్రికులలో నీతడే ప్రథము డని చెప్పవచ్చును. ఈతని మూలముననే క్రీ. పూ. 150 వ సంవత్సరమునాటికి పశ్చిమఖండమున విలసిల్లుచుండిన ముప్పదియారు రాజ్యములకును చీనాసామ్రాజ్యమునకును రాకపోక లేర్పడెను.

* ఈతనిగూర్చి మన కంతగా తెలియదు. ఈతడు క్రీ. శ. 88 వత్సరమున చీనాదేశ నృపాలుండగు "షాన్షో" భూమీశుచే రోమకసామ్రాజ్యమునకు రాయబారిగా నంపబడెను. ఈతడు కాస్పియను సముద్రతీరము వరకును బోయి వెనుకకు మరలివచ్చెను. పశ్చిమప్రాంతములగూర్చి పెక్కు విషయము లీతడు తన దేశీయులకు జెప్పి వారి భూగోళశాస్త్రజ్ఞానమును వికసింపజేసెను.

బుద్ధుడు నిర్వాణమునొందిన మున్నూరువత్సరముల కీమూర్తి భూతలమున బ్రతిష్ఠింపబడినది.* ఈవిగ్రహప్రతిష్ఠాపనము 'ఛౌ' వంశజుడగు "పింగు" నృపాలుని రాజ్యకాలమున జరిగియుండవచ్చును. దీనినిబట్టి మైత్రేయబోధిసత్త్వుని విగ్రహము ప్రతిష్ఠింపబడినతోడనే, ప్రాచ్యదేశములందు బౌద్ధధర్మములు వ్యాపింపదొడగెనని చెప్పవచ్చును. ఈ ధాత్రీతలమున శాక్యసింహునిస్థాన మలంకరింపబోవు మహిమాన్వితుడును ఆధ్యాత్మికశక్తిసంపన్నుడును నగు మైత్రేయుడు గాకుండిన నింతటి దూరదేశముల కేగి మణిత్రయమును♦ బోధించి ఆయాదేశముల నివసించు జనసంతతులకు బౌద్ధధర్మముల నెరిగింపగలవార లెవ్వరుందురు? ఈ ప్రాచ్యభూములలో

* దీనినిబట్టి బుద్ధనిర్వాణకాలము నిర్ణయింపవచ్చును. పింగునృపాలుడు క్రీ. పూ. 750 మొదలు, 719 వరకును రాజ్యమేలియుంటచే, బుద్ధుడీలెక్కనుబట్టి పదునొకొండవ శతాబ్దమున నిర్వాణమునొంది యుండవలెనని తేలుచున్నది. కాని యిటీవల గావింపబడిన చరిత్రపరిశోధనలవలన బుద్ధుని నిర్వాణము క్రీ. పూ. 480, 470 సంవత్సరముల మధ్యభాగమున (అనగా కన్‌ఫ్యూషియస్ గతించిన కొలదికాలమునకే) సంఘటిల్లియుండునని తెలియవచ్చుచున్నది. ఈపరిశోధనలబట్టి జూచిన నీప్రాచ్య మతకర్తలిరువురును సమకాలికులై యుండినట్లు గన్పట్టుచున్నది. 'రిస్ డేవిడ్స్' చరిత్రకారుడు, బుద్ధునినిర్వాణకాలము క్రీ. పూ. 412 వసంత్సరప్రాంతమున నై యుండవలెనని యూహించుచున్నాడు. ఈతనియూహ నిజమగునెడల, శాక్యసింహుడు, కన్‌ఫ్యూషియస్ కంటె మిగుల జిన్నవాడై యుండవలెను.

♦ మణిత్రయము:- బుద్ధుడు, బౌద్ధధర్మము, బౌద్ధసంఘములు వీనికే మణిత్రయ మనిపేరు.



నింతటి యద్భుత పరిణామము గల్పించుట మానవమాత్రుని పనిగాదు. కావున హాన్సామ్రాజ్యవిభు డగు మింగు + సార్వభౌమునికల నిక్కమయ్యెను" అని నుడివెను.

# ఎనిమిదవ ప్రకరణము

## ఊషంగు రాజ్యము (ఉద్యానము)

సింధునదీప్రవాహమును దాటిమన తెరువరులు 'ఊషంగు రాజ్యము' ను దర్శించిరి. ఊషంగురాజ్యము త్తరభారతములోనిది. దీనికే యుద్యాన * మనికూడ బేరు. మధ్యభారతమందలి ప్రజలు మాట్లాడు భాషనే యిచ్చటిజనులును మాట్లాడెదరు. అచ్చటిజనులు తినునట్టి యాహారమునే వీరును భుజింతురు. వారలుధరించునట్టి వస్త్రములనే ధరింతురు. బౌద్ధమత మిచ్చ

\+ మింగుసార్వభౌముని రాజ్యకాలమున చైనాసామ్రాజ్యమున బౌద్ధమతప్రచారము ప్రారంభమైనదని ఫాహియాను సిద్ధాంతము చేయుచున్నాడు. ఈతడు క్రీ. శ. 58 మొదలు 75 వరకును రాజ్యపాలన మొనర్చెను. క్రీ. శ. 61 వ సంవత్సరమున స్వప్నమును గనెను. ఈస్వప్నవృత్తాంతము ఫాహియాను మనకు దెల్పియుండలేదు. బౌద్ధమతప్రచారమును గూర్చియై యుండనోపు.

* ఉద్యానము:- పాంచాలదేశమున కుత్తరభాగమున సుభవస్తునదీతటము నంటియుండు రాజ్యము. దీనిప్రస్తుతనామము స్వాట్టు (Swat). కుసుమఫలశోభితములగు నారామసీమలచే విరాజిల్లుచు, మనోహరములగు పెక్కువనభూములకు తావలంబై, రామణీయకంబగుటచే యీరాజ్యమునకు 'ఉద్యాన' మను నామధేయము గల్గెను.

ట మిగుల ప్రాబల్యము గాంచెను. బౌద్ధసన్యాసులు నివసించు గృహావళి నిచ్చటిజనులు "సంఘారామము" లందురు. ఇట్టిసంఘారామము లీరాజ్యమున నైదునందలకుమించియుండును. ఇచ్చటి భిక్షువులందరును హీనయానులు. పాంథులెవ్వరేని యీసంఘారామముల కరుదెంచునెడల వారల కచ్చట నాశ్రయమిచ్చి పలువిధముల నాదరించి మూడు దినములవరకును అతిథిపూజలొనర్తురు. ఈగడువు గడచినవెనుక వేరెచ్చటికైననుబోయి, విశ్రాంతిగొనుమని పంపివేయుదురు.

బుద్ధు డుత్తరభారతమున బర్యటనము సల్పుచు, నీరాజ్యమును దర్శించి యిచ్చట దన "యడుగు జాడను" విడిచిపోయెను. ఈపదచిహ్నము చూపరుల భావములబట్టి పొట్టిగను బొడవుగను బరిణామము నొందుచు గన్పడుచుండును. ఈయడుగుజాడ నేటికిని యీరాజ్యమున గలదు. దాని పరిమాణము నేటికిని యిట్లే మార్పునొందుచుండెను.

శాక్యసింహుడు తనవస్త్రము నారగట్టుకొనిన పర్వతశిలయు, క్రూరనాగున ♦ కురగరూపమును బోనడచి దివ్యస్వరూపము నొసంగిన పుణ్యస్థలమును నిచ్చటనే గలవు. బుద్ధుడు తన యుడుపుల నారవైచిన శిల పదునాలుగడుగుల నిడివియు, యిరువదియడుగుల వెడల్పును గలిగిన బ్రహ్మాండమగు గండశిల. ఈబండ యొకవైపున నునుపుదీరి నిగనిగలాడుచున్నది.

♦ ఈ నాగుని పేరు "అప్తాలుడు." సుభవస్తునదీజలములలో నితని యునికి. ఈనదికి అప్తాలుడు రక్షణదేవత.



హ్వ్యాకింగు, హ్వ్యాటా. టోచింగు మున్నగు యాత్రికు లిచ్చట నుండి మున్నుగా బయలుదేరి 'నాగర' * యనురాజ్యమును జూడబోయిరి. ఇచ్చటనే బుద్ధుని దేహచ్ఛాయ గలదు. ఫాహియానును, దక్కటి పథికులును, వర్షఋతువు గతించువరకును ఊసాంగునందే యుండి యటుపిమ్మట, నచ్చోటువీడి దక్షిణాభిముఖులై పోయి సుహొటో యను రాజ్యమును జేరిరి.

## తొమ్మిదవ ప్రకరణము

### సు హే టో

ఈరాజ్యమునగూడ బౌద్ధమతము మిగుల ప్రబలముగ నుండెను. అమరవిభుడగు శక్రుడు† పూర్వజన్మమున బోధిసత్త్వుని నగ్నిపరీక్షజేసిన తా' విచ్చటనే గలదు. ఇం

* నాగర — కాబూలునదికి దక్షిణపుటొడ్డుననుండు నొకపురాతనరాజ్యము. జలాలాబాదు పట్టణమునకు బశ్చిమముగా ముప్పదిమైళ్లదూరమున నున్నది. చైనాభాషలో నీరాజ్యమును "నాకీ" యందురు. దీనికి "నగరహార" మనికూడ నామాంతరముగలదు.

♦ ఈరాజ్య మెచ్చట నున్నదో స్పష్టముగా దెలియవచ్చుటలేదు. ఇయ్యది సింధునదీస్వాట్టుదేశములమధ్య నుండియుండవలెను. ప్రస్తుతస్వాస్తిని (Swastene) యైయుండునని దోచుచున్నది.

† శక్రుడు:— సురపతియగు నింద్రుడు. ఫాహియాను తన యాత్రాగ్రంథమున నెక్కుసారు లితని పేర్కొనుచుండును. బౌద్ధమతస్థు లితని కంటె శాక్యసింహు డెక్కువవాడని వాదించెదరు.

డ్రిడు బోధిసత్త్వుని సుగుణశీలముల బరీక్షింపనెంచి యొక డేగను పావురమువెంట బంపెను. సాళువము కపోతమును బట్టి, చీల్చి, భక్షించి తనయాఁకటిబాధ దీర్చికొనుటకై దాని వెన్నంటి తరుమజొచ్చెను. దవ్వులనుండి బోధిసత్త్వుఁ డీదృశ్యము నవలోకించుచుండెను. ఎట్టులైన బ్రాణముల రక్షించుకొనుటకై పరితపించుచు నెగిరవచ్చుచున్న కపోతరాయుని దురవస్థ జూచి మిగుల జాలినొంది, బోధిసత్త్వుడు తనమేని మాంసపుకండల గోసి డేగకువిసరి పావురమును గాపాడెను.*

శాక్యసింహుఁడు జ్ఞానియైనపిదప (బుద్ధత్వము నొంది) తన శిష్యగణములతో నీప్రాంతమున సంచారముచేయుచు, నిత్తావుగాంచి మున్నొకసారి తాను తనమేనికండలగోసి సాళువమున కశనముగానిడి పావురమును మృత్యుముఖమునుండి దప్పించిన దిచ్చోటనేయని నుడువుచు నీప్రదేశమును వారలకు జూపెను. ఇవ్విధమున నీరాజ్యమున నివసించు జనసంతతు లీవృత్తాంతము నెరింగి యీస్థానమున నొక స్తూపమును గట్టించి వెండి బంగారములతో దానికి బూతపెట్టిరి.

# పదియవ ప్రకరణము

## గాంధారము

పథికు లీరాజ్యమునుండి ప్రాగ్దిశగా బయనమొనర్చియైదుదినములలో గాంధారము ♦ ను జేరిరి. ఇచ్చట నీతరుణమునయశోక

* జాతకకథలలోని వృత్తాంతము.

♦ వర్తమాన 'ఫేరీరాజ్యమే' పురాతనకాలమున గాంధారరాజ్యమని బిలువబడుచుండెను. జంజూరుప్రాంతముల విలసిల్లినది. మిక్కిలి పురాతనమైనది



సార్వభౌముని తనయుఁడగు ధర్మవివర్ధనుఁడు + రాజ్యమేలుచుండెను.

బుద్ధుఁడు బోధిసత్త్వుఁడై యుండుకాలమున యొకానొక మనుజునికి దన నయనముల దీసియిచ్చిన తా విచ్చటనే గలదు. ఈప్రదేశమున నిప్పుడొక స్తూపము గట్టబడియున్నది. ఈ రాజ్యమందలి ప్రజలెల్లరును హీనయానశాఖకు జెందిన బౌద్ధమతస్థులు.

---

# పదునొకండవ ప్రకరణము

## తక్షశీలరాజ్యము; స్తూపచతుష్టయ వృత్తాంతము.

గాంధారమునుండి బయలుదేరి ఫాహియాను తన యానుచరులతో గలిసి, ప్రాగ్దిశగా నేడుదినములు ప్రయాణ మొనర్చి తక్షశీలరాజ్యమును జేరెను. చైనాభాషలో "తక్షశీల" యనిన "దునిగినమస్తక" మని యర్థము. బుద్ధుఁడు బోధిసత్త్వుఁడైయుండిన ప్రాచీనకాలమున నొక మానవు

\+ చంద్రగుప్తుని (గ్రీకుభాషలో సాండ్రకోటసు) మనుమఁడు. పెక్కు విహారములను స్తూపములను గట్టించి పేరువడసెను. ఈతనిచే జీవములతో భూశయన మొనర్ప, శిక్షితుఁడైన యొకానొక యర్హతుని ప్రశాంతముఖ విలాసముల జూచి దిగ్భ్రమజెంది యాతనివలననే బౌద్ధదీక్ష గైకొనెను. అప్పటినుండియు బౌద్ధమతప్రాబల్యమునకై కృషిసల్పి చేయూతనొసంగెను.

నకు దన శిరమును గోసియిచ్చిన తావీరాజ్యమునందే గలదు. అందువలననే ఈ రాజ్యమునకు " తక్షశీల " యను నామము గల్గెను.

ఇచ్చటి కనతిదూరమున బోధిసత్త్వుడు తన దేహము నాకటితోనున్న శార్దూలమున కశనముగా నిడినచోటు గలదు. మన యాత్రికులీప్రదేశమునుండి తూర్పుదెసగా రెండుదినములు ప్రయాణమొనర్చి యా పుణ్యస్థలమును దర్శించిరి. ఈ ప్రదేశమున సప్తమణిస్థగిత మగు స్తూప మొండు నిర్మింపబడియున్నది. పై నుడివిన తావునగూడ స్తూపము గలదు. ఈ పరిసర ప్రాంతముల నేలు రాజన్యులును, వారి యమాత్యగణమును, ఆ యా రాజ్యముల నివసించు ప్రజాళియు తండోపతండములుగ నీ పవిత్రవాటికల దర్శించి, స్తూపములకు ప్రదక్షిణముల నొనర్చి, కానుక లర్పించిపోవుచుందురు. ఇచ్చటి కరుదెంచు యాత్రికులకు దెరపిలేదు. స్తూపములపై పుష్పముల జల్లువారును, యచ్చట దీపముల వెల్గించిపోవువారును యిసుముజల్లిన రాలకుందురు. ఇవ్వియు వెనుక నుదహరించిన స్తూపద్వయమును గలిసి యీ రాజ్యమున " స్తూపచతుష్టయ "మని ప్రసిద్ధిగాంచినవి.

---

§ ఇయ్యది జాతకకథలోని వృత్తాంతము. 'బుద్ధుడు' దాలిద్దియను గ్రామమున బ్రాహ్మణుడై జన్మించి యీ సాహసమును గావించెను. ఇట్టి మహాత్యాగమునకై యాత డనిమిషలోకమున జన్మ మందెను.

# పండ్రెండవ ప్రకరణము

## పురుషపురము - కనిష్కనృపాలుని స్తూపవృత్తాంతము, గౌతముని కత్రుపాల.

మన తెరువరు లిచ్చోటనుండి దక్షిణదిశగా బోయి నాల్గుదినములకు పురుషపుర * మను రాజ్యమును జేరిరి. మున్నొకసారి శిష్యగణసమేతుడై శాక్యసింహు డీరాజ్యమున బర్యటనము సల్పుచు నొక్కనా డానందుని ♦ బిలిచి "ఆనందా! నేను పరినిర్వాణము + నొందిన పిదప కనిష్కుడను ×

---

* ప్రస్తుత పెషావరు ( Peshawar )

♦ ఆనందుడు. శాక్యసింహుని యన్నకొమారుడు. సిద్ధార్థుడు బుద్ధత్వము నొందిన మహూర్తమున జన్మించెను. ఇతడు బుద్ధుని యుపదేశముల నంది యర్హతు డయ్యెను. గొప్పమేధావి యని పేరుగాంచెను. ఆనంద, శాక్యసింహుల కమితమగు స్నేహ ముదయించెను. తన నిర్వాణకాలమున శాక్యసింహు డీతనితో బల్కినవచనములు హృదయవిదారణములు. వీనిని వినిన నెట్టి పాషాణహృదయుడైనను నీరగును. ఉత్తరజన్మమున నీతడు బుద్ధుడై భూతలమున నవతరించును.

+ నిర్వాణమునకు బర్యాయపదము.

× క్రీ. శ. మొదటిశతాబ్దమున పదియవసంవత్సర ప్రాంతమున ఆర్యావర్తమున రాజ్యమేలిన రాజు. వీరిసోదరుల మువ్వురిలో నీతడు కనిష్ఠుడు. యూషీ ( తుఖారా ) వీరి యావాసము. ఆకస్మికముగ నొక సన్యాసి యీ నృపాలునికి గన్పించి యాతనికి బౌద్ధదీక్ష నొసంగెను. నాటనుండియు అశోకసార్వభౌమునివలెనే యీతడును బౌద్ధమతవ్యాప్తికై చాల కృషి సల్పెను. పశ్చిమోత్తరభారతమున విలసిల్లు స్తూపములన్నియు నీతడే గట్టించెనని ప్రతీతి. భారతభూమి నేలినరాజులలో మిగుల విఖ్యాతయశుడగు భూవరుడు.

నృపాలుడు జన్మించి మహావైభవముతో నీప్రాంతమున రాజ్యమేలి యీప్రదేశమున నొక మహాస్తూపమును నిర్మించు"నని వచ్చెను. కొంతకాలమున కాతడనినట్లే కనిష్కనృపుడు భూతలమున నుద్భవిల్లి, యార్యావర్తమునకెల్ల రాజ్యాధిపత్యమును వహించెను. ఈ భూవరుడు రాజ్యపాలన మొనర్చుచు నొక్కనాడు తన పరిపాలన మేతీరున నడుచుచుండెనో చూడగోరి ప్రచ్ఛన్నవేషమున దనరాజ్యమున గ్రుమ్మరుచుండ నొకచోట పశులకాపరితనయుడగు పసిబాలు డొకడు మార్గమునకడ్డుగా గూర్చుండి చిన్నిస్తూపము నొకదానిని గట్టుచుండెను. కనిష్కనృపతి యాకుఱ్ఱని నిర్మాణకౌశలమును జూచి రిచ్చవడి "పాపడా! నీవిచ్చట నేమిచేయుచుంటివి?" యని ప్రశ్నించెను. "అయ్యా! బుద్ధభగవానున కొకస్తూపమును గట్టుచుంటిని." అని బాలుడు ప్రత్యుత్తరమొసంగెను. బాలుని కార్యదీక్షకెంతయు నచ్చెరువందుచు కనిష్కభూపాలుడు ముద్దులొల్కెడు యీబాల స్తూపముపై వేరొక స్తూపమును గట్టించెను. ఈ బాలుడు నిజముగ పశులకాపరి పాపడు కాడు. ఇంద్రభూపతి. బౌస్తూపము నొక్కదానిని నిర్మింప కనిష్కనృపుని బ్రేరేపించుటకై యాతడు పశుపాలకునిరూపము దాల్చి నృపాలుడరుదేరుమార్గమున కెదురుగా గూర్చుండి యొక చిన్న స్తూపమును నిర్మింపదొడగెను.

కనిష్కనృపునిచే గట్టింపబడిన స్తూపము నన్నూరడుగుల యౌన్నత్యముగల్గి రత్నమణిస్థగితమై, కాంతులీనుచు నేత్రపర్వ మొనర్చుచుండును. మనపాంథు లెచ్చటను దీనిని బోలిన



స్తూపమును గాంచినది లేదు. సౌందర్యమున దీని మరపించు స్తూపము భారతవర్షమున వేరొండు కానరాదు. జంబూద్వీపమున+ నీస్తూపరాజము రమణీయతకు నిరుపమానమని ప్రఖ్యాతిగాంచినది. కనిష్కభూమీశుని స్తూపము పూర్తియైన పిమ్మట నంతర్గతమై లోన మడగియున్న యీపసిపాపని చిన్న స్తూపము ఉన్నతస్తూపమును దక్షిణపార్శ్వమున బెకల్చుకొని బయలువడెను. దీనియెత్తు మూడడుగులకు పైగా నుండును.

ఈరాజ్యముననే బుద్ధుని కక్షపాల గలదు. మున్నొకసారి "యూషీ" * రాజ్యనృపు డీకక్షపాలను దనరాజ్యమునకు గొంపోవ దలంచి, ప్రచండమగు సైన్యముల వెంటగొని పురుషపురముపై నెత్తివచ్చి, తద్రాజ్యము నవలీల జయించెను. పురుషపురము యూషీభూమీశుని పాదాక్రాంతమయ్యెను. అట్లు దిగ్విజయమును బడసి యా

---

+ ప్రాచీన, హైందవ, భూగోళశాస్త్రసరణి, భూవలయమున నాల్గుమహాఖండములు గలవు. అందు జంబూద్వీపమొకటి. ఇయ్యది యాకారమున, జంబూపత్రమునుబోలియుండుటచే దానికిజంబూద్వీప మనునామము గల్గినది. ఈద్వీపము మేరుపర్వతమునకు దక్షిణదిగ్భాగమున నున్నది.

* దీనికే తుఖారగూడెమని పేరు. తార్తారులును, యిండోసిథియనులును నీరాజ్యమున నివసించు ప్రజలు. వీరలు హూణులచే (Huns) తమ మాతృదేశమునుండి దరుమగొట్టబడి (క్రీ. పూ. 160) ట్రాన్సాక్సియానా, బాక్ట్రియను రాజ్యములపైబడి యాదేశముల విధ్వంసమొనర్చి పిమ్మట భారతఖండమును జొచ్చి పాంచాల, కాశ్మీరరాజ్యముల జయించిరి. వీరిలో ప్రఖ్యాతుడగురాజు కనిష్కభూపాలుడు. ఈసందర్భమున ఫాహియానుచే బేర్కొనబడిన నృపుడు కనిష్కుడై యుండనోపు.

నృపుడు కక్షపాలను గొనిపోవ నుద్యుక్తుడై తానును బౌద్ధ మతాభిలాషియే యగుటచే మున్నుగా దనసేనానులతో గలిసి మణిత్రయమునకు యథోచితముగ బూజలొనర్చెను. పిమ్మట నొక యుత్తుంగగజరాజమును రావించి భూషణావళులచే మనోహరముగ దాని నలంకరింపజేసి, కక్షపాలను దానిపై నుంచి గజమును దోలింపసాగెను. కాని యాద్విరదము జటాలున నేలపై గూలపడి మరలలేవజాలదయ్యెను. ఒక్కయడుగైనను ముందునకు సాగిపోవజాలదయ్యెను. నృపాలుడంతట గజశకటము నొండుగూర్పించి కక్షపాలనందుంచి, బలిష్ఠములగు నెనిమిది గజయూథముల నాశకటమునకు బన్నితోలెను. ఈసారియైనను నృపునిజతనములు ఫలింపవయ్యెను. ఏనుగులు తమశక్తినంతయు ధారవోసెను. శకటము చలింపదయ్యెను. రోషముతో నాగజబృందము హుమ్మని బట్టి లాగెను. కార్యము లేకపోయెను. శకట మొక్క యంగుళమైనను ముందునకు గదలదయ్యెను. నృపవరుడు ఖిన్నుడై యీ కక్షపాలను గొనిపోవుట కింకను దరుణము సమీపింపలేదని తలంచి దానినచ్చటనే దిగవిడచి నిజరాజ్యమునకు మరలిపోయెను. పోవునపు డచ్చోట నొకస్తూపమును నిర్మించి కక్షపాలను గాపాడుచుండుడని యచ్చట నాయుధపాణులగు భటుల గాపుంచెను. ఆచెంతనే యొక మఠమున గూడ కట్టించెను. ఇప్పుడీమఠమున నేడువందల బౌద్ధసన్యాసులు నివసించుచుండిరి. అపరాహ్ణము తిరిగినంతనే యిచ్చటనుండు సన్యాసు లీకక్షపాల ననుదినమును సంఘారామమునుండి వెలుపలకు గొనివచ్చి



పూజలొనర్చి, నైవేద్యము లర్పించి పిదప భుజింతురు. సాయంసమయమున గూడ నిట్లే దానిని బహిఃప్రదేశమునకు గొనివచ్చి ధూపములు వైచెదరు.

ఈకక్షపాల శ్యామలవర్ణముగ నుండును. అద్దమువలె స్నిగ్ధమై, నిగనిగలాడుచు మెరుగులీనుచున్నది. దీని పైయంచు లదిలకించిన నీకక్షపాల విచిత్రనిర్మాణవైఖరి* ద్యోతకమగును. నాల్గుకక్షపాలలొకదానిలో నొకటి విలీనమై యీకక్షపాల నిర్మాణమైనట్లు విస్పష్టము జేయుచు దానియంచులకండ నాల్గు పొరలు గాన్పించుచుండును. ఈకక్షపాలమందము అంగుళములో నైదవభాగ ముండును. నిరుపేదలగువార లిందు కొలది పుష్పములు బడవైచినను నియ్యది సంపూర్ణముగ నిండిపోవును. ధనాఢ్యులు, కుసుమరాసుల గంపలతో దెచ్చి గుమ్మరించినను యీకక్షపాల నిండదు.

---

* గౌతముడు బుద్ధుడైనతోడనే బ్రహ్మదేవునిచే యాతనికొసంగబడిన కక్షపాల యదృశ్యమయ్యెను. అంతట నల్వురధిష్ఠానదేవతలును నాల్గు మరకతనిర్మితములగు కక్షపాలలను దెచ్చి యాతని కొసంగిరి. కాని వానినీతడు గ్రహింప నొల్లడయ్యెను. పిమ్మట వారలు (వేరుసెనగకాయవలె) ఇంచుక పసిమివర్ణముగల్గిన శిలానిర్మితములగు కక్షపాలలను దెచ్చి "నే గొనివచ్చినది పుచ్చుకొమ్మ, నే గొనివచ్చినది పుచ్చుకొ" మ్మని తగవులాడ జొచ్చిరి. బుద్ధుడంతట నా నాల్గింటిని దెమ్మని వాని నన్నిటిని యొక దానిలో నొకటి యమర్చి యొక్కటిగా జేసివైచెను. ఈ కక్షపాలపైయంచుల దిలకించిన నాల్గుకక్షపాలల కలయికయు విస్పష్టముగా గానగును.

పాయూను సాంకింగులు కక్షపాలకు యథావిధిగ బూజలొనర్చి యచ్చటనుండి చైనాదేశమునకు మరలిపోయిరి. హ్యూకింగు, టోచింగు, హ్యూటాయున్నగు యాత్రికులు బుద్ధుని ఛాయా, దంత, కపాలాస్థికలందు పవిత్రక్షేత్రముల దర్శింపనిచ్ఛగొని తిన్నగా నగారా ♦ రాజ్యమునకు బయనమైపోయిరి. పాపమిచ్చట హ్యూయింగు రోగపీడితుడయ్యెను. ఇతనికి బరిచర్యలొనర్చుటకై టోచింగు యితనికడ నాగిపోయెను. హ్యూటా యొంటరియై పురుషపురమునకుబోయి, యచ్చట తక్కటి యాత్రికుల గలిసికొని, యచ్చటనుండి పాయూను, సాంకింగులతో గలిసి యాత్రచాలించి సిన్ను సామ్రాజ్యమునకు వెడలిపోయెను. హ్యూయింగునకు వ్యాధి ప్రబలమై తుద కాతడు శాక్యసింహుని కక్షపాలయున్న సంఘారామమున మృతినొందెను. ఫాహియాను యేకాకియై, గౌతముని కపాలాస్థికలున్న తావునకు బయనమైపోయెను.

---

♦ దీనినిగూర్చి ఎనిమిదవ ప్రకరణమున జెప్పబడినది.

# పదుమూడవ ప్రకరణము

## నగారా రాజ్యము

ఫాహియాను డిట్లొంటరియై పశ్చిమదిశగా బదునారు యోజనము లరిగి, 'నగారా' రాజ్యసరిహద్దులలోనున్న 'హెలో' * యను బట్టణము జేరెను. ఆమూలాగ్రముగ సువర్ణచ్ఛాదితమై సప్తమణిస్థగితమై యొప్పారుచుండెడు నొకదివ్య విహారమున ♦ బరిరక్షితమై శాక్యసింహుని కపాలాస్థిక యచ్చటనే గలదు. నగారా రాజ్యమేలు నృపాలున కీశల్యశకలములపై నమితమగు పూజ్యభావము. దీని ననుదినమును దర్శించి, పూజలొనర్చి పోవుచుండును. దీని నెవ్వరును దస్కరింపకుండ బరిరక్షించుటకై యీరాజు తనరాజ్యమునంగల యుత్తమవంశజులగు నెనమండుగురు యోధుల నహోరాత్రములు నీవిహారమునకు కావలివెట్టెను. వీర లీయస్థిక గంటిలోని రెప్పవలె గాపాడుచుందురు. సూర్యుడస్తమించినంతనే నీవిహారరక్షకులు విహారద్వారమును మూసి ముద్రలువైచి గృహములకు బోయెదరు.

---

* పెషావరు పట్టణమునకు బశ్చిమముగానుండు హిడ్డానగరమే యీ హెలోపట్టణమై యుండనోపు. దీనికి 'హీలో' యను నామాంతరముగూడ గలదు. 'హీలో' యన శల్యమని యర్థము.

♦ ప్రథమమున బౌద్ధసన్యాసులు నివసించు పర్ణకుటీరములు విహారములని పిలువబడుచుండెడివి. తరువాత గౌతమునికక్షపాల, దంత, శల్యములు మున్నగాగల పవిత్రవస్తుచయము నుంచుటకై గోపురాకారముగ నిర్మింపబడు కట్టడములకుగూడ విహారము లనునామము గల్గెను. ఇట్టి కట్టడములు బేహారమున విరివిగ నుండుటచే వీనికి విహారము అనుపేరు కల్గెను.

ఈ యెనమండుగురి వీరాగ్రేసరుల యొద్దను నెనిమిది ముద్రలుండును. ప్రభాతమగుటతోడనే వీరు సురల విహారమునకుజని ముద్రల బరిశీలించి తలుపుల దెరచెదరు. పిమ్మట బన్నీటితో హస్తముల గడిగికొని శల్యమును వెలికి గొనివత్తురు. విహారమున కావల బహిఃప్రదేశమున నున్నతమగు నొక శిలావేదిక నిర్మింపబడియుండును. దీనిపై గుండ్రని మణిస్థగితమగు సింహాసన మమర్పబడియున్నది. ఈరత్నపీఠికపై నస్థికనుంచి దానిపై వైడూర్యనిర్మితమై, ముత్తియములు బొదిగి ఘంటాకృతిగానుండు నొకడోలికను మూతగా పెట్టెదరు. ఈ శల్యము గొంచెము పసిమి డాలుగానుండు ధవళవర్ణము గలిగి యర్ధచంద్రాకృతిగా నున్నది. దీనికైవారము పండ్రెండంగుళము లుండును. ప్రతిదినమును దీనిని విహారాంతర్భాగమునుండి బయటకు గొనివచ్చువేళల విహారరక్షకులొక మహోన్నత మగు చంద్రశాలపై నెక్కి తాళమృదంగాది రావము లొనర్తురు. శంఖముల బూరింతురు. ఈమంగళధ్వానముల వినినంతనే నృపుడు పూజాద్రవ్యముల హస్తమున గొని వేవేగ విహారమునకు జని, యస్థికకు బూజలొనర్చును. పిమ్మట నతడును నాతనియనుచరులు, ఒక్కరొక్కరే, పదిలముగ నా శల్యమును బైకెత్తి శిరమున నిడికొని మరల దానిని యథాస్థానమున నుంచి పశ్చిమద్వారమునుదాటి విహారమును నిర్గమించి (తూర్పుద్వారమున విహారమును బ్రవేశింతురు) వెడలిపోయెదరు.

నగారా రాజ్యాధిపు డిట్లే యనుదినమును ప్రాతఃకాలముననే విహారమునకు జని, యస్థికకు బ్రణమిల్లి పూజలొనర్చును.



ఈ యారాధనకృత్యములు ముగిసిన వెనుకగాని యాతడు తన పరిపాలనాకార్యముల నిర్వర్తింప నొల్లడు. ఇచ్చటి వైశ్యులును నిట్లే మున్నుగా, నీశల్యమునకు బూజలొనర్చియటుపిమ్మటనే సంసారకృత్యముల జక్కబెట్టుకొనెదరు. అనుదినమును యీతీరునే యీశల్యమునకు పూజాపురస్కారములు జరుగుచుండును. పూజావిధానమంతయు సమాప్తియైన పిమ్మట యస్థికను విహారములోనికి దీసికొనిపోయెదరు. దీనినుంచుటకై విహారాంతర్భాగమున "విమోక్ష"* యనెడు స్తూప మొకటి గలదు. ఇయ్యది యైదడుగులపొడవుగల్గి రత్నఖచితమై ద్యుతుల నీనుచున్నది. విహారద్వారమునకు ముంగిటభాగమున పూలయంగడు లెన్నియో గలవు. అచ్చట కుసుమధామములు చందనాగరు మున్నగు పూజాద్రవ్యముల నమ్ముచుందురు. శల్యసందర్శనమునకై వచ్చు యాత్రికాగణ మీపుష్పములుగొనియస్థికను బూజించి పోవుచుందురు. ఈ పరిసరరాజ్యములనేలు రాజన్యులెల్లరును గౌతముని యస్థికకు దఱుచుగ కానుకలంపుచుందురు. ఈ శల్యవిహారము నలువదియడుగుల వైశాల్యము గల్గిన చతురమున గట్టబడినది. నభోంతరాళము కంపించినను క్షోణీతలము వికావికలై తునియలైనను యిత్తావు చలింపదు.

హెలోపట్టణమునుండి బయలుదేరి మనపాంథులిచ్చటి కుత్తరదిశగా నొక్క యోజనముదూరముననున్న నగారారాజ్యపు రాజధానీపట్టణమును జూడబోయిరి. బుద్ధుడు బోధి

* మోక్షదాయిని యనియర్థము.

సత్త్వుడై యుండిన కాలమున నైదు పుష్పమంజరుల మూల్యమునకు గొని దీపాంకరు × నకొసంగిన తావియ్యదియె. ఈ పట్టణమధ్యభాగమున నొక స్తూపము గలదు. ఇయ్యది బుద్ధుని దంతమునుంచుటకై కట్టబడిన స్తూపము. బుద్ధునికపాలశల్యమునకుబలెనే దీనికిని యనవరతము పూజలుజరుగుచుండును. అసంఖ్యాకులగు జను లెవ్వేళను దీనిని దర్శించి పోవుచుందురు.

ఈపట్టణమున కీశాన్యభాగమున నొకపర్వతపులోయ గలదు. ఇచ్చటనే బుద్ధునియోగదండ మున్నది (పలవలుదీరి సన్న్యాసులకడనుండు నొకవిధమగు దండము). ఈ ప్రదేశమున నిప్పుడొక విహారము నిర్మింపబడి యున్నది. ఇచ్చటికిని వేలకొలది బౌద్ధయాత్రికు లరుదెంచి కానుక లర్పించి చనుచుందురు. ఈ దండము గోశీర్ష ♦ పర్వతోపరిభాగమున బెరుగు మంచిగంధపుగట్టితో నిర్మింపబడినది. పదునారు, పదునేడడుగుల పొడవున నుండును. ఇయ్యది మహాదీర్ఘమగు నొక కొయ్య గొట్టమున బరిరక్షితమై యున్నది. శతసహస్ర సంఖ్యాకులు పట్టి లాగినను దీని నీ యొరనుండి బయటకు దీయుట దుర్లభము.

---

× శాక్యసింహున కిరువదినాల్గవ తరమువాడు. ఇంతముందుగనే బుద్ధుడీతనితో తాను భూలోకమున నవతరింప బోవుచుంటినని తెల్పెను.

♦ గోశీర్ష పర్వతప్రాంతమున తామ్రవర్ణవిలసితములై సుసౌరభముల గుప్పుమ్మరించు చందనతరువులు విరివిగ బెరుగుచుండునని ప్రతీతి. ఈ పర్వతము "ఉల్లరకురు" మహాఖండమున మేరుశైలమున కుత్తరదిశగా నున్నది. ఈ పర్వతము గోశిరమును బోలియుంటచే దీని కీనామము గల్గినది.



ఈపర్వతకనుమనుదాటి పశ్చిమముగా గొంతదూర మేగినచో నింకొక విహారము గాననగును. ఇందు బుద్ధుని సంఘాటి* (సంఘాళి) గలదు. ఈ రాజ్యమున ననావృష్టిదోష మావహిల్లినప్పు డెల్లజనులు తండోపతండములై యీ విహారమునకు గదలిపోయి బుద్ధుని సంఘాటిని వెలికిగొని వచ్చి, దానికి ప్రదక్షిణము లొనర్చి మొక్కులిడి పూజలు సేతురు. వెనువెంటనే గగనభాగమంతయు మేఘసంకీర్ణమై యొక్కుమ్మటిలో కుంభవృష్టి వర్షము గురియును.

ఈ రాజధానీనగరమునకు దక్షిణభాగమున నొక యర్ధయోజనదూరమున, నెత్తగు పర్వత మొకటిగలదు. ఇందొక శిలాగహ్వరమున్నది. ఇయ్యదియె గౌతముడు తన తనుచ్ఛాయనువిడిచిపోయినచోటు. పదిబారలదూరముననుండి యీ ఛాయను వీక్షించునెడల శాక్యసింహుని దివ్యదేహమును బ్రత్యక్షముగ చూచుచుంటిమా యనిపించును. పసిడికాంతుల మఱపించు నాతని శరీరకాంతి, యాతని సహజసౌందర్యమునకు మఱింతవన్నెవెట్టు నాతని మేనిపై నలరారు బుట్టుమచ్చలు.♦ విస్పష్టముగా గాన్పించును. దాపునకు బోయినకొలదియు నీదేహచ్ఛాయ స్వప్నదృశ్యమువలె యస్పష్టమగును.

---

* భుజసీమనుండి పాదముల వరకును వ్రేలుచుండు సన్న్యాసులు ధరించు దీర్ఘమగు సంగీ.

♦ ఇట్టి పుట్టుమచ్చలు బుద్ధుని మేనిపై నూటపండ్రెండు (చిన్నవెనుబదియు పెద్దవి ముప్పదిరెండును) గలవని బౌద్ధగ్రంథములందు వ్రాయబడియున్నది.

ఈ పరిసర రాజ్యముల బాలించు నృపాలు రెందఱో నిపుణమతులగు చిత్రకారులనంపి, యీ ఛాయయొక్క చిత్తరువును వ్రాయింప బహువిధప్రయత్నము లొనర్చిరి. కాని యియ్యది దుస్సాధ్యమయ్యెను. ఎంతటి చిత్రకారుడైనను యీతని మేని ఛాయచిత్రపటమును జిత్రింపజాలడయ్యెను. సహస్రబుద్ధులును తమతమచ్ఛాయల నిచ్చటనే విడచిపోయెదరని యీ ప్రాంతవాసులు చెప్పుకొనెదరు.

బుద్ధుని ఛాయాగహ్వరమునకు బశ్చిమముగ నూరుబారలదూరమున శాక్యసింహుడు కేశఖండన, నఖవిచ్ఛేదనము లొనరించుకొనిన తావుగలదు. గౌతముడును నాతని శిష్యగణమును రాబోవు పురుషాంతరములందు నిర్మింపబడు స్తూపావళి కాదర్శప్రాయముగ నుండునట్లొక స్తూపరాజమును గట్టిన దీప్రదేశముననే. ఈస్తూపము డెబ్బదియెన బదియడుగుల యునతిగల్గి మేఘమండలమును దాటిపోవుచున్నది. ఇయ్యది నేటికిని గాననగును. ఈ స్తూపమునకు దాపుననేయొక సంఘారామము గలదు. అందు నివసించు బౌద్ధసన్యాసు లేడువందలకు బైగా నుండుదు. ఈప్రాంతమున వసియించిన యర్హతులయొక్కయు ప్రత్యేక బుద్ధుల♦యొక్కయు జ్ఞాపకార్థమై నిర్మింపబడిన స్తూపము లొక్కసహస్రముండును.

♦ వీరికే నిదానబుద్ధులనియు బ్రత్యేక 'జినుల'నియు నామాంతరములు గలవు. వీరు సంసారసౌఖ్యముల త్యజించి, సన్యాసవృత్తిని జేపట్టిన బౌద్ధసన్యాసులు. గురుశిక్షణలేకయే బుద్ధత్వమును సముపార్జించినవార లగుటచే వీరన్యులకు మోక్షపథముల నిరూపింపజాలరు. ప్రాచీన బౌద్ధమతకాలమున నిట్టి సన్యాసులున్నట్లు గానరాదు.

# పదునాల్గవ ప్రకరణము

## హ్యూకింగు యాత్రికుని మరణము.

## "లోయి" "పోహాన" రాజ్యములు

శీతకాలమంతయు నిచ్చటనే గడపి యటు పిమ్మట మన పాంథుడిరువురిమిత్రుల*తో గలిసి యిచ్చోటనుండి పయనమై దక్షిణదిశగాబోయి కొన్నిదినములకు క్షుద్రహిమశైలముల♦ సమీపించెను. ఈ నగోపరిభాగమున నేకాలమును హిమంబు బేరుకొని యుండును. ఈ పర్వతశ్రేణి యుత్తరభాగమున మన యాత్రికు లాకస్మికముగ బోరున విచెడు శీతలవాయువుల దాకిరి. అంతటి శీతలమును వా రెన్నడు జూచి యెఱుగరు. చలిచే వారి శరీరములు గడగడ వణకిపోయెను. నోటినుండి మాట వెలువడదయ్యెను. పాపము! హ్యూకింగున కీచలిగాలులు మరింత దుర్భరము లయ్యెను. ఆతడొక్కయడుగైనను ముందునకు సాగిపోవజాలడయ్యెను. నోటనుండి నురగల గ్రక్కసాగెను. ఈతనికి మృత్యువాసన్నమయ్యెను. ఇతడు ఫాహియానును బ్రక్కకు బిలిచి "మిత్రమా! నేనింక జీవింపను. ఒక్కక్షణమైన నాలసింపక, మీరిచ్చోటు వాసి పొండు. జాగొనర్చెదరేని మీరును నిచ్చట మరణము దప్పదు. నే బోవుచుంటిని. నాకై మీరు చింతింపవలదు."

* టోచింగు, హ్యూకింగులు.

♦ ఆర్యావర్తమునకు బశ్చిమోత్తరభాగముననున్న సఫేదుకో పర్వతపంక్తులు. వీనిశిఖరము లెప్పుడును హిమముచే గప్పబడియుండును.

అని హీనస్వరముతో బల్కుచు నాతడు ప్రాణముల విడిచెను. ఫాహియాను కన్నీరు నింపుచు నాతని మృతకళేబరమును గౌగిలించుకొని "మన సంకల్పమునకు భంగము వాటిల్లెను. ఇయ్యది విధిప్రేరితము*. చేయునదేమి?" యని విలపించి హతశేషుడగు మిత్రుని వెంటగొని యెట్టులో గష్టము మీద యీమంచుగొండల నిర్గమించి "లోయి" ♦రాజ్యమును జేరుకొనెను. ఈ రాజ్యమున మూడువేలమంది బౌద్ధసన్న్యాసులు గలరు. వీరిలో హీనయానులును, మహాయానులును గూడ గలరు.

మన బాటసారులు శీతకాల మిచ్చట గడిపి యటు పిమ్మట యిచ్చటనుండి బయలుదేరి దక్షిణముగా మరలి పదిదినములకు "పోహన" † యనురాజ్యము సమీపించిరి. ఈ రాజ్యమునగూడ మూడువేల బౌద్ధ

* ఈ శబ్దము లుచ్చరించుట, యిట్టి విపత్తరుణమున మానవమాత్రులకు సహజమైనను, ఫాహియానువంటి బౌద్ధశ్రమణకుని నోటనుండి వెలువడరానివి. ఏలన బౌద్ధులు విధిసంఘటనమును విశ్వసింపరు. ఆ త్రుటియందు కన్ఫ్యూషియను మతభావము లాతని మనము నావరించి బౌద్ధమతసిద్ధాంతములను మరుగుపరచెను.

♦ ప్రస్తుత ఆఫ్గనిస్థానము. ప్రాచీనకాలమున నీ దేశమునకు "లోయి" రాజ్య మనిపేరు. "రోయి" యనిగూడ దీనికి నామాంతరము గలదు.

ప్రస్తుతము "బన్నూ" లేక, "ఫలానా" జిల్లా యని వ్యవహరింబడు ప్రాంతమునకే ప్రాచీనకాలమున పోహానరాజ్యమని పేరు.



శ్రమణకులు నివసించుచుండిరి. వీరిలో మహాయాను లెవ్వరును లేరు. అందరును హీనయానులే.

ఈ రాజ్యమును వీడి మన పాంథు లిరువురును మూడు దినములు ప్రయాణ మొనర్చి మరల సింధునదీజలముల దాటి యావలియొడ్డునకు బోయిరి. ఈ నదీప్రవాహమున కిరుపార్శ్వముల నుండు విశాలభూభాగమంతయు సమతలమైన పల్లపునేల.

---

# పదునైదవ ప్రకరణము

## "భీద" రాజ్యము

సింధునదిని దాటినంతనే మన తెరువరులు "పెటూ"* యనురాజ్యమును దారసిల్లిరి. బౌద్ధమత మిచ్చట మిగుల ప్రాబల్యముగాంచెను. ఇందు నివసించుసన్న్యాసులలో నుభయశాఖల (హీనయాన, మహాయాన) వారును గలరు. కడుదూరమున నుండెడు చైనాసామ్రాజ్యమునుండి యార్యావర్తమును దర్శింప బౌద్ధసన్న్యాసు లేతెంచి రనువార్త వినినంతనే యిచ్చటి ప్రజ లాశ్చర్యమానసులై "అన్యదేశీయులగు వీరలు బౌద్ధమతసారమును గుర్తెరంగి సంసారతాపత్రయముల విసర్జించి విరాగులై సన్న్యాసదీక్ష గైకొనుటయు అంతటి దవ్వులనుండి బౌద్ధమతధర్మముల నరయుటకై భారతరాజ్యమున కరుదెంచుటయు

* పాంచాలము—మన యాత్రికుడు దర్శించినకాలమున ప్రస్తుత పాంచాలరాజ్యము పెటూ యనియు భీద యనియు బిలువబడుచుండెను.

మిగుల నబ్బురముగాదె" యని యాశ్చర్యవందుచు వారి కతిథిమర్యాదలజూపి వలయువస్తుసామగ్రిని సమకూర్చి యెంతయు నాదరించిరి.

---

# పదునారవ ప్రకరణము

## మధురరాజ్యము- మధ్యభారతమునందలి సాంఘిక, రాజ్యాంగ వ్యవస్థలు

పాంచాలమును వీడి మనపాంథు లాగ్నేయముగ నెనుబది యోజనములు ప్రయాణ మొనర్చి కొన్ని దినములకు 'మధుర' * యను రాజ్యమును జేరిరి. మార్గమధ్యమున నెన్నియో సంఘారామముల వీక్షించిరి. అందందు నివసించు బౌద్ధభిక్షుకుల నెందరినో సందర్శించిరి. వారింకను 'పూనా' ♦ నదీతటమునంటియే పోవుచుండిరి. ఈ నదీప్రవాహమున కిరుకెలంకులందును విశాలమగు బౌద్ధమఠము లిరువది గలవు. అందు నివసించు శ్రమణకులు మూడువేలకు పైగా నుందురు.

* మధుర- శ్రీకృష్ణుని జన్మనగరము. దీనికి మయూరనగరి యను నామాంతరము గలదు. కృష్ణభగవానుని వాహనము మయూరమగుటచే ఈ నగరమున కాపేరు గల్గెను.

♦ ఇయ్యది యమునా తరంగణియై యుండనోపు. దీనికి బూనానదియను పేరెట్లుగల్గెనో తెలియకున్నది.



బౌద్ధమత మిచ్చట మిక్కిలి యభివృద్ధి గాంచెను. ఉత్తరభారతమునం దెడారికి బశ్చిమభాగమున విలసిల్లెడురాజ్యములనేలు రాజన్యులెల్లరు బౌద్ధమత స్వీకారులు. బౌద్ధశ్రమణకులయెడ వీరి కమితమగు పూజ్యభావము. వారికి కానుకలొసంగునపు డీనృపవరులు గిరీటములదాల్పరు. కిరీటము లూడ్చి శూన్యమస్తకులై వారిని సంభావింతురు. భిక్షువులకు భోజనాదు లొసంగునపుడు తమ యమాత్యగణబంధుసందోహములతో వారి కభ్యాగతులై మృష్టాన్నములతో వారిని బరితృప్తుల జేయుదురు. శ్రమణకుల మ్రోల వీరెన్నడును ఉన్నతాసనములపై నధివసింపరు. రాజాధిరాజైనను పర్యంకముపై నాసీనుడై వీరితో భాషింప సాహసింపడు. వారితో భాషింపవలసినపు డిచ్చటినృపులు వారిముంగిట నొక రత్నకంబళమును బరచి దానిపై గూర్చుండి వినమ్రులై వారితో ముచ్చటింతురు. ఇట్టి యతిథిమర్యాదలు బుద్ధుడు సజీవుడై యుండిన కాలమున బుట్టినవి. ఇయ్యవి నా డెట్టివిధమున బాటింపబడెనో నేటికిని యదేవిధమున బాటింపబడుచున్నవి. ఈయాచారము లీప్రదేశమున నణుమాత్రమైనను మార్పునొందక బెక్కుతరములనుండి యట్లే నిల్చియున్నవి.

మధురరాజ్యమునకు దక్షిణభాగమున వ్యాపించియుండు దేశమంతయు మధ్యభారత మనబడును. ఇయ్యది సమశీతలప్రదేశము. ఈ ప్రాంతమం దెచ్చటను తుషారములు కానరావు. హిమంబు మచ్చునకైనను గాన్పింపదు. ఇచ్చటి ప్రజ లైశ్వర్యవంతులై సౌఖ్యమున నోలలాడుచుండిరి.

ఇచ్చటి రాజ్యపాలన మత్యంతసౌఖ్యదాయక మైనది. ప్రజాపీడన మణుమాత్రమైన నీరాజ్యభాగమున గానబడదు. ప్రజాస్వాతంత్ర్యమునకు భంగము గల్పించు రాజశాసనము లరిది. ప్రజలు తమ గృహముల నొక యధికారికడ నమోజు చేయించుకొనవలయు నను నియమము లిచ్చట లేవు. ఱేనిభూక్షేత్రముల సేద్యమొనర్చు కృషీవళులు మాత్రము కొంత సస్యభాగమును నృపునకు జెల్లింపవలయును. కర్షకులు తమకిష్టముండిన రాజమాన్యముల సేద్య మొనరింపవచ్చును. లేకుండిన వీడిపోవచ్చును. ఎల్లకాలమును వాని నంటియుండవలయు నను నిర్బంధము లేదు. తాడనశిరచ్ఛేదనములు మున్నగు క్రూరశిక్షల విధింపక యే యిచ్చటినృపులు రాజ్యపాలన మొనర్తురు. వారలొనర్చు తప్పిదములబట్టి దోషులకు జరిమానాలను మాత్రమువిధించుట గలదు. ఇదియె యీ రాజ్యమున నపరాధులపై విధింపబడు కఠినశిక్ష. ఱేనిపై బెక్కుసారులు తిరుగుబాటుసల్పి యాతని పదభ్రష్టుని గావింప దలపడిన రాజద్రోహికైనను మరణదండన విధింపరు. అట్టియపరాధుల దక్షిణహస్తముల ఛేదించి విడుతురు. ఈ ప్రాంతమున రాజ్యమేలురాజుల యంగరక్షకులకుగూడ నిర్ణీతవేతనములు గలవు.

ఈవిశాలరాజ్యమందలి ప్రజలెవ్వరును జీవహింస యొనర్పరు. మద్యమును గ్రోలరు. వెల్లుల్లి, నీరుల్లి మున్నగు నింద్యపదార్థముల దినరు. పశువధ మొదలగు క్రూరకర్మల నాచరంపుచు దూరమున పురబాహ్యప్రదేశమున నివసించు మానవుల



కీప్రాంతమున చండాలు రనిపేరు. పురమున బ్రవేశించునపుడును, విపణివీధుల బోవునపుడును, తాము చండాలురమని తెలుపుటకై వీరు కఱ్ఱతో గొట్టుకొనుచు చప్పుడు చేయుచు బోయెదరు. ఆప్రాంతమున సంచరించు జను లాధ్వని విని, వారి సంపర్కము దగులకుండ దూరముగ దొలగిపోయెదరు.

ఇచ్చట నివసించు జనులెవ్వరును కుక్కుటములు, సూకరములు మున్నగు క్షుద్రజంతువుల బెంచరు. జీవముతోనుండు పశువుల విక్రయింపరు. ఈరాజ్యమందలి విపణవీధులందెచ్చట వెదకినను మాంసవిక్రయ మొనర్చు కసాయిదుకాణములు గన్పింపవు. మద్యవిక్రయశాలలు కానరావు. వాణిజ్యవ్యాపారములయందు నాణెములుగా నీ ప్రాంతవాసులు గవ్వల నుపయోగింతురు. ఈరాజ్యమున చండాలురే మృగవధాజీవనులు. వీరలే జంతువుల వేటాడి చంపెదరు. మత్స్యమాంసముల వీరలే విక్రయింతురు.

బుద్ధుడు నిర్వాణమునొందినపిమ్మట యీ పరిసరప్రాంతముల నేలు భూవరులు, బౌద్ధసన్యాసుల యారాధనలకై విహారముల గట్టించిరి. వారికి గృహములను, మాన్యక్షేత్రములను, ఆరామసీమలను, పొలముల సేద్యమొనర్చుటకై యెద్దులను దాన మొసంగి వీనిని నవిచ్ఛిన్నముగ, నాచంద్రతారకముగ ననుభవింపుడని, లోహఫలకములపై దానశాసనముల వ్రాయించిరి. వారి తరువాత సింహాసన మధిష్ఠించిన రాజులును ఈ సన్యాసుల కొసంగబడిన భూ గృహారామముల మట్టక, దానశాసనముల శిరమునదాల్చి పాలించిరి.

ఈ లోహశాసనములు నేటికిని నీప్రాంతమున గాననగును.

సత్కార్యాచరణము, సూత్రపఠనము, ధ్యాననిష్ఠయు, బౌద్ధభిక్షువుల పవిత్రధర్మములు. ఆహారవస్త్రాదులతోడను, శయ్యాపర్యంకములతోడను, నమరియుండు గదులెప్పుడును అన్యప్రాంతములనుండి యరుదేరు బౌద్ధశ్రమణకుల కొఱకై యిచ్చుట సిద్ధముగ నుంచబడును. పరివ్రాజకులగు సన్న్యాసులేతెంచిరని వార్త వినినంతనే ఆ ప్రాంతమందలి సంఘారామమున వసియించుభిక్షువులు వారి కెదురేగి, స్వాగతమొసంగి, తమ నిలయమునకు గొనివత్తురు. వారి యుడుపులను, కక్షుపాల యోగదండములను తామే మోసికొనివత్తురు. గృహము జేరినంతనే వారికి పాదముల గడిగికొనుటకై యుదకమును, పాదలేపనకై తైలమును నొసంగి యాసీనుల జేయుదురు. నిర్ణీతవేళల ద్రవరూప* మగు నాహారముల నొసంగి సంప్రీతుల జేయుదురు. పిమ్మట నా పరివ్రాజకుడు కొంతతడవు బడలికతీర విశ్రమించినపిదప దరికిజేరి "అయ్యా! మీర లీ సన్న్యాసదీక్ష గైకొని యెన్నివత్సరములైన" దని

* భిక్షువులు సూర్యోదయము మొదలు అపరాహ్ణమువరకును ఘనరూపమగు నాహారమును భుజింపవచ్చును. తక్కటివేళల భుజింపరాదు. అన్యకాలములం దట్టియాహారమును, భుజించుట నిషిద్ధము. అట్లు భుజింపబడు నాహారము "వికల" మగును. మార్గాయాసముచే నలసినపాంథులు మాత్రము తక్కటివేళలందుగూడ మధువు, నవనీతము మున్నగు భక్ష్యములు గొనవచ్చును.



ప్రశ్నించి, యాతని పూజ్యతాపూజ్యతలబట్టి యాతని కర్హమగు శయనమందిరమును జూపెదరు.

ఈ ప్రాంతమున నివసించు బౌద్ధశ్రమణకుల యావాసములకుదాపున సారిపుత్ర♦ మహామౌద్గల్యాయన* యానందుల+ గౌరవార్థమును, అభిధర్మ వినయసూత్ర పీఠికల¶ గౌరవార్థమును గట్టింపబడిన స్తూపము లనేకములుగలవు.

♦ సారిపుత్రుడు శాక్యసింహుని శిష్యకోటిలో నగ్రగణ్యుడు. విద్యాపారంగతుడు. ప్రతిభాశాలి. బుద్ధుని "కుడిభుజ"మని ప్రఖ్యాతినొందెను. ఈతడు నలందాపట్టణవాసియగు తిష్యతనయుడు. ఈతనితల్లిపేరు సారిక. ఈమెనుబట్టియే యితనికి సారిపుత్రుడను నామధేయముగల్గెను. ఈతనికి "ఉపతిష్య (తిష్యతనయుడుగాన) యనునామాంతరముగూడ గలదు. ఇతడు పెక్కుశాస్త్రముల రచించెనని బౌద్ధగ్రంథములయందు జెప్పబడియున్నది. అభిధర్మపీఠికను లిఖించిన దితడేయని యొకప్రతీతికలదు. బుద్ధుని నిర్వాణమునకు పూర్వమే యాతడు మృతినొందెను. మగల బుద్ధుడై భూలోకమున నవతరించునని బౌద్ధమతస్థుల విశ్వాసము.

* మహామౌద్గల్యాయనుడు. సింహళభాషలో నీతనికి "ముగలాను"దని పేరు. ఈతడును బుద్ధుని ప్రధానశిష్యగణములోనివాడే. శాక్యసింహుని "వామభుజ"మని ప్రఖ్యాతినొందెను, అమానుషశక్తులుగలవాడు, దీర్ఘదర్శి. శాక్యసింహుని విగ్రహమును భూవలయమున జిత్రింపజేయుటకై యాతడొక శిల్పకారుని దనవెంట తుషితస్వర్గమునకు గొంపోయి యా లోకకల్యాణుని దివ్యరూపము నాతనికి జూపెను. యమలోకమునకుబోయి తన తల్లిని నరకబాధలనుండి తప్పించెను. ఈతడును శాక్యసింహునికి మున్నె నిర్వాణమునొందెను. బుద్ధుడై యాతడు భూవలయమున నవతరించును.

+ ఈతనివృత్తాంతము తొమ్మిదవప్రకరణమున వర్ణింపబడినది.

¶ పీఠికాత్రయములోని యుపాంగములు. ఈ మూటికిని పీఠికాత్రయమని పేరు.

ఈ రాజ్యమున నివసించు గృహస్థులు ప్రతివత్సరమును వర్షకాలము గతించిన వెనుక నిచ్చటి శ్రమణకులకు గానుక లర్పింతురు. భిక్షువులకనువగు ద్రవ్యాహారముల సమకూర్చి వారి కంపెదరు. ఇచ్చటి శ్రమణకులును యీతరుణమున మహాసభల గావించి ప్రజలకు బౌద్ధమతధర్మముల నుపదేశింతురు.

ఈ ప్రాంతమందలి సన్యాసులు సారిపుత్రస్తూపమును బూజింతురు. ప్రతివత్సరమును నీ స్తూపమునకు మహోత్సవములు సల్పెదరు. కుసుమదామములతోడను, ధూపములతోడను, దాని నారాధింతురు. ఉత్సవకాలమున నీస్తూపపరిసరములన్నియు దీపావళులచే నలంకరింపబడి గనులపండువు సేయుచుండును. ఒకవంక, గాయకులు మృదుమధుర కంఠధ్వనులతో గానమొనర్చుచుందురు. వేరొకప్రక్క మంగళవాద్యములు చెలగుచుండును.

తొలుత సారిపుత్రు డుత్తమవంశసంభూతుడగు బ్రాహ్మణుడు. ఈతడొకనాడు శాక్యసింహునికడ కేగి, సన్యాసమును స్వీకరింప ననుజ్ఞవేడెను. మహామౌద్గల్యాయన మహాకాశ్యపులును* నిట్లే బుద్ధునిచే ననుజ్ఞాతులై సన్యాసదీక్ష గైకొనిరి.

* మహాకాశ్యపుడు మగధరాజ్య నివాసియగు నొక బ్రాహ్మణుడు. శాక్యసింహుడే యీతనికి బౌద్ధమతదీక్ష నొసంగి తవశిష్యగణములో నొక్కనిగ బరిగణించెను. గౌతముడు నిర్వాణమునొందిన పిమ్మట నీతడే ప్రధానబౌద్ధమతాచార్యుడై బౌద్ధమతవ్యాప్తికై చాలకృషి సల్పెను. బౌద్ధమత మహాసభా సంస్థాపకు డీతడే. అందులకే యీతనికి "ఆర్యస్థవీర" యను బిరుదనామము గల్గెను. మున్ముగ బౌద్ధమతసిద్ధాంతముల లిఖియింప మొదలుపెట్టిన దీతడేయని ప్రఖ్యాతినొందెను. ఈతడును భూవలయమున బుద్ధుడై యవతరించును.



ఇచ్చటనుండు భిక్షుణులానందుని స్తూపమునకు బూజలొనర్తురు. స్త్రీలకును సన్యాసవృత్తి జేపట్టుటకనుజ్ఞ యొసగుమని యీతడే బుద్ధుని బ్రార్థించియుంటచే యీతనిపై బౌద్ధసన్యాసినుల కమితమగు భక్తి. ఆకారణముననే వీరలాతని నారాధింతురు. శ్రామణేరులు♦ రాహుల¶స్తూపమును బూజింతురు. అభిధర్మపీఠికాపండితు "లభిధర్మస్తూపమునకు"ను వినయపీఠికాపండితులు "వినయస్తూపము"నకును ఆరాధనల సల్పుదురు.

♦ శ్రామణేరులు - నూతనముగ సన్యాసమును స్వీకరించినవారు. వీరు దశవిధనియమములను బాటింతుమని దీక్షగైకొందురు. ఫాహియాను బాల్యమున నిట్టిదీక్ష గైకొనినవాడే. మున్నుగా త్రిశరణమును గైకొని (బుద్ధుడు, బౌద్ధధర్మములు, బౌద్ధాలయములు, వీనికి త్రిశరణములనిపేరు.) పిమ్మట దశవిధులను బాటింతుమని ప్రమాణముల జేయుదురు. (1) ప్రాణిహింస (2) చౌర్యము. (3) అశుచి. (అపవిత్రత), (4) అనృతము. (5) మద్యపానము. (6) అపరాహ్ణానంతర భోజనము. (7) నృత్య, గాన, వినోదములు, నాట్య కళాప్రదర్శనములు. (8) పుష్పమాలికా, సుగంధజల, భూషణాలంకారములు, (9) మృదుతల్పములు. (10) సువర్ణ రజితములు, - వీనిని వర్జించుటయే దశవిధనియమము లనబడును.

¶ రాహులుడు - శాక్యసింహుని జ్యేష్ఠపుత్రుడు. బౌద్ధమతమును స్వీకరించి, జనకునికి చేదోడై, యాతనితోడ నార్యావర్తమంతయు గ్రుమ్మరెను. గౌతముని మరణానంతర మీతడు "వైభాషిక"మను నూతన సిద్ధాంతమును ప్రతిష్ఠించెను. నూతనముగ సన్యాసస్వీకారమొనర్చువారల కితడధిష్ఠానదేవత. మున్ముందు బుద్ధుడు భూలోకమున నవతరించునపుడెల్ల యీత డాతని జ్యేష్ఠపుత్రుడై యుద్భవించుచుండును.

ఇచ్చటి మహాయానులు ప్రజ్ఞాపారమిత + మంజుశ్రీ § యవలోకితేశ్వరుల * సేవింతురు.

---

+ ప్రజ్ఞాపారమిత:—అష్టపారమితలలో నొకటి. పారమిత యనిన మోక్షసాధనమని యర్థము. బౌద్ధమత గ్రంథములందట్టి నిర్వాణమార్గము లెనిమిది సూచింపబడెను, దానము, పవిత్రజీవనము, శాంతము, శక్తి, ధ్యానము, జ్ఞానము (ప్రజ్ఞ) అనునవి. వీనికే అష్టపరిమితలని పేరు. వీనిలో జ్ఞానమే యన్నిటిలోన ప్రధానమైనది. ఇయ్యదియే నరులను సంసారజలధిని దాటించి నిర్వాణతీరమును జేర్పగలదు.

§ మంజుశ్రీ ప్రసిద్ధుడగు నొక బోధసత్త్వుడు. చైనాసామ్రాజ్యములోని 'షాన్సీ' పట్టణవాసు లిప్పటికిని వీని నారాధింతురు. భారతఖండమందలి మహాయానులును వీనినే పూజించెడివారు. బౌద్ధగ్రంథములయం దీతడు "జ్ఞానస్వరూపు"డని వర్ణింపబడియున్నాడు. ఈతనికి "మహామతి" యనియు 'కుమారరా'జనియు బిరుదనామములు గలవు. బౌద్ధధర్మముల బోధించుటయం దీత డసమాన ప్రజ్ఞాధురీణుడని ఖ్యాతినొందుటచే నీతనికి "కుమారరాజని" బిరుదనామము కల్గెను. ఈతడు "సహస్రబాహు"డనియు "శతకక్షపాలధారి" యనియు వర్ణింపబడియున్నాడు.

* అవలోకితేశ్వరుడు ప్రఖ్యాతబోధిసత్త్వులలో నొకడు. చైనాదేశమున నీతనికి "క్వాన్షీ"నని పేరు. "అవలోకితేశ్వర" యనునది సంస్కృతనామము. కంఠధ్వనుల నవలోకింపగలవాడని (మానవాళి ప్రార్థనల నాలింపగలవాడు) యీపదమున కర్థము. త్రివిష్టప భారతవర్షములం దీతని పురుషునిగను, చీనా, జపాను రాజ్యములందు స్త్రీదేవతగను భావింతురు. చైనాదేశమున నీమె, "సహస్రబాహి" యనియు "సహస్రాక్షి" యనియు వర్ణింపబడినది. చీనాసముద్రతీరమునకు సామీప్యముననున్న "పూటూ" యనుద్వీపమున నీమె ప్రధాన పీఠముగలదు. ఇయ్యది, నేటికిని బౌద్ధయాత్రికులకు మహాపుణ్యక్షేత్రము. శతసహస్రసంఖ్యాకు లనుదినమును యీదేవిని దర్శించిపోవుచుందురు. ఈ భేద మెట్లు గల్గెనో, పురుషుడగు నవలోకితేశ్వరుండు దేవి యెట్లయ్యెనో తెలియరాకున్నది.



పూజామహోత్సవములు ముగిసినంతనే, యీప్రాంతమున నివసించు బ్రాహ్మణులును, వైశ్యులును శ్రమణకులకు వార్షికముగ జెల్లింపవలసిన సస్యభాగము జెల్లించి యింకను వారి కుపయుక్తములగు సంబారవస్త్రాదుల వారికి గానుకగ నొసంగెదరు.

మనపాంథులు సింధునదీప్రవాహమును దాటినచోట నుండి దక్షిణసముద్రతీరమువరకును వ్యాపించియుండు భూభాగమంతయు నొకవిస్తీర్ణమగు మహామైదానము. నలుబదియేబది వేలలీల పొడవు నుండును. ఇచ్చట మహోన్నతములగు పర్వతము లెవ్వియు గానరావు. పర్వతాగ్రములనుండియు వేగమున బారు మహానదీప్రవాహములును గాన్పింపవు. మందగమన మొనర్చుచు బోవు క్షుద్రప్రవాహినులు మాత్రము గలవు.

---

# పదునేడవ ప్రకరణము

## బుద్ధుని స్వర్గారోహణ వృత్తాంతము.

ఇచ్చటనుండి (మథుర) బయలుదేరి మన తెరువరులు తిన్నగా సంకాశ్య * యను రాజ్యమునకు బోయిరి. ఇయ్యది మథురారాజ్యమున కాగ్నేయభాగమున బదునెనిమిది యోజనముల దూరమున నున్నది. బుద్ధుడు త్రయస్త్రింశ

---

* దీనికే కపిత్థరాజ్యమని కూడ బేరుగలదు. కనూజి పట్టణమునకు వాయవ్యభాగమున 'సమకాశ' యను పేరుగల్గిన గ్రామ మిప్పటికిని గలదు.

త్స్వర్గము ♦ నుండి భూతలమునకు దిగినచోటిచ్చటనే గలదు. శాక్యసింహుడు మన్నొకమారు త్రయస్త్రింశత్స్వర్గమునకు బోయి యచ్చట మూడు నెలలుండి తన తల్లియగు మాయాదేవికి బౌద్ధధర్మముల నుపదేశించి పిమ్మట భూమండలమునకు దిరిగివచ్చెను. బుద్ధుడు తన యనుచరులెవ్వరికిని దెల్పకయె సూక్ష్మదేహమును దాల్చి, తన దైవత శక్తిచే స్వర్గలోకము నవరోహించెను. మాసత్రయ గడువుకాలమింక (బుద్ధుడు స్వర్గమునను ండుట కేర్పరచుకొనిన గడువు) నేడుదినములలో జెల్లిపోవుననగా, గౌతముడు తన సూక్ష్మరూపమును విడనాడెను. అనిరుద్ధు * డంతట తన దివ్యచక్షువుల సాయమున త్రయస్త్రింశత్స్వర్గమున నున్న శాక్యసింహుని గాంచి, యాతురముతో మౌద్గల్యాయనుని బిలిచి "బుద్ధుడిప్పుడు త్రయస్త్రింశత్స్వర్గమున గలడు. సత్వరమునబోయి యాలోకకళ్యాణుని పాదముల కెరగిరమ్మని ప్రోత్సహించెను. మౌద్గ-

♦ ఇంద్రస్వర్గము. త్రయస్త్రింశత్స్వర్గ మన ముప్పదిమూడు అంతర్భాగములు గల్గిన స్వర్గమని యర్థము. ఇచ్చట వర్ణింపబడిన స్వర్గము హైందవపురాణగాధలలో వర్ణింపబడిన స్వర్గమును సర్వవిధముల బోలి యున్నది. ఇయ్యది మేరుపర్వత చతుశ్శిఖర మధ్యభాగమున ముప్పదిమూడు మహానగరములతో విరాజిల్లుచుండునని వర్ణింపబడినది.

* శాక్యసింహుని పినతండ్రియగు అమృతోదనుని తనయుడు. ఈతనికి దివ్యచక్షువులుగలవు (అణిమాది అష్టసిద్ధులలో నొక్కటి.). ఇతడు తన దివ్యనయనముల విప్పి ముల్లోకములలో జీవరాసుల నొక్కసారి తిలకింప గలడు.



ల్యాయనుడును నాలసింపక తత్క్షణమే స్వర్గమునకేగి బుద్ధుని చరణములపై వ్రాలి నమస్కరించెను. బుద్ధుడాతని లేవనెత్తి సముచితరీతిని గౌరవించి కుశలప్రశ్నలడిగెను. వారిరువురును గొంతతడవు ముచ్చటించిన పిదప శాక్యసింహుడుమౌద్గల్యుని జూచి "మౌద్గల్యాయనా! నేనింక నేడు దినములలో నిచ్చోటు వాసి, జంబూద్వీపమునకు బోవుచుంటిని. నీవింక భూతలమునకు బొమ్ము" అని పల్కి యాతనికి సెలవొసంగి యాతని బంపివైచెను.

మూడు నెలలకాలమునుండి శాక్యసింహు డిచ్చటను గానరాకుంటచే, తల్లడిల్లి యాప్రాంతమున రాజ్యపాలన మొనర్చు పృథ్వీపతు లెనమండ్రు తమయమాత్యగణ ప్రజానీకములతో రాజ్యముల త్యజించి, యాతని వెదకుచు దేశదేశమును దిరుగజొచ్చిరి. ఈ మహీపాలు రీతీరుస వికలచిత్తులై గగనతలము నావరించు మేఘజాలముల రీతి బ్రిబలి తండోపతండములై తమ వెంటనరుదెంచెడు మహాజనసంఘములతో, దేశములెల్ల దిరిగి తిరిగి యెట్టకేలకీ కపిత్థరాజ్యమును జేరి యాతని రాకకై నిరీక్షించుచు, నచ్చట పడగాపుల బడియుండిరి.

ఈ తరుణమున నిచ్చట జేరియున్న మహాజనసంతతులలో 'నుత్పల' యను భిక్షుని యొక్కతె గలదు. ఈమెయు, బుద్ధునిగానక పరితపించుచు, నేకాకియై పలుదేశముల దిరిగి తుదకీ కపిత్థదేశమును జేరికొనెను. కాని యాజనప్రవాహమును జూచి యామెగుండె లవిసిపోయెను. దిగులువడుచు

నా సన్న్యాసిని తనలోదానిట్లు విలపింపసాగెను. "ఈ మహా సందడిలో నా కామహామహుని దర్శనభాగ్య మబ్బుట దుర్లభము. నేడీనృపాలకశ్రేణి అసంఖ్యాకులగు జనసంతతు లతో నా మహామహుని దర్శింప వేచియున్నారు. నేనొక్క యబలను; పరివారశూన్యను; అసహాయురాలను. వీరందరి కంటె మున్నుగా నా లోకకల్యాణుని జూచుభాగ్యము నాకెట్లు లభింపగలదు? అసంభవము! అసంభవము!" అదృష్టవశమున విచారపూరితములగు నీమె తుదివాక్యములు, ఆర్తశరణ్యు డగు బుద్ధుని శ్రోత్రపుటములబడెను. అతనిహృదయమున నామెపై ననివార్యమగుప్రేమ ముదయించెను. తృటికాల మున నామెకు నిఖిలభూవలయమునకు సామ్రాజ్యాధిపత్య మును వహింపగల యొకసార్వభౌముని దివ్యరూపమును ప్రసాదించెను. ఇట్లాతనికృపావిశేషమున నాభిక్షుని పృథ్వీపతు లందరికంటె మున్నుగా నాతనికి బ్రణమిల్లి ధన్యురాలయ్యెను.

శాక్యసింహుడు, త్రయస్త్రింశత్స్వర్గమునుడి భూవ లయమునకు దిగివచ్చుతరుణమున మింటినుండి భూతల మునకు మణివిరాజితములగు మూడుసోపానపంక్తు లమర్ప బడెను. బుద్ధుడు మధ్యసోపానములపై నుండెను. ఈసోపాన ములు సప్తమణిస్థగితములై వెలుగుల గ్రక్కుచు గన్నుల మిరుమిట్లు గొల్పుచుండెను. వీనికి దక్షిణపార్శ్వమున రజత నిర్మితములగు మెట్లుగలవు. వీనిపై నడచివచ్చుచు, బ్రహ్మ లోకాధీశ్వరుడగు ప్రజాపతి బుద్ధునకు చామరము విసరుచుండెను. మణిసోపానములకు వామభాగమున స్వర్ణ



సోపానములు నిర్మింపబడెను. వీనిపై నిలిచి, సురపతి శాక్య సింహునకు ఛత్రము పట్టుచుండెను. అసంఖ్యాకులగు నిర్జరులు బుద్ధునికి కైవారములు సల్పుచు నాతని ననుగమింపజొచ్చిరి. ఇట్లు శాక్యసింహు డమరలోకమునుండి మహావైభవముతో భూవలయమునకు దిగెను. బుద్ధుడు భూమండలమును సమీ పించి, సోపానములు వీడి భూమిపై నడుగువెట్టిన తోడనే సోపానపంక్తులు భూమిలో క్రుంగి యదృశ్యమయ్యెను. ఏడు సోపానపీఠములు మాత్రము భూమిపై నిలిచిపోయెను.

ఈసంభవము జరిగిన పెక్కువర్షములకు అశోక సార్వభౌముడు రాజ్యాభిషిక్తుడయ్యెను. ఈ పృథ్వీశుని కొక్కనా డాసోపానముల యధోభాగమున భూగర్భమున నెచ్చటయానో పరిశీలింపవలయునని బుద్ధిపొడమెను. తన సేవకులబిలిచి, యాసోపానముల యడుగుకొన గన్పిం చువరకును ద్రవ్వుడని యాజ్ఞాపించెను. సార్వభౌముని సేవకాగ ణము తేనియాజ్ఞానుసారము పాతాళము గన్పించువరకుద్రవ్వి చూచిరి. కార్యము లేకపోయెను. ఎంతలోతు త్రవ్వినను, సోపానములతుది గాన్పింపదయ్యెను. రాజసేవకులు హతాశు లైరి. అశోకచక్రవర్తి విభ్రాంతుడై చిన్నవోయెను. అప్పటి నుండియు నాపృథ్వీశుని బౌద్ధమతానురాగము మరింత గాఢ మయ్యెను. ఆతడీసోపానపంక్తులు పుడమిలో గూరుకొని పోయిన ప్రదేశమున సుందరమగు విహారమును నిర్మించి యందు మధ్యసోపానముల కుపరిభాగమున బదునారడుగుల నిడివిగల యొక బుద్ధవిగ్రహమును జెక్కించెను. విహారమునకు

వెనుకవైపున నేబది మూరల యున్నతి గల్గి శిల్పచిత్రములతో నలరారు శిలాస్తంభము * ను గట్టించెను. ఈకంబమునకు శిరోభాగమున సింహవిగ్రహ మొకటి చిత్రింపబడియున్నది.

ఈ స్తంభము గుండ్రముగానుండక పలకలుదీరియున్నది. దీనికి నాలుగువైపులను నాల్గు ప్రతిమాస్థానములు గలవు. నాల్గిటియందును నాలుగు బుద్ధమూర్తులు చిత్రితములై యున్నవి. ఈప్రతిమలు మరకతమణులవలె నిర్మలములై నిగనిగ ద్యుతుల నీనుచున్నవి. ఈయశోకస్తంభమునుగూర్చి యొకచిన్న చిత్రగాథ కలదు. ఒకప్డు డీపానవిహారములుండు ప్రదేశ మెవ్వరి యావాసభూమియని శ్రమణకులకును, బౌద్ధమతాంతరులకును వివాద సంఘటిల్లెను. వాదప్రతివాదసంరంభమున శ్రమణకులకే పరాజయము గల్గెను. అంతట నిరుకక్షులును శాంతించి, సంధి కియ్యకొనిరి. ఆప్రాంతము నిక్కవముగ శ్రమణకుల నివాసస్థానమే యగునెడల నయ్యది యొక్క యద్భుతస్తంభము వలన ప్రదర్శితము గావలయుననియును, అట్లు సిర్ధారణమగు నెడల మతాంతరులు పోరుచాలించి తామాస్థానమును వీడిపో

* కన్నింగుహాము చరిత్రకారుడు దానిప్రదేశమును, 1862 వ సంవత్సర ప్రాంతమున దర్శించితిననియు, అచ్చట నాకొక శిలాస్తంభమును గాంచితిననియు దానియగ్రభాగమున, నతిమనోహరముగ జిత్రింపబడి శిల్పకళాచాతుర్యముల బ్రదర్శించు నొక గజవిగ్రహము గలదనియు, ఆ విగ్రహము యొక్క కరపుచ్ఛములిప్పుడు శిథిలమై కాలవాహినిలో గలిసి పోయినవనియు, నిదియే ఫాహియాను గాంచిన స్తంభమై యుండుననియు, బొరపాటున నాతడీ గజవిగ్రహమును జూచి సింహవిగ్రహ మనుకొని యుండుననియు వ్రాసియున్నాడు.



యొదమనియును బల్కిరి. తోడనే స్తంభాగ్రమున నధివసించి యున్న రాతిసింగము దిక్కులుమారు మ్రోగునట్లు ఒక్కపెట్టున గర్జించెను. చూపరు లాభీషణనినాదమును విని దద్దరిల్లిపడిరి. మతాంతరులు భీతావహులై యచేతనప్రతిమనుండి యట్టి మహాశబ్దములు వెలువడుట కెంతయు నచ్చెరువందుచు, యాపిం తతీర్పునకు కరములు మోడ్చి వెడలిపోయిరి.

బుద్ధుడు మూడు నెల లింద్రలోకమున నివసించి స్వర్గ భక్ష్యముల జవిగొనుటచే నాతనిశరీర మాపాదమస్తకమును ఘనసౌరభముల గుప్పుమ్మరింపదొడగెను. అందువలన నాతడు భూవలయమున నడుగిడినతోడనే సత్వరమునబోయి స్నానమాచరించెను. పిమ్మట నిచ్చోట (బుద్ధుడు స్నానమొనర్చిన చోట) నొక స్నానగృహము నిర్మింపబడెను. ఇయ్యది నేటికిని గాననగును. ఉత్పల శాక్యసింహునకు బ్రణమిల్లినతావున గూడ నొకస్తూపము గట్టబడెను.

బుద్ధుడు కేశఖండన మొనరించుకొనిన ప్రదేశమందును గౌతమునకు బూర్వ మవతరించిన బుద్ధత్రయమును ♦ శాక్య

♦ మహాభద్రకల్పమున నుద్భవిల్లినవారు. ఈకల్పముననె గౌతమ బుద్ధుడుగూడ నవతరించెను. ఈతడు నాల్గవవాడు. భావికాలమున నవతరింపనున్న మైత్రేయు డయిదవవాడగును. బుద్ధత్రయమున "క్రకుచంద్రుడు" మొదటివాడు. ఈతడు కాశ్యపవంశమున బుట్టినవాడు. ఈతనికాలమున మానవుల జీవితపరిమాణము నలువది వేల వత్సరములు. అసంఖ్యాకులగు మానవులకీతడు బౌద్ధదీక్ష నొసంగును. ఈతనితరువాత నుద్భవించిన వాడు "కనకముని." ఈతడు బుద్ధత్రయమున ద్వితీయుడు. ఈతని దేహకాంతి, సువర్ణచ్ఛాయను మరపించుచుండుటచే నీతని కీనామధేయము

సింహుడును గూర్చుండి భాషించిన తావులందును, నడచి పవిత్రమొనర్చిన చోటులందును పురపతియు, కమలాసనుడును బుద్ధునికి ఛత్రచామరముల బట్టుచు మింటినుండి భూవలయమునకు దిగిన పుణ్యస్థలమునందును స్తూపములు నిర్మింపబడినవి.

ఈ రాజ్యమున నివసించు శ్రమణకులసంఖ్య రమారమి యొక్క సహస్రముండును. వీరిలో నుభయశాఖలవారును గలరు. బౌద్ధసన్యాసులకు భోజనాదు లొసంగుటకై యిచ్చోట ధర్మశాల లనేకములు గలవు. ఇచ్చటనే శ్వేతకర్ణియను భూతసర్ప మొకటిగలదు. ఈయురగమిచ్చటి సన్యాసుల కెట్టిహానియు దొరలకుండ వారిని గంటికి రెప్పవలె గాపాడుచుండును. ఇంతియకాక యీరాజ్యమున గొరంతి వాటిల్లకుండ సకాలమున కుంభవృష్టి గురిపించుచు సస్యాదుల బుష్కలముగ ఫలింపజేయుచు నిచ్చటి ప్రజలకెంతెయు శుభము గూర్చుచుండును. దీని కారుణ్యభావమునకు మిగుల సంతసింపుచు, నీరాజ్యమున నివసించు శ్రమణకు లీసర్పరాజమునకొక విహారమును నిర్మించి, యది శయనించుటకుం దొక రత్నకంబళమును బఱచిరి. దీని కనుదినమును దమచే మంత్రపూతమగు నాహారమును బంపుచుందురు. మువ్వురు శ్రమణకులు దానితో గలిసి

గల్గినది. ఈతనికాలమున నరుల యాయుష్కాలపరిమితి ముప్పది వేలేండ్లు. వీనితరువాత కాశ్యపు డవతరించెను. ఈతనికాలమున మానవుల జీవితపరిమాణ మిరువదివేల హాయనములు.



భుజించుటకై ప్రతిదినమును దాని యావాసమునకు బోవుచుందురు. వర్షకాలము గడచినంతనే యాఫణిశ్రేష్ఠము తనమేను గృశింపజేసి సూక్ష్మరూపమును దాల్చును. అదిగనిపెట్టి యిచ్చటి భిక్షువు లాపామును మీగడతో నింపిన యొకతామ్ర కలశమున నుంచెదరు. పిమ్మట శ్రమణకులందరును బారులు దీర్చి యొక్క ప్రదేశమున గూర్చుండెదరు. అంతట నా రాగిపాత్రమును, ప్రతి శ్రమణకుని పీఠమునొద్దకును గొనిపోవుచు నాశ్రేణులన్నియు ద్రిప్పెదరు. దానిపై నధివసించియున్న శ్రమణకునకు జోహారు లొనర్చుచున్నదో యనునట్లా యురగము భిక్షువుని యాసనమును సమీపించినపుడెల్ల దనశిరము నెత్తుచు వంచుచుండును. ఇట్లా భుజంగము శ్రమణకుల పీఠములన్నియు జుట్టివచ్చినతోడనే, యదృశ్యమైపోవును. ఇట్లే ప్రతివత్సరమును నీభూతము సర్పరూపమును దాల్చి సన్యాసుల దర్శించి పోవుచుండును.

ఈ రాజ్యము మిగుల సస్యవంతమైనది. ఇందలి ప్రజ లఖండసౌఖ్యముల నోలలాడుచు నెట్టికొఱంతయు లేక, ధనధాన్యములతో నెల్లెడల దులదూగుచుందురు. అన్యప్రాంతములనుండి పాంథు లెవ్వరేని తమగ్రామముల కేతెంచినచో వారిని బలుతెరంగుల నాదరించి యతిథిసేవ లొనర్తురు.

ఉరగవిహారమునకు బశ్చిమోత్తరముగ నేబది యోజనముల దూరమున, 'అనిలభూమి' యను నామమునబరగు సంఘారామ మొక్కటిగలదు. ఈమఠమునకు దాపుననే పూర్వము 'పెద్దరాసి' యను భూతమొక్కటి దిరుగుచుండెడిది.

ఇయ్యది శ్వేతకర్ణివలె లోకోపకారి కాదు. కుటిలపిశాచము. కరుణాసాంద్రుడగు బుద్ధుడు దీని పిశాచిరూపమును దొలగించి మానవస్వరూపము నొసంగెను. ఈప్రదేశమున నొక విహారము నిర్మింపబడియున్నది. ఈరాజ్యమేలు నృపాలు డీవిహారభూమినంతయు నొక యర్హంతునకు దానమొసంగుచుండ నాతని హస్తమునవిడిచిన సలిలబిందువులు కొన్ని భూమిపై పడెను. ఆబిందువు లీప్రదేశమున నేటికిని గాన్పించుచుండును. ఎంతటితీక్ష్ణమగు నెండగాచినను, భగ్గున మండుకొనిపోవు వేసవియైనను నీ నీటిబిందువు లింకిపోవు. పనిగొని హస్తములతో బలుమారులు తుడిచినను నంతరింపవు. ఇచ్చటనే బుద్ధునిస్తూపమొకటి గలదు. ఈస్తూపముకడ నహోరాత్రములు కావలిగాయుచు, నాప్రదేశమంతయు దుడిచి యుదకముజల్లుచు నొకపిశాచి యీప్రాంతమున సంచరించుచుండును. విమతస్థుడగునృపాలుడొక్క డసూయాప్రేరితుడై యాపిశాచమునుజూచి "పిశాచమా! నా సర్వసైన్యములతోడ నిచ్చోటకు గదలివచ్చి, యీప్రదేశమున శిబిరముల నిర్మించుకొని యిత్తావంతయు గల్మషభూయిష్ఠ మొనర్చెదను. అప్పుడీ ప్రదేశమంతయు నెట్లు సమ్మార్జించి, పరిశుభ్ర మొనర్తువో జూచెదగాక" యనిపల్కి నత్వరమున దనసైనిక వాహినుల రప్పించి బిలబిలలాడుచు నచ్చోటనే విడిసెను. అంతట నాపిశాచి ప్రళయభీకరమగు సుడిగాలుల నాప్రదేశమున వీవబంచెను. చిటికలో నా మహావాయువు లాకల్మషము



నంతయు దుడిచివైచి యాప్రాంతమును నెప్పటియట్ల పవిత్రవంతముగనొనర్చెను.

ఈప్రదేశమున నక్కడక్కడ చెదరి నూరు చిన్న స్తూపములు గలవు. రవి గ్రుంకువరకు లెక్కించినను వీని సంఖ్య గనుగొనజాలము. వీనిసంఖ్య నరయదలంచితిమేని, ప్రతిస్తూపమునొద్దను నొక్కొక మనుజుని నిలువబెట్టి పిమ్మట నామనుజుల లెక్కగొనవలయును.

ఇచ్చటనే యొక బౌద్ధమఠముగూడ గలదు. ఆరేడు వందల సన్యాసు లిందు నివసించుచుండిరి. మున్నొకమారు నిదానబుద్ధు డొక్క డాహారమును భుజించిన తావిచ్చటనే కలదు. ఈమఠముననే యాశ్రమణకుడు నిర్యాణము నొందెను. దీని కనతిదూరమున నాతని మృతదేహమున కగ్ని సంస్కారము గావించినచోటు గలదు. ఇయ్యది వలయాకారముగ బండిచక్రమంత పరిమాణమున నుండును. ఈ ప్రదేశముచుట్టును గసవు పుష్కలముగ బెరుగుచున్నను దీని లోపలిభాగమునమాత్ర మొక్క గడ్డిపోచయైనను మొలకలెత్తుటలేదు. అంతయు వంధ్యబారియున్నది. ఈ శ్రమణకుడు తన కాషాయాంబరముల నారగట్టుకొనిన తావును నిట్లే తరులతాశూన్యమై యున్నది. ఆతని యుడుపులబరచిన యానవాళ్ళింకను నిచ్చట గాన్పించుచున్నవి.

# పదునెనిమిదవ ప్రకరణము

## కన్యాకుబ్జ నగరము.

మన పాంథులు వర్షకాలమంతయు ఉరగవిహారముననే గడపిరి. పిమ్మట నచ్చటనుండి బయలుదేరి యాగ్నేయదిశగా నేడుయోజనములదూర మరిగి, గంగానదీతీరముననున్న కన్యాకుబ్జనగరము*ను దర్శించిరి. ఈ పట్టణమున గొప్ప బౌద్ధమఠములు రెండుగలవు. ఇందు నివసించు సన్న్యాసు లెల్లరును హీనయానులు.

ఈ నగరమునకు పశ్చిమభాగమున నారేడులీలల దూరమున, గంగానది యుత్తరపుటొడ్డున శాక్యసింహుడు తన శిష్యగణమునకు బౌద్ధధర్మముల నుపదేశించిన పవిత్రవాటిక గలదు. "మానవుల సుఖదుఃఖము లస్థిరములు. కాయము బుద్బుదప్రాయము" మున్నగు వేదాంతరహస్యముల, బుద్ధుడీతరుణమున దన శిష్యకోటులకు జెప్పెనని యీ ప్రాంతవాసు లిప్పటికిని వింతగ జెప్పుకొనుచుందురు. ఈ ప్రదేశమునగూడ నొక స్తూపము గట్టబడెను. అయ్యది నేటికిని నిల్చియున్నది.

కన్యాకుబ్జనగరమునం గలవిశేషముల నారసి మన పాంథు లచ్చటనుండి దక్షిణముగా మరలి గంగాతరంగిణి దాటి యచ్చటి కనతిదూరముననున్న 'అలి' ♦యను గ్రామ

* కుబ్జకన్నియల నగరము. బ్రహ్మదత్తుని నూర్వురు పుత్రికలును, "మహావృక్షు"డను తాపసుని వివాహమాడక తిరస్కరించుటచే నాతడు కోపించి "మీరలందరును కుబ్జశరీరలగుదురుగాక" యని శపించెను. అందువలననే యీ నగరమునకు కన్యాకుబ్జనగరమని నామధేయము గల్గెను.

♦ ఈ గ్రామ మెచ్చటనుండెనో తెలియవచ్చుట లేదు.



మును జేరిరి. ఈగ్రామసమీపముననే బుద్ధుడు తపోనిష్ఠల గడపిన తావులును, అసంఖ్యాకులగు జనసంతతులకు బౌద్ధధర్మముల నెరింగించిన స్థలములును గలవు. ఈపావనక్షేత్రము లన్నిటియందును స్తూపములు గట్టబడియున్నవి.

---

# పందొమ్మిదవ ప్రకరణము

## అయోధ్య.

ఈగ్రామము వీడి యాగ్నేయదిశగా బదియోజనముల దూర మరిగినచో విశాఖ (అయోధ్య) యను రాజ్య మొకటి గానవచ్చును. ఇది బహు పురాతనమగు రాజ్యము. సాకేతు దానికి రాజధానీపట్టణము. ఈనగరి దక్షిణద్వారమున కనతి దూరమున రాజబాటకు ప్రాగ్దిశగా, బుద్ధుఁడు దంతధావన మొనర్చుకొనినచోటు గలదు. గౌతము డచ్చటనే యొక వటవృక్షశాఖతో బలుదోమి యటుపిమ్మట నా దంతకాష్ఠమును దనచెంత భూమిలో గ్రుచ్చెను. వెంటనే యా నిర్జీవకాష్ఠము సజీవిమై త్రుటికాలమున బర్ణములుదొడిగి, ఏడడుగుల యెత్తునకు బెరిగి చిన్న వృక్షమయ్యెను. విమతస్థులగు బ్రాహ్మణు లాయద్భుతమునుగాంచి యసూయాపరులై యా లేతపాదపమును నిర్మూలింప బహుళప్రయత్నము లొనర్చిరి. ఒకమారు దానిని మొదలంట దెగనఱికిరి. మరియొకసారి సమూలముగ బెకలించి దూరమున బారవైచిరి. కాని

యా బాలతరువు చావదయ్యెను. మరలమరల నదియచ్చోటనే యుద్భవిల్లుచు పల్లవింపదొడగెను. బ్రాహ్మణులు హతాశులై వెడలిపోయిరి.

ఈ తరుసమీపముననే బుద్ధచతుష్టయము కూర్చుండి భాషించిన తావులును, నడచి యానందించిన చోట్లును గలవు. ఆ స్థానములన్నిటియందును విహారములు నిర్మింపబడియున్నవి.

---

# ఇరువదియవ ప్రకరణము

## కోసలరాజ్యము—జేతవనవిహారము.

సాకేతనగరమునుండి మన పాంథులు దక్షిణముగా మరలి యచ్చటి కెనిమిదియోజనముల దూరముననున్న శ్రావస్తి పట్టణమును జూడబోయిరి. శ్రావస్తి♦ కోసల* రాజ్యమునకు రాజధాని. అతి ప్రాచీనమయిన నగరము. ప్రసేనజిత్తుడు+ రాజ్య మేలినచోటు. ఈ పట్టణ మిప్పుడు మిగుల శిథిలావస్థజెందియున్నది. పూర్వవైభవము లంత

♦ అయోధ్యానగరమున కరువది మైళ్ళదూరమున 'రపతీ'నదియొడ్డున నున్నది. ఈపట్టణశిథిలములు నేటికిని గానవగును. శాక్యసింహునకు జ్ఞానోదయమైనపిమ్మట నాతడు పెక్కువత్సరము లిచ్చటనే గడపెను.

* నవీన అయోధ్యాఖండములో నొకభాగము.

+ బౌద్ధమతమును బోషించిన నృపోత్తములలో నొక్కడు. ఈతడు కోసలరాజ్యమును బాలించెను.



రించినవి. పూర్వమువలె బహుళజనసంఖ్యాకులచే గలకలలాడుచుండుట లేదు. జనశూన్యమై వెలవెలబోవుచున్నది. నేడీపట్టణమున, నిన్నూరు కుటుంబములకంటె నెక్కువ గాన్పింపవు. మహాప్రజాపతి*చే నిర్మింపబడిన, ప్రాచీన శిలాస్తూప మిందే గలదు. సుదత్తుని♦ గృహశిథిలములును నిచ్చోటనే గానవగును. ఆతని దివ్యభవనమంతయు నిప్పుడు కాలవాహినిలో గలిసిపోయెను. ప్రాకారకుడ్యములును బాడునూయియు మాత్రము నేటికిని నిల్చియున్నవి. అంగుళమాల్య+దర్హతుడైన తావును, నీతడు నిర్యాణము నొందిన పిదప నాతనిదేహ మగ్నిసంస్కారమొనరింపబడిన చోటను, యీ పట్టణసమీపముననే గలవు. ఈ ప్రదేశములన్నిటియందును అత్యున్నతములగు స్తూపములు నిర్మింపబడియున్నవి. ఈ స్తూపవైభవములగాంచి, బౌద్ధమతవైరులగు

* శాక్యసింహుని పినతల్లి. శైశవమునుండియు, బుద్ధుని బెంచి పెద్దవానిని జేసిన దీమెయే. స్త్రీలలో సన్యాసదీక్ష గైకొనుట కీసాధ్వీమణియే ప్రథమురాలు.

♦ శ్రావస్తి పట్టణవాసియగు నొకానొక వణిక్‌శ్రేష్ఠుడు. మిగుల ధనాఢ్యుడు. దానశీలుడు. ఫాహియాను శ్రావస్తి పట్టణమును దర్శించు కాలమునాటి కాతని భవనమంతయు శిథిలమై పాడుపడియుండెను.

+ ఒక వీరశైవమతస్థుడు. అంగుళమాల్యులను వీరశైవమతశాఖకు జెందిన వాడగుటచే యాతని కీనామము గల్గినది. ఈ శాఖీయులు స్వమతరక్షణకై హత్యలు గావించినను దోషము లేదని తలంచెదరు. శాక్యసింహునిచే నాతడు బౌద్ధమతదీక్ష గైకొని, యర్హతుడయ్యెను.

సిచ్చటి బ్రాహ్మణులసూయాగ్రస్తులై వీని నెట్టులైన విధ్వంస మొనర్పవలయునని విశ్వప్రయత్నము లొనర్చిరి. ఒకనాటి రేయి ఖడ్గహస్తులై యాప్రదేశమును జుట్టిముట్టిరి. కాని కార్యము లేకపోయెను. ఆతరుణమున, నాకస్మికముగ నాకస మంతయు కారుచీకట్లు గ్రమ్మి నభోంతరాళమునుండి, ఫెళా ఫెళారావము లొనర్చుచు బిడుగులు గురియ జొచ్చెను. ప్రళయభీకరముగ జీమూతసంఘములు గర్జింపదొడగెను. గగనభాగమంతయు గలత జెందినట్లు శరపరంపరలుగ మెరుపులు మెరయ జొచ్చెను. స్తూపసంహారణమునకై యేతెంచిన బ్రాహ్మణు లాయుత్పాతలక్షణములగాంచి గుండె లవిసి యచ్చోటనుండి బరుగువారిరి.

ఈ పురద్వారమునకు దక్షిణపార్శ్వమున నన్నూరు బారలదూరమున సుదత్తునిచే నిర్మింపబడిన విహారమొండు గలదు. ఇయ్యదియె లోకవిఖ్యాతమగు "జాతవనవిహారము." దీనికే సువర్ణవనవిహారమని గూడ నామాంతరము గలదు. ఈ విహారము ప్రాగ్దిశాభిముఖముగ గట్టబడియున్నది. దీని సింహద్వారమున కిరుకెలంకులందును శిల్పరచనలచే నలరారెడు రెండు శిలాస్తంభములు గలవు. అందు వామపార్శ్వమున నిర్మింపబడిన స్తంభశిరోభాగమున నొక చక్రప్రతిమ గలదు. కుడివైపున నున్నదాని యగ్రభాగమున, నొక వృషభవిగ్రహము చిత్రింపబడియున్నది. ఈ విహారపరిసరము లన్నియు నిర్మలజలపూరితములగు జలాశయములతోడను, మధురఫలభరితములగు తరుసంతతులతోడను; చిత్రశోభిత



ములగు సుమజాలములతో నిండి కనులపండువొనర్చు లతావితానములతో విలసిల్లుచు నెంతయు శోభాయమానముగ నున్నవి. ఇట్టి రమ్యదృశ్యములతో నలరారుచు అత్యంత మనోహరముగ నుండుటచేతనే యీ విహారమునకు "సువర్ణవనవిహారము"† ను నామము గల్గెను.

శాక్యసింహుడు త్రయస్త్రింశత్స్వర్గమునకు బోయినపుడు కోసలదేశాధీశ్వరుడగు ప్రసేనజిత్తు డాతని గానక బెగడొంది గోశీర్ష చందనతరువుతో నాతని విగ్రహమును జెక్కించి యా మూర్తిని సువర్ణవనవిహారమున బుద్ధు డనుదినము నుపవిష్టుడై తప మాచరించుకొను తావున బెట్టించెను. శాక్యసింహుడు తల్లికి బౌద్ధధర్మముల నుపదేశించి స్వర్గమునుండి భూవలయమునకు మరలి మరల యీ వనవిహారమునకు జనుదెంచుచుండెనను వార్త లేతెంచినంతనే యీచందనపుబొమ్మ తటాలున దన స్థానమునువీడి యాతని కెదురేగెను. శాక్యసింహు డా ప్రతిమను జూచి సంతసించి "విగ్రహమా! నీవిక నీయథాస్థానమునకు బొమ్ము. నే నీలోకమును బాసిపోయిన పిదప నా

† శ్రావస్తిపట్టణ పరిసరముల విలసిల్లు నొక ప్రసిద్ధవిహారము. ఇది యత్యంతరమణీయమగు నొక క్రీడావనమున గట్టబడినది. ఈయారామము, ప్రసేనజిత్తుని తనయుడగు 'జేత' యను నృపకుమారునిచే "అనాధపిండికు" నకు విక్రయింపబడినది. శాక్యసింహుని కీవనవాటిక మిగుల ప్రేమాస్పదమగు యావాసభూమి యయ్యెను. పెక్కువత్సరము లాతం డిందే నివసించెను.

చతుర్విధ శిష్యసంతతులకు* నీవే యాదర్శప్రతిమవు గావలయు"నని యాశీర్వదించెను. తోడనే యావిగ్రహ మచ్చోటు వాసి విహారాంతర్భాగమునకుఁ జని తన యథాస్థానమున నిల్చెను!

ఇయ్యదియె ప్రథమమున భూమండలమునఁ జిత్రింపఁబడిన బుద్ధవిగ్రహము, తదుపరి బౌద్ధప్రపంచమున నిర్మింపఁబడిన బుద్ధమూర్తులకు మాతృక. అంతటినుండియు శాక్యసింహుండీవిహారమునువీడి దీనికి దక్షిణపార్శ్వమున నిరువది బారల దూరమునసున్న వేరొక చిన్నవిహారమునఁ దన నివాస మేర్పఱచుకొని యందు నివసింపఁజొచ్చెను.

తొలుత సువర్ణవనవిహార మేడంతరముల ప్రాసాదము. ఈ విహారపరిసరముల రాజ్యపాలన మొనర్చు రాజులును, దత్ప్రాంతనివాసులును ఏకాలము నీ దివ్యహర్మ్యమును దర్శించి పోవుచుందురు. దీనికి గానుక లర్పించువారును, బట్టుతోరణములతో నీభవనమంతయు నలంకరించువారును, చిత్రవర్ణవిలసితములగు వితానముల నీసౌధోపరిభాగమున వ్రేలగట్టువారును, నీసదనమున సుమజాలముల వెదజల్లువారును, ధూపములు వైచువారును, సూర్యుఁ డస్తాద్రిజేరినంతనే యిచ్చటదీపములుపెట్టువారును, ఈప్రదేశమున నెల్లవేళల బౌద్ధయాత్రికు లిసుముజల్లిన రాలకుందురు. ఇట్లుండ దౌర్భాగ్యవశమున నొకనాఁటిరేయి యొక మూషికము వెలుగుచున్న దీపపువత్తిని నొకదానిని నోట గరచుకొని బరుగెత్తుకొని పోవుచుండ హర్మ్యపరిభాగమున గట్టబడిన మేల్కట్టున కగ్నిస్పర్శదగిలి నిప్పంటుకొనెను. త్రుటికాలమున నగ్నికీలలు రేగి నానాముఖముల వ్యాపించి యాభవనమును జుట్టివైచెను. సువర్ణవనవిహారము రెప్పపాటులో భస్మీభూతమయ్యెను. ఆ పరిసరరాజ్యముల నేలెడు భూధవు లీదుఃఖవార్తవిని విచారపరీతులైరి. ప్రసేనజిత్తునిచే నిర్మింపబడిన చందనవిగ్రహముగూడ నగ్నిశిఖలవాతఁబడి ధగ్ధమైపోయెనేమోయని భయాకంపితులైరి. కాని యావిషాదసంభవము జరిగిననాల్గయిదు దినములకు వార లాప్రదేశమును బరిశీలించుచుండ ప్రాగ్దిశగానున్న యొక చిన్నవిహారమున బరిరక్షితమై యా చందనపుబొమ్మ గాన్పించెను! అందుల కానృపాలురు విస్మయులై తత్క్షణమే జాతవనవిహారమును బునర్నిర్మాణమొనర్ప మొదలువెట్టిరి. రెండంతరములు పూర్తియైన పిమ్మట మరల నావిగ్రహమును గొనిపోయి యందుంచిరి.

సువర్ణవనవిహారమును గాంచినంతనే మన ఫాహియానుటోచింగుల కనివార్యమగు దుఃఖ మతిశయిల్లెను. పాపము! మన ప్రయాణికుల కీవిహారమును వీక్షించుట కిదియె తొలిసారి. ఇరువదియైదు దీర్ఘవర్షములు లోకైకపూజ్యుడగు బుద్ధభగవానున కావాసభూమియై యతులవైభవమున దనరారి

* బౌద్ధమతమున చతుర్విధధర్మములు గలవు: (1) మానవజన్మము దుఃఖభాజనము (2) మనోవికారమే దుఃఖపరంపరలకు గారణభూతము (3) ఇంద్రియ నిగ్రహము దుస్సాధ్యముగాదు (4) ఇంద్రియనిరోధమునకు మార్గములు గలవు, అనునవి. ఈచతుర్విధధర్మముల నభ్యసించిన బౌద్ధగణము క్రమముగ శ్రోతపాణులనియు, సక్రదాగామినులనియు, అనాగామినులనియు, అర్హతులనియు చతుర్విధశాఖలుగ విభజింపబడిరి.

జగద్విఖ్యాతిగనిన విహారము నేఁడు శూన్యగేహమై వెలవెలఁ బోవుచుండెను. లోకకల్యాణుఁ డందుఁగానఁబడఁ డయ్యెను. అని తొల్లిటివైభవమును దలంచి యీపథికులు కన్నుల నీరుగార్చిరి. వారిహృదంతరాళముల వర్ణింప శక్యముగాని విచారభావములు తరంగితమయ్యెను. బుద్ధభగవానుఁ డవతరించిన యీపుణ్యభూమిని జన్మింపక యెచ్చటనో మురటు దేశమున నుద్భవించి మందభాగ్యుల మైతిమేయని యీపాంథులు విలపింపఁజొచ్చిరి. వారి ప్రస్తుతావస్థకూడవారలకు మరింత దుఃఖభాజన మయ్యెను. వారిట్లు తలపోయసాగిరి: "బౌద్ధధర్మముల నరయుటకై కడుదూరమునుండి యీ యార్యావర్తమునకు బయలువెడలితిమి. ఎన్నియో శ్రమలఁబడితిమి. పాషాణభూయిష్ఠమగు పెక్కురాజ్యముల నిర్గమించితిమి. దుర్గమంబగు నెడారులఁ దాటితిమి. మార్గమధ్యమునఁ గొందర సోదరశ్రమణులఁ గోల్పోయితిమి. మార్గశ్రమంబు భరింపఁజాలక భీతిల్లి కొందరు గమ్యస్థానమును జేరకమునుపే వెనుకదారి పట్టిరి. పలుకష్టములఁగడచి పెద్దకాలమునకే భారతవర్షమును జేరుకొంటిమి. కాని యీశాక్యసింహుని గన్నులార జూచు భాగ్యము లేకపోయెను." అని తలపోసి యశ్రువులరాల్చిరి.

ఇంతలో నెవ్వరో నూతనశ్రమణకు లరుదెంచి రను వార్తవినినతోడనే సువర్ణవనవిహారమున నివసించు భిక్షువులు బిలబిలాడుచు గృహాంతరసీమలనుండి వెలువడి మన యాత్రికుల జుట్టుమూగి వారి నీక్రింది విధమున బ్రశ్నింప జొచ్చిరి:



శ్రమణకులు—"పథికులారా, మీరెచ్చటనుండి విచ్చేయుచుంటిరి? మీ నివాసమెయ్యది?"

బాటసారులు—"అయ్యా! మేము చీనాసామ్రాజ్యమున నివసించువారము. అందుండియే వచ్చుచుంటిమి."

బౌద్ధభిక్షువు లాపథికులమాటల నాలకించి విభ్రాంతులై "ఎచ్చటి చీనాసామ్రాజ్యము! ఎచ్చటి యార్యావర్తము! అతి దవ్వులనుండి బౌద్ధధర్మముల నెఱుంగుటకై యీ భారతరాజ్యమున కరుగుటయా! మే మింతకాలమునుండి యీ విహారభూముల నివసించుచుంటిమిగాని హన్నురాజ్యమునుండి బౌద్ధమతావలంబు లరుదెంచిన జాడ లెఱుఁగము!" అని యాశ్చర్యమగ్నులైరి.

జేతవనవిహారమునకుఁ బశ్చిమోత్తరముగ నాలుగులీల దూరమున "చక్షుప్రదాయిని" (లేక అంధవిమోచని) యనిబిల్వబడుయుపవన మొకటి గలదు. పూర్వమీ యారామప్రదేశమున నైదువందలమంది గ్రుడ్డివారలు నివసించుచుండెడివారు. బుద్ధభగవానుఁడీ వికలాంగులయెడ జాలిగొని వారలకు బౌద్ధధర్మముల నుపదేశించి వారి యంధత్వమును బాపెను. అంములకా యంధులానందపరవశులై తమ హస్తముల ధరించియున్న దండములనాచెంత భూమిపై గ్రుచ్చి బుద్ధుని పాదాంబుజములపై వ్రాలినమస్కరించిరి. తోడనే యాదండములు చిత్రగతిని వేరులుదొడగి గుబగుబఁజిగిర్చి శాఖలవైచి త్రుటిలో నున్నతముగ బెరిగి మహావృక్షము లయ్యెను. ఇవ్విధమున నీప్రాంతమంతయు మనోహరమగు వనవాటిక యయ్యెను. అంతటినుండియు

నీ యారామసీమకు "చక్షుప్రదాయిని" యను నామము గల్గెను. జాతవనవిహారమున వసియించు శ్రమణకు లనుదినమును మజ్జనభోజనములొనర్చి యాయుపవనమునఁ జేరి ధ్యాననిష్ఠల దేలుచు, బొద్దు పుచ్చుచుందురు.

ఈ విహారమున కీశాన్యభాగమున నారేదులీల దూరమున 'వైశాఖ'* యను భిక్షుణిచే నిర్మింపబడిన విహార మొకటి గలదు. మున్నొకమారు బుద్ధుఁడును నాతనిపరివ్రాజకాగణమును యీ విహారమున కాహ్వానింపబడిరి. ఈ విహార మిప్పటికిని గలదు.

సువర్ణవనవిహారమునకు విశాలమై రమణీయమగు ప్రాంగణము గలదు. ఈముంగిలి భాగమునకు ప్రాక్పశ్చిమపార్శ్వములందు రెండున్నతద్వారములు గలవు ఈ వనభూమినంతయు సువర్ణములతో గప్పి సుదత్తుడే యీ వనవాటికను గొనెను. జాతవనవిహార మీ యుపవనమధ్యభాగమున నున్నది. మానవాళికి బౌద్ధమతధర్మముల నుపదేశించుచు పెక్కండ్రకు బౌద్ధదీక్ష నొసంగుచు శాక్యసింహుఁడీ యారామప్రదేశమునందే చిరకాలము వసియించెను. ఆతఁ డాసీనుడైన తావులందును, నడచిన ప్రాంతములందును స్తూపములు నిర్మింపబడియున్నవి. ఈస్తూపము లన్నిటికిని ప్రత్యేకనామములు గలవు. ప్రతిస్తూపనామమును స్తూపోపరిభాగమున జతింపబడియున్నది. బుద్ధునిపై బ్రహ్మహత్యాదోష మాపాదించుటకు సుందరుడను బ్రాహ్మణుడు ప్రాణత్యాగము గావించుకొనిన దిచ్చోటనే.

* అనాథపిండికుని యర్ధాంగి. భిక్షుణి యయ్యెను.

విషలిప్తమగు నఖములతో సిద్ధార్థునకు హానియొనర్పబోయి యధోలోకమున మణగిపోయెను. ఆ ప్రదేశమును యీవిహార పరిసరములందే గలదు.

ఈ సంభవములు జరిగిన తావులం దీప్రాంతవాసులు జ్ఞాపకార్థమై గురుతులనిడిరి. బుద్ధుడు మతాంతరులతో వాదమునెరపిన ప్రదేశమున నరువదియడుగుల యున్నతిగల్గిన విహార మొకటి గట్టబడియున్నది. అందాసీనుడై యుండినట్లు చిత్రింపబడిన బుద్ధవిగ్రహము గలదు.

సువర్ణవనవిహారమున కెదురుగ బ్రాహ్మణమతస్థులచే గట్టబడిన దేవాలయ మొకటిగలదు. ఇయ్యది రాజబాటకు దూర్పుదెసగ నున్నది. దీనియెత్తరువదియడుగులుండును. దీనికే "ఛాయాచ్ఛాదిత" దేవళమని పేరు. దీనికీనామ మెట్లుగల్గెనో తెల్పుటకొక చిన్నగాథ గలదు. సూర్యుడు పశ్చిమాకాశవీథుల సంచరించునపుడు జాతవనవిహారచ్ఛాయ లీ దేవళముపైబడి దానిని గప్పివేయును. కాని సహస్రకిరణుడు తూర్పుదెస నున్నప్పు డీదేవాలయపునీడలు విహారముపైబడక యుత్తరముగ బ్రసరించును. బ్రాహ్మణమతావలంబులు తమ దేవాలయమును దుడిచి సలిలములజల్లి ధూపదీపనైవేద్యములచే నందు ప్రవిష్టుడైన దేవు నారాధించుటకై యర్చకుల నియమించిరి. కాని రాత్రులందు బ్రాహ్మణదేవళమున వెల్గింపబడెడు దీపము

రజన్మములందైనను నివైరము చల్లారలేదు. శాక్యసింహుని ప్రాణములగొన నీతడు పలుసారులు ప్రయత్నించియు విఫలమనోరథుడై తుదకు దానె భంగపడి దారుణమరణమునకు గురియై మ్రగ్గెను.



లద్భుతముగ ప్రభాతమగుసరికి విహారమునం గాన్పింపజొచ్చెను. మతాంతరు లీ విపరీతసంభవమునకు గ్రోధోద్రిక్తులై మండిపడుచు "ఇయ్యది శ్రమణకులు గావించు చౌర్యము. వీరలు మా దేవాలయమున వెల్గింపబడుదీపముల నిశాసమయమున మెల్లగ గొనిపోయి తమ విహారమున బెట్టుకొనుచున్నారు. అయినను మే మింతటితో మా యారాధనల విరమించుకొనవారము గాము" అని నిప్పులుగ్రక్కుచు "ఈరేయి మా దీపముల నెట్లుగొనిపోయెదరో జూచెదముగాక!" యని పల్కి బ్రాహ్మణులందరును నాటిరాత్రి తామె యాదేవాలయమున గావలిగాయజొచ్చిరి. అర్ధరాత్రమగుసరికి నాకస్మికముగ తమచేనారాధింపబడు దేవతలె గిట్టిన నక్షత్రపథమునుండి దిగి వారలు చూచుచుండగనే దేవళమునజొచ్చి దీపములగొనిపోయి విహారమునకు ప్రదక్షిణము లొనర్చి లోనికిజని బుద్ధునకు హారతులిచ్చియదృశ్యులైరి. మాత్రశక్తిచే గట్టువడిన కీలుబొమ్మల వలె బ్రాహ్మణు లాసంభవమును దిలకించి స్తంభితులైపోయిరి. శాక్యసింహుని యద్భుతమహిమకు రిచ్చవడి యా ద్విజులంతటనుండియు దమసంసారముల ద్యజించి బౌద్ధమతావలంబులై సన్న్యాసవృత్తిని స్వీకరించి బుద్ధుని యనుచరులైరి.

ఈకాలమున జాతవనవిహారనకుజుటును దొంబదియెనిమిది బౌద్ధమఠము లుండెడివనియును వానిలో నొకదానియందు దప్ప దక్కటి మఠములన్నిటియందును భిక్షువులు నివసించుచుండెడివారనియు నీప్రాంతవాసులు చెప్పకొనెదరు.

ఈ "మధ్యదేశమున*" తొంబదియారు భిన్నమతశాఖలు గలవు. ఈ వివిధమతశాఖీయులును, యిహపరలోకములు వేఱుగనున్నవనియును, వానికిని యత్యంత పరస్పరసంబంధము గలదనియును మున్నగు సిద్ధాంతముల విశ్వసించెదరు. ప్రతిశాఖకును అసంఖ్యాకులగు ననుచరులు గలరు. బౌద్ధభిక్షువులవలెనె వీరును తిరిపెమెత్తి తమ జీవయాత్రల గడపెదరు. కాని భిక్షాటనమొనర్చునపుడు వీరు శ్రమణకులవలె కత్తుపాలల తమ వెంట గొనిపోవరు. వీరును పాంథజనుల సౌకర్యార్థమై మనుష్యసంచారమే లేనిమార్గములం దచ్చటచ్చట ధర్మశాలల గట్టించి యందు దేశాటనమొనర్చు తెరువరులకును, నతిథులై యరుదెంచు బౌద్ధశ్రమణకులకును అన్నపానీయములొసగియు, విశ్రాంతిగొనుటకు పర్యంకశయ్యాదుల సమకూర్చియు నాదరింతురు. పథికులీవిశ్రాంతిగృహములలో నివసింపనగు నిర్ణీతకాలమునమాత్రిమించుక తారతమ్యముగలదు. బౌద్ధధర్మశాలలకును వీనికినిగల వ్యత్యాస మింతేగలదు. దేవదత్తునకుగూడ నిచ్చట నెందరో యనుయాయులు గలరు. వీరలెల్లరును యింతకుము న్నవతరించిన బుద్ధత్రయమును సేవింతురుగాని శాక్యసింహు నారాధింపరు.

శ్రావస్తిపట్టణమున నాగ్నేయభాగమున నొక యొ

* ఈ సందర్భమున ఫాహియాను యాత్రికునిచే వర్ణింపబడునది మధ్యభారతమో లేక తాను బహిష్కృతము వందర్శించుచుండిన కోసలరాజ్యమో దెలియవచ్చుటలేదు. పూర్వాపరసందర్భములబట్టి కోసలదేశమే యై యుండునని దోచుచున్నది.



క్రోసు దూరమున విరూఢాహనృపాలుడు♦ దనసేనల వెం గొని కపిలవస్తునగరముపై దండెత్తి వచ్చుచుండ బుద్ధు తన దారిసిల్లిన *చోటు గలదు. ఇచ్చోట నొకస్తూపము నిర్మి పబడియున్నది.

---

♦ ఈతనికి వైడూర్యనృపుడను నామాంతరముగూడగలదు. ఈతడు సలరాజ్యమును బాలించురాజా. ప్రసేనజిత్తుని తనయుడు. తన జనకుని మర నంతర మీతడు కోసలరాజ్యసింహాసన మధిష్ఠించి శాక్యవంశీయుల రాజ యగు కపిలవస్తునగరముపై దాడివెడలి యాపట్టణమును భస్మీభూతమొనర్చె

* వైడూర్యనృపుడు చతురంగబలసమేతుడై వచ్చుచుండ బుద్ధు మహీరుహచ్ఛాయను నిలిచి యానృపాలుని జెవిబడునట్లు గంతమెత్తి యి బల్కదొడగెను. "ఈ క్షుద్రతరువు నా కాశ్రయమొసంగుటలేదు. కాని బంధుమిత్రుల కొదవనున్న యాపదల దలంచుకొనిన నాకియ్యదియె నెల వగుచున్నది." ఆమాటలవిని విరూఢాహుడు మిగుల జాలినొంది దనసై ముల వెనుకకు మరలించుకొని వెడలిపోయెను. కాని యీ రాజేశ్వరుడు వైరమును మాత్రము విడువలేదు. కొంతకాలమైన పిదప మరల ప్రచ సైన్యములతో యీ నగరముపైబడి దానిని విధ్వంసమొనర్చెను.

# ఇరువదియొకటవ ప్రకరణము

బుద్ధత్రయము.

శ్రావస్తినగరమును వీడి, మనపాంథులు పశ్చిమాభిముఖులై యేబదిలీలదూరమరిగి కాశ్యపబుద్ధుని జన్మస్థానమగు 'టూవెయి' * బట్టణమును జేరిరి. కాశ్యపుడు తన జనకుని గలిసికొనిన చోటను, తుదకాతడు నిర్వాణము నొందిన తావునను స్తూపములు గట్టబడియున్నవి. కాశ్యపతథాగతుని + కళేబరశిథిలముపైగూడ నొకమహాస్తూపము నిర్మింపబడియున్నది.

శ్రావస్తి నగరమున కాగ్నేయ పార్శ్వమున బండ్రెండు యోజనముల దూరమున "నాభిక"♦ యను బట్టణ మొండు గలదు. ఇయ్యదియె క్రకుచండ బుద్ధుడు జన్మించినతావు.

* సాహెఠమహెత్తునకు పశ్చిమముగ నుండు 'తాద్వా' గ్రామమే యీ "టూవెయి" పట్టణమై యుండవలెనని చరిత్రకారు లూహించుచున్నారు. కాని కాశ్యపుడు బుట్టినచోటు వారణాసియని బెక్కండ్ర యభిప్రాయము.

+ మహాపురుషులగు బుద్ధుల కొసంగబడు బిరుదనామము. బౌద్ధగ్రంథములలో కాశ్యపునినిర్వాణవృత్తాంత మిట్లు వర్ణింపబడినది. కాశ్యపు డవసానము నొందినపిమ్మట యాతని మృతదేహమున కగ్ని సంస్కారము గావింపబడెను. కాని యాతని కల్యపంజరము మాత్ర మగ్నిదగ్ధము గాక యట్లే నిలిచియుండెను. అంతట జంబూద్వీపవాసులందరును దాని కెంతయు నచ్చెరువంది యావాన కల్యముల ప్రోవు నొకచోట నిక్షిప్త మొనర్చి యచ్చట బ్రహ్మాండమగుస్తూపమును గట్టించిరి. దాని నిడివి యొక యోజనముండునట!

♦ క్రకుచండుని జన్మక్షేత్రము మేఖలా నగరమని కొందరి యభిప్రాయము.



శ్రావస్తి కుత్తరముగ నొకయోజన మేగినచో కనకముని జన్మించిన బట్టణము గాన్పించును. వీరలు తమ జనకుల సందర్శించిన తావులందును, నిర్వాణము నొందిన క్షేత్రములందును స్తూపములు గలవు.

# ఇరువదిరెండవ ప్రకరణము

కపిలవస్తు

శ్రావస్తినుండి తూర్పుదిశగా మరలి మన పాంథులు కపిలవస్తునగరమునకు బోయిరి. కపిలవస్తునగరము శ్రావస్తిపట్టణమున కొక్క యోజనము దూరమున నుండు ఈ పట్టణావస్థ కడుసంతాపకరముగ నున్నది. ఈనగరమంతయు నేడు పాడుపడి శిథిలమై, నిర్మానుష్యమగు యెడారివలె నున్నది. కొలదిమంది బౌద్ధభిక్షువులును, పదిపండ్రెండు నిరుపేదకుటుంబములును దక్క యీ విశాలనగరమున నెచ్చటను మనుష్య సంచారమే గానరాదు. పూర్వకాలమున శుద్ధోదనమహీపాలుని *సౌధము విలసిల్లిన ప్రదేశమున నేడాతని పతీసుతులశిలావిగ్రహములుమాత్రము గాన్పించుచున్నవి. రాజప్రాసాదమంతయు నంతరించిపోయినది. బుద్ధుడు ధవళతురగము నెక్కివచ్చి తప

* శాక్యసింహునితండ్రి.

గర్భమును బ్రవేశించినట్లు (బుద్ధునితల్లి) మాయాదేవికలగనిన తావును, సిద్ధార్థుడు రోగపీడితునిఁగాంచి, తన యశ్వశకటమును గిరుక్కున వెనుకకు మరలించినచోటును, అసితమహర్షి + బాల సిద్ధార్థుని యొడలిపైగల యవతారచిహ్నముల బరిశీలించిన ప్రదేశమును, దేవదత్తుని ముష్టిఘాతముల చేగూలిన గజయూథకళేబరమును, యువరాజగు సిద్ధార్థుడవలీల పిడికిట నెత్తి విసరివైచిన♦ చోటును, బాల్యక్రీడల దేలుచు నొక్కనాడు, శాక్యసింహుడు దన కార్ముకమును‡సంధించి యమ్ము నేయ,నాశరము, మూడు యోజనముల దూరమునబడి, పుడమిని జీల్చుకొని భూగర్భమును

---

' శుద్ధోదనమహీపాలుని తండ్రి రాజ్యకాలమున మంత్రిపదవి నలంకరించినవాడు. పాలీభాషలో నీతనికి "కళాదేవళు"డని పేరు.

♦ వైశాలీనగరమును బాలించు లిచ్ఛవీవంశనృపుడు శుద్ధోదనునితనయుడగు సిద్ధార్థునకు సుందరమగు, నొక కరిశాబకమును కానుకగా బంపెను. ఈ గజకిశోరము కపిలవస్తునగరమును సమీపించుచుండ యది దేవదత్తుని గంటబడెను. దానినిజూచి యీర్ష్యాజ్వాలక దేవదత్తుడొక్క ముష్టిఘాతమున నామత్తగజమును హతముగావించెను. ఆనందు (శాక్యసింహుని సవతితల్లి కుమారుడు) డాదారినిబోవుచు, మార్గమున కడ్డుగా బడియుంటచే యామృగ కళేబరము మరియొకప్రక్కకీడ్చెను. మరికొంతవడికి సిద్ధార్థకుమారు డామార్గమున జనుచు విగతజీవియైయున్న యాగజయూథమునుగాంచి, దానిపుచ్ఛమును పిడికిటబట్టి విసరివైవ, నది పైకెగసి యేడు ప్రాకారములదాటి యావల బడెను. ఆదేహము నేలపై బడినచోట బల్లమై, నాఖిలమగు నొక యగడ్త యేర్పడెను. శాక్యసింహు డప్పటికి పదేండ్లబాలుడు.

కార్ముకము. బాల్యక్రీడాసక్తులై యొక్కనాడు, శాక్యబాలురు శరముల విడచుచు నాడుకొనుచుండ సిద్ధార్థుడు తన తోడిబాలురను మించి తనబాణము మూడు క్రోశముల దూరమున బడునట్లు విడిచి, యాతని ధను



బ్రవేశింప, యచ్చట జలధారలు గుబగుబ నిర్గమింపదొడగిన స్థలమును, శాక్యసింహునకు జ్ఞానోదయమైన పిదప, నాతడు దన ప్రియజనకుని కడకేగి యాతని సందర్శించిన తావును, నన్నూరుశాక్యకుమారు లొక్కపెట్టున దమ దారాసుతుల వీడి, యుపాలి § పాదముల కెరగిన † ప్రదేశమును, శుద్ధోదన మహీపాలుడైన జొరరాకుండ నల్వురు దేవవిభులును ప్రతీహారులై మందిరద్వారములకడ గావలిగాయుచుండ బుద్ధభగవానుడు దేవతానీకములకు బౌద్ధధర్మముల నుపదేశించిన పావనక్షేత్రమును, శాక్యసింహుడు ప్రాగ్దిశాభిముఖుడై న్యగ్రోధపాదముక్రింద నాసీనుడైయుండ, నాతని బినతల్లియగు మహాప్రజాపతియొకసంఘాటిని దెచ్చి (సన్యాసులు దొడుగుకొను యంగీ) యాతనికికానుకగానొసంగిన పవిత్రవాటికను, వైడూర్య నృపాలుడు శాక్యవంశమున బుట్టిన నారీమణులనెల్ల తనఖడ్గ ధారల కెరగావింప వారలు సురులు బాసి స్వర్గధామమును

---

ర్విద్యానైపుణ్యమును బ్రదర్శించెను. బుద్ధుడప్పటికి పదునేడేండ్ల ప్రాయమువాడు. ఆబాణము మూడుక్రోశములరిగి యచ్చటబడి భూమిని ఛేదించుకొని పృథ్వీగర్భమును బ్రవేశింప యచ్చట జలధారలు నిర్గమింపదొడగెను. వీని కీప్రాంతవాసులు "శరధార"లని పేరిడిరి.

§ ఆసమయమున పృథ్వీతలమంతయు నాఱుసార్లు కంపించెను.

† ఈతడొక బౌద్ధ సన్యాసి శూద్రవర్ణమున జన్మించినవాడు (మంగలి). నీచజన్ముడైనను సుజ్ఞానశీలుడయ్యెనేని పూజనీయుడని బౌద్ధమత మద్ఘోషించెను. శిక్షణనియమముల బాగుగ నెఱింగినవాడని యాతడు శాక్యసింహునిచే గొనియాడబడెను. ప్రథమబౌద్ధమత మహాసభానిర్మాతలలో నీతడు ప్రాధాన్యుడు. వినయగ్రంథముల రచించిన దీతడేయని ప్రతీతిగూడగలదు.

చేరకమున్నె శ్రోతపాణులైన* పవిత్ర భూమిని మన పాంథులీ కపిలవస్తు పట్టణపరిసరములందు వీక్షించిరి.

కపిలవస్తునగరమున కీశాన్యభాగమున పెక్కుక్రోశములదూరమున తన్నగరాధీశుల మావ్యక్షేత్రములు గలవు. ఇచ్చటనే యొక మహీరుహచ్ఛాయను గూర్చుండి నృపకుమారుడు(సిద్ధార్థుడు)కృషీవలులు బొలముదున్నుట నవలోకించెను.

ఈ పట్టణమునకు దూర్పువైపున నైదుక్రోశముల దూరమున "లంబినీ" యను నారామ మొకటి గలదు. కపిలవస్తు నృపాలునియర్ధాంగి కమలాకరమును జొచ్చి జలకమాడి శాక్యసింహునిగనిన దిచ్చోటనే. ఆసతీమణి సరోవరజలముల స్నాన మొనర్చి యుత్తరపుటొడ్డు నెక్కి యిరువది యడుగులు వైచి యచ్చట నిలిచి తన హస్తముల జాపి యాచెంతనున్న

* జన్మరహితులగు యతీంద్రులకు శ్రోతపాణులని పేరు. వైడూర్య క.హీపాలుడు శాక్యవంశ జన్ములగు నయిదువందల కన్యకామణులు తన యంతఃపుర కామినులగుట కిచ్చగింపక దిరస్కరించుటచే క్రుద్ధుడై వారల నొక సరోవరతీరమునకు గొనిపోయి నిర్దయుడై వారలపాదములను హస్తములను ఖండించి విడిచెను. దయాళువగు బుద్ధుడు వారియాక్రందనధ్వనుల నవ్వలనుండి విని యొక్కపరుగున నావికలాంగుల చెంతకేగి వారి నోదార్చి చికిత్స యొనర్చి తృటిలో వారిగాయముల మాన్పెను. పిమ్మట నాయువతీమణులకు బౌద్ధధర్మముల నుపదేశించెను. ఆకన్యకలు హర్షములో బౌద్ధదీక్షగైకొని ప్రాణముల విడిచిరి. పిదప చతుర్మహీపాలుడు రాజ్యమేలుచుండ యీరాచపుట్టియలు భూలోకమున జన్మించి యొక్కనాడు కువర్ణవనవిహారమునకు జని బుద్ధుని దర్శించిరి. శాక్యసింహు డనుగ్రహించి వారలకు కైవల్యపథము నొసంగెను.



విటపీవృక్షశాఖ నొకదానిని కరమున గీలించి ప్రాగ్దిశాభిముఖియై కుమారునిగనెను పుడమిపై బడినంతనే యాపాప డేడడుగులు నడచెను. ఉరగవల్లభు లిద్దరు వానిని జలకమాడించిరి. ఆపసికుమారునకు నీళ్లువోసిన చోట నొకపెద్దబావియయ్యెను. ఈకూపోదకములను రాజ్ఞి స్నానమొనర్చిన సరోవరజలములను యిచ్చటి భిక్షువులు పావనోదకములుగ భావింతురు.

శాక్యసింహునకు జ్ఞానోదయమైన తావును, బుద్ధుడు బౌద్ధధర్మములను లోకమున బ్రతిష్ఠింప మొదలిడిన చోటును, మతవాదమున నాతడు విమతస్థుల పరాభూతుల గావించినప్రదేశమును, తనతల్లికి బౌద్ధధర్మముల నుపదేశించుటకై గౌతముడు త్రయస్త్రింశత్స్వర్గమున కేగి భూమండలమునకు దిగినప్రాంతమును, బౌద్ధమతావలంబులకు మిగుల పావనక్షేత్రములు. తక్కటిప్రాంతము లాతడప్పుడప్పుడు ప్రదర్శించిన యమానుషశక్తులంబట్టి ప్రసిద్ధిగాంచినవి.

కపిలవస్తురాజ్యమంతయు నేడు పాడువడి జనశూన్యమై నిర్జరారణ్యమువలె భీతిగొల్పుచున్నది. దేశమంతయు సింహశార్దూలాది వన్యమృగసంకీర్ణమగుటచే ప్రమత్తులై యీరాజ్యమున బ్రయాణమొనర్చుట కడు నపాయకరము. ఇచ్చట పాంథు లత్యంత జాగరూకులై మెలగవలయును.

# ఇరువదిమూడవ ప్రకరణము

—:o:—

## రామరాజ్యము

కపిలవస్తునగరమున కైదుయోజనముల దూరమున "రామరాజ్య"♦మను రాజ్యమొకటిగలదు. ఇయ్యది 'లంబినీ' వనమునకు ప్రాగ్దిశగా నున్నది. ఈ రాజ్యమేలునృపుడు బుద్ధుని శల్యముల గొన్నిటిదెచ్చి వానికొరకొకస్తూపమును గట్టించి దానికి "రామస్తూప" మని పేరిడెను. దీనిచెంతనే పెద్దతటాకమొండు గలదు. ఈజలాశయమున నొక్కపాపఱేడు నివసించుచుండును. ఈ యురగరాజమే యీస్తూపమునకు బూజలొసర్చుచు రేయుంబవళ్లు దానికి గావలిగాయుచుండును. అశోకసార్వభౌముడు పట్టాభిషిక్తుడైనంతనే బుద్ధుని శల్యశకలములపై నిర్మింపబడిన యష్టస్తూపములను* బడగొట్టించి వానికిబదులు యెనుబది నాలుగువేల‡ స్తూపముల గట్టింప నిచ్చగొని తక్కటిప్రాంతములందు నిర్మింపబడిన స్తూపముల నన్నిటిని చిదుకగొట్టించెను. అటుపిమ్మట అష్టమస్తూపమగు రామస్తూపమునుగూడ బడగొట్టింప నుద్యుక్తుడై యిచ్చోటికరుదెంచెను. ఆతడీప్రదేశమును సమీపించినంతనే యాదాపున కమలాకరమున నివసించుచున్న పాపఱేడా నృపుని కట్టెదుట నిలిచి తటాకగర్భముననున్న దనప్రాసాదమున కాతని బిలుచుకొనిపోయి తానాస్తూపమునకు కానుకగ నొసంగుటకై గొనితెచ్చియుంచిన వస్తుచయము నాతనికి జూపి "ఓయీ నృపోత్తమా! వీని మరపించు వస్తువుల దెచ్చి యీ స్తూపమున కర్పింపగలవేని దీని బడగొట్టింపుము. నే నడ్డుసేయ" ననిపల్కి యాయహిరాజదృశ్యుడయ్యెను. అశోకుడాశ్చర్యనిమగ్నుడై యట్టి వస్తుసముదయము భూవలయమున నెచ్చటను గానరాదని యెఱింగి హతాశుడై స్తూపమును బెకలింపకయె వెడలిపోయెను.

కొంతకాలమున కీస్తూపపరిసరములన్నియు కసవుచే సలముకొనిపోయెను. స్తూపమును దుడిచి సలిలమును జల్లువారెవ్వరును లేకపోయిరి. పూజాపురస్కారములు శూన్యమయ్యెను. అంతట నాప్రాంతవనమున నివసించు ఏనుగులనుదినమును దమ తుండంబులతో సలిలముల గొనివచ్చి యాప్రదేశమున జల్లి చిత్రవిచిత్రములగు కుసుమముల దెచ్చి యాస్తూపమున కర్పించి వెడలుచుండెను. ఇట్లుండ నొకనాడీరామరాజ్యమున వసియించు బౌద్ధభిక్షు వొక్కడీస్తూపమును దర్శింప నరుదెంచుచు దూరమునుండి యా గజసంతతుల జూచి నివ్వెరపడి భీతావహుడై యాప్రక్కనున్న చెట్లమాటున డాగి యాకుంజరసమూహముల చెయ్దముల నవలోకింపజొచ్చెను. ఆ ఏనుగులగుంపు మెప్పటివలె సరోవరమునుండి నీరముల

---

♦ దీనికి "రామగ్రామ"మను నామాంతరముగూడ గలదు. ఇయ్యది కపిలవస్తు కుసినగరములమధ్యనున్నది.

* బుద్ధుని శల్యము లెనిమిదిభాగములుగ విభజింపబడి యెనిమిది ప్రాంతములకు గొనిపోబడెను. ఎనిమిదిచోట్లను ఎనిమిది స్తూపములు గట్టింపబడెను.

‡ మానవుని శరీరమున నెనుబదినాలుగువేల పరమాణువు లుండునని యూహింపబడుటచే యశోకనృపాలుడీ యెనుబదినాలుగువేల యణువులకును యెనుబదినాలుగువేల స్తూపముల గట్టింపవలెనని సంకల్పించెను.

దెచ్చి యారాధనకృత్యములు నిర్వర్తించుచుండెను. నియుక్త శిక్షని యాదంతావళములు రామస్తూపమునకు పూజలొనర్చుచుంగాంచి భిక్షువు "ఆహా! యింతటి మహాస్తూపమునకు బూజలొనర్చుటకు గడకు ద్విరదసమూహములు దిక్కయ్యెనా? ఎంతగతివట్టెను!" అని విచారపరీతుడై తత్క్షణమె దాను గైకొనిన శపథములు* విడనాడి శ్రామణేరుడై యాస్తూపమున కారాధనల సల్పదొడంగెను. అచ్చటదట్టముగ బెరిగియున్న కసవును, ముండ్లపొదలను దొలగించి యాస్తూపపరిసరములన్నియు శుభ్రమొనర్చి దర్శనపాత్రముగ జేసెను. అంతటితో తనివినొందక యారాజ్యమును పాలించు రాజునొద్దకు బోయి వేయువిధముల నాతని బ్రార్థించి యాతని సాయమున నచ్చట నొక సంఘారామమును గట్టించి యామఠమునకు దానె యధిపతి యయ్యెను. ఈ సంఘారామము నేటికిని గలదు. అందు భిక్షువు లిప్పటికిని నివసించుచున్నారు.

ఇయ్యవి చిరకాలమునాటి సంభవములు గావు. ఇటీవలి వృత్తాంతములు. నాటినుండి నేటివరకు యీ సంఘారామమునకు శ్రామణేరులే యధిపతులుగనుండిరి.

* ఆతడు విడనాడిన శపథము లెవ్వియో ఫాహియాను మనకు చెప్పియుండలేదు.

# ఇరువదినాల్గవ ప్రకరణము

## శాక్యసింహుడు తుదిసారి దారాసుతులవీడినతావు.

ఇచ్చటకు ప్రాగ్దిశగా మూడు యోజనముల దూరమున సిద్ధార్థకుమారుడు తన ధవళతురంగమును, రథసారధియగు చన్నుని + పురమునకు మరలిపొమ్మని వెనుకకు బంపివైచిన చోటుగలదు. ఇచ్చట నొకస్తూపముగూడ నిర్మింపబడియున్నది.

ఇచ్చోటనుండి మనపాంథులు మరల దూర్పుదెసగా మరలి మరినాలుగుయోజనము లరిగి యంగార * (బొగ్గుల) స్తూపమును గాంచిరి.

పిమ్మట మన తెరువరులు ప్రాగ్దిశాభిముఖులై పండ్రెండుయోజనములు జని కుశనగరమును ♦ జేరిరి. ఈ నగరమున

+ ఇది లోకకల్యాణమునకై శాక్యసింహుడంతఃపురమును వీడి చనిననాటిరేయి జరిగిన వృత్తాంతము. ఈ యుత్తమాశ్వమావాడు సంతోషాతిరేకమును ముల్లోకములను దద్దరిల్లి బడునట్లు హేషధ్వానము లొనర్చెను. సిద్ధార్థునిచే విడనాడబడి దుఃఖితమై యీ వాజి యశ్వశాలకు దిరిగిపోకయుండె నిలిచి తిరిగి తిరిగి శుష్కించి తుదకు విచారభరమున జీవముల బాసెను. ఈహయరాజమునకు కంఠకమని పేరు.

* దీనికే యింగళస్తూపమనిగూడ పేరు. కొందరు చరిత్రకారులు దీనినే విభూతిస్తూపమని కూడ పేర్కొనియున్నారు. ఇయ్యది బుద్ధునిమృతదేహమున కగ్నిసంస్కారము గావింపబడినచోట కట్టబడిన స్తూపము.

♦ అచ్చట కుశలు విరివిగా బెరుగుచుండుటచే నా పట్టణమునకు కుశనగరమని పేరు గల్గెను. పాటలీపుత్రమునకు (పాట్నా) పశ్చిమోత్తరమున కునేయా యను గ్రామసమీపమున నీనగరశిథిలము లింకను గానవచ్చెడివి.

ఉత్తరపార్శ్వమున ప్రవహించు హిరణ్యావతీనదీతటమున రెండు సాలవృక్షములనడుమ బుద్ధు డుత్తరశిరస్సుగా నిర్వాణము నొందెను. శాక్యసింహునిచే బౌద్ధమతదీక్ష యొసంగబడినశిష్యకోటిలో గట్టకడపటివాఁడగు సుభద్రుఁడను* బ్రాహ్మణుఁడు పరిపూర్ణుఁడై యటుపిమ్మట యర్హతుఁడైన చోటును, సువర్ణమణివిరాజితమగు నొక యనంతశయనమున నుంచి నేఁడు దినములు లోకారాధ్యుని మృతదేహమునకు బూజలొనర్చిన తావును,+ వజ్రపాణి తన వజ్రంపుగదను బరిత్యజించిన + యవనియు, అష్టమహీపాలురును, యనగ్నిదగ్ధమైన శాక్యసిం

* వారణాసీ పట్టణమున నివసించుచుండిన యొకానొక విప్రుఁడు. ఈతఁడు బౌద్ధధర్మముల నెఱుంగుటకై యొకనాఁడు శాక్యసింహునికడ కేగెను. అప్పటి కీతఁడు నూట యిరువదేండ్ల వయోవృద్ధుఁడు. ఆనాటిరేయి బుద్ధుఁడు దివికేగుచుండెను. ఇది తఱిగాదని యానందుఁడీ వృద్ధబ్రాహ్మణుని వెనుకకు బంపివేయుచుండ బుద్ధుఁడాతని వారించి యాముదుసలిని తనయొద్దకు దీసికొనిరా నియమించి యాతనికి బౌద్ధధర్మముల నుపదేశించెను. బ్రాహ్మణుఁడు సంతసించి తత్క్షణమే బౌద్ధదీక్షగైకొని ధన్యుఁడయ్యెను.

\+ ఇది మహాచక్రవర్తుల మృతదేహములకు గావింపబడు మర్యాద. కుశనగరాధీశ్వరులు బుద్ధుని దేహమున కగ్నిసంస్కారము గావించుటకై తమ రాజసౌధమున గిరీటధారణవైభవములకు గట్టింపబడిన దివ్యమందిరము నొసంగి యద్దాని నత్యంత శోభాయమానముగ నలంకరించిరి. పిమ్మట నాతని పవిత్రశరీరమును కాంచననిర్మితమగు నొక యనంతశయనమున నుంచిరి.

\+ ఈ గాథ యొద్దియో స్పష్టముగ దెలియరాకున్నది. వజ్రపాణి యింద్రుని బిరుదనామము. ఇచ్చటి సందర్భమునుబట్టి యింద్రుఁడు శస్త్రపరిత్యాగియై బౌద్ధమతరక్షణకై బయలువెడలెనని యూహింపవలసియున్నది.



హుని యస్థిశకలముల నెనిమిది భాగములుగ * విభాగించుకొనిన ప్రదేశమును నిచ్చటనే గానవగును. ఈ తావులన్నియు స్తూపసందోహములతోడను, బౌద్ధమతశ్రేణులతోడను యలరారుచున్నవి.

అచ్చటచ్చట నివసించు సన్యాసికుటుంబములు దక్క కుశానగరమందైనను జనులు విశేషసంఖ్యాకులు గానరారు. కపిలవస్తునగరమువలెనే నిదియు జనశూన్యమై యున్నది.

ఇచ్చటి కాగ్నేయముగ పండ్రెండు యోజనములదూరమున, తామును బుద్ధునివెంట స్వర్గధామమున కరుదెంతుమని లిచ్ఛవీయోధగణ మాతని వెన్నాడిన ప్రదేశము గలదు. వలదని బుద్ధుఁడెంత చెప్పినను నా యోధాగ్రేసరులు తమ మూర్ఖమును విడి వెనుకకు మరలిపోరైరి. చేయునది లేక, శాక్యసింహుఁ డంతట నొక మహాభీలమగు కందకము నడుమ సృష్టించెను. ఆపరిఖాజలముల దాటి యా వీరులు ముందునకు సాగిపోజాలరైరి. బుద్ధుఁడు వారల యనురాగమున

* కుశి, పవ, వైశాలి, యున్నగు అష్టరాజ్యనృపులు. ఈరాష్ట్రముం బాలించు నృపాలురును, అందందు నివసించు బ్రాహ్మణులును, అస్థిచయము నంతయు దామె గొనిపోవలయునని, ప్రతియొక్కరును యాశించి తమలో తాము తగవులాడుకొనజొచ్చిరి. కాని ద్రోణుఁడను బ్రాహ్మణుని హితవచనముల నాదరించి యా శల్యఖండముల నీ యెనమండ్రు నృపులును నెనిమిది భాగములుగ బంచుకొనుట కిచ్చగించిరి.

♦ వైశాలీరాజ్యమున వసియించు యోధగణము. "లిచ్ఛవి" యను యున్నతరాజవంశమున బుట్టిన నాయకవీరులు. వీరందరికంటె మున్ను వీరలె బౌద్ధమతము స్వీకరించిరి. వీరికి బుద్ధునియందుగల యనురాగము నిరుపమానము.

కేంతయు మెచ్చి, తన కత్తుపాలను వాత్సల్యచిహ్నముగ నా వీరనికాయమున కొసంగి వారి సతీసుతులకడకు వారిని మరల బంపివైచెను. పిదప నిచ్చోట నొక శిలాస్తంభము నిర్మింపబడెను. ఈ స్తంభోపరిభాగమున నీ విచిత్రవృత్తాంత మంతయు లిఖింపబడియున్నది.

---

# ఇరువదిమైదవ ప్రకరణము

—:o:—

## వైశాలీరాజ్యము- "శస్త్రపరివర్జిత స్తూపము"

కుశనగరమునువీడి మనపథికులు తిన్నగా బయనమై పోయి యచ్చటకు బదియోజనముల దూరముననున్న వైశాలీ నగరమును సమీపించిరి. ఇయ్యదియె వైశాలీరాజ్యమునకు రాజధానీపట్టణము. ఈపురమున నుత్తరభాగమున నొక వన వాటికగలదు. శాక్యసింహునికి జిరకాల మావాసభూమియై తనరారిన రెండంతరముల విహారమును, ఆనందుని యర్ధశరీర మున్పైనిర్మింపబడిన యొకయున్నతస్తూపమును యిచ్చటనేగలవు. ఈవైశాలీపట్టణమధ్యభాగమున "అంబపాళి"* యను వారాంగ



చే బుద్ధుని గౌరవార్థమై కట్టింపబడిన స్తూపమొండు గలదు. ఈపురమునకు దక్షిణదిగ్భాగమున నొక యరక్రోసు దూరమున రాచబాటకు బశ్చిమముగ బుద్ధుని యావాసమునకై యామె దానముగ నొసంగిన యొక యారామముకూడగలదు. తన నిర్యాణకాలము సమీపించినంతనే శాక్యసింహుడుతన శిష్యగణములతో పశ్చిమద్వారమును దాటి యాపురమును వీడిపోవుచు తటాలున వెనుకకు దిరిగి దక్షిణపార్శ్వమున గనుల పండువై విలసిల్లుచున్న వైశాలీనగరమును దిలకించి "నేనీ భూలోకమున దర్శించు ప్రదేశములలో నియ్యదియె కడసారి ప్రదేశము. నే నీలోకమున నిర్వర్తింపవలసిన కడసారి కృత్యముల నిందే నిర్వర్తించితి" నని తన శిష్యులతో బల్కెను. తరువాత కొంతకాలమున కచ్చోట నొకస్తూపము నిర్మింపబడెను.

ఈ పట్టణమునకు బశ్చిమోత్తరముగ నొక యరమైలు దూరమున "శస్త్రపరివర్జితస్తూప"మను నామమున బరగు స్తూపమొకటిగలదు. దీని కానామ మెట్లుగల్గెనో వర్ణింపుచు బౌద్ధపురాణగ్రంథములలో నొకచక్కని గాథగలదు. పూర్వముగంగానదీతటమున విశాలమగు రాజ్య మొకటివిలసిల్లుచుండెడిది. ఆరాజ్యభూమినేలు నృపవరుని యుంపుడుకత్తె గర్భవతియై యొకనాడు

---

* ఈమె వైశాలీ నగరమున వసియించు నొక వేశ్య. ఈమెకు "ఆనురపాళి" యనియు "ఆమ్రదరిక" యనియు నామాంతరములు గలవు; బౌద్ధపౌరాణిక గ్రంథములయం దీమె నామము పెక్కుసారులు గానబడును. ఈమె పలుసారులు యమలోకమున జనియించెను. నూరువేలమారులు బిచ్చక ఱాలుగను ఇదివేసారులు కులటగను భూమండలంబున జన్మించెను. శాక్యపుబుద్ధుని కాలమున సుగుణశీలయై వర్తించుటచే నీమె దేవియై జన్మించి తుదకు వైశాలీనగరమున నొక యామ్రపాదపముక్రింద నుద్భవిల్లెను. కాని యీ జన్మమునగూడ మరలనామె దుష్పథగామినియై వర్తిలి బింబిసారునివలన నొక పుత్రుని గాంచెను. బుద్ధుడామెపై జాలిగొని యామెకు హితముగరపి బౌద్ధ ధర్మముల నుపదేశించెను. అంతటనుండియు నీమె తన దురాచారముల విడనాడి పవిత్రజీవినియై భిక్షుణియై తుదకు యర్హత్త్వము నొందెను.

వికారాకృతిగలిగిన యొక మాంసపు ఖండమును గనెను. నృపుని రాణి యసూయాగ్రస్తయై "ఇట్టిమాంసపు శకల ముద్భవించు టెంతయు రాజ్యమునకరిష్టదాయక"మని నుడువుచు, యాపలలము నొక పెట్టెలోవైచి యాపెట్టెను గంగానదీప్రవాహమున జారవిడచెను. భాగ్యవశమున నాపేటిక, విలాసార్థమై యాచెంగటనే మసలుచుండిన యొకానొక రాజవరేణ్యుని కంటబడెను. నదీజలము లమునుఁగుచు దేలుచు గొట్టుకొనివచ్చు నా పేటికను గాంచి యాతడాశ్చర్యనిమగ్నుడై, యందేమికలదో చూడ కుతూహలుఁడై తన పరిచారకులచే నాపెట్టెను యొడ్డునకు దీయించి దానిని తన సౌధమునకుగొనిపోయి దాని తెరచి చూచెను. రాజు నివ్వెరపడెను. సర్వాంగసౌష్ఠవముగలిగి ముద్దులుగుల్కెడు బాలసహస్ర మాపెట్టెయందు గాన్పించెను. అందులకు నృపాలుడు స్వాంతమున మిగుల సంతసించుచు, నాపసిపాపల తనయింటనే యుంచుకొని కన్నకుమారులవలె, నతిగారాబమున బెంచుకొనజొచ్చెను. బాల్యముననే నీరాచబిడ్డలు పరాక్రమశాలురని పేరువడసి తమ శౌర్యపటిమను శత్రురాజులకు జవిజూపుచు అజేయులై పరిఢవిల్లసాగిరి. పరిసర రాజ్యముల బెక్కింటిపై దాడిసల్పి వాని నవలీల జయింపజొచ్చిరి. ఎట్టకేలకు నిజజనకుని రాజ్యమునుగూడ జయింపదలచి తద్రాజ్యముపై దాడివెడలిరి రాజాసమాచారము నెఱింగి భయకంపితుడై రాజ్యరక్షణోపాయమును గానక పరితపింపసాగెను. ఆ బాలయోధులతో రణమొనర్చి గెలుపొందుట యసంభవమని యాతఁడు వేయితెఱంగుల చింతింపసా



గెను. ఈతడిట్లు శత్రుసైన్యముల జూచి తత్తరపాటొందుట గాంచి, యానృపాలుని యుంపుడుకత్తె యాతని చెంతకేగి "రాజవరేణ్యా! యిట్లు విచారపరీతులై, దీర్ఘాలోచన సేయుచుండుటకు గారణమేమి?" యని ప్రశ్నించెను. రాజు, "అంగనామణీ! యేమని చెప్పుదు! శత్రురాజులు మనపై దాడివెడలిరి. సైన్యములు మన రాజ్యమును సమీపించుచున్నవి. మనము వారల జయించుట కలలోనివార్త. ఆరాజ్యాధీశ్వరునకు అనన్యబాహువిక్రములును, సమరశూరులును నగు పుత్రులొక్కసహస్రముగలరు. మనరాజ్యము నీశత్రుసైన్యముల బారినుండి దప్పింప దెరవుగానక విలపించుచుంటిని. నేడు పరాజయము నిక్కము. ఇదియె నా వ్యాకులతకు గారణము" అని వాపోవసాగెను. అంతయు విని యాయువతీమణి "రాజోత్తమా! వెరవకుము. అరిసైన్యములవలన మనకెట్టి భయమును వాటిల్లకుండనొక యుపాయము జెప్పెద. అట్లుచేయుము. అరిసంతతులు నిమిషమాత్రమున మనకు వశులయ్యెదరు. తూర్పుదెసనున్న పురప్రాకారమున నుపరిభాగమున నొకశిలావేదికను నిర్మించి, శత్రుసైన్యములు మన పట్టణమును జుట్టుముట్టినంతనే నన్నా పీఠమున నధిరోహింపజేయుము. రిపుసైన్యముల రెప్పపాటున వెనుకకు మరలింతును." అని వెరవుజెప్పి రాజేశ్వరుని భయము వాపెను. కొంతకాలమునకు రిపుసమూహములు కోలాహలము గావింపుచు పురమును సమీపించెను. కాని వారలకు పురాధీశ్వరుని రణప్రయత్నము లెవ్వియు గన్పింపవయ్యెను. ఒక్కయెడ ప్రాకారకుడ్యముపై నధివసించియున్న

యొక్క యువతీశిరోమణి తక్క యుద్ధభటులెవ్వరును వారి కంటికిం గానబడరైరి. "ఈ యబలయా మనల రణమున మార్కొనునది" యని యా బాలవీరు లచ్చెరువందుచుండ, నింతలో నాసతీమణి యెలుగెత్తి, "బాలయోధులారా! యిటు రండు. మీరలెల్లరును నాయనుంగుబిడ్డలు. నాతోడ ననిసేయ దలంచితిరా? ఇట్టి క్రూరకర్మమును గావింపనేల సాహసింతురు?" అని గేకవెట్టెను. క్షత్రియకుమారు లామె పలుకులు విని క్రుద్ధులై "ఓ యబలా! నీవెవ్వతెవు? మేము నీకు తనయుల మెట్లైతిమి" అని గద్దించిరి. "నానుడులనృతములుగాదు. మీకు సంశయముగలదేని మీవదనముల బైకెత్తి యాననముల దెరువుడు" అని పల్కుచు నామె తనకరద్వయముచే దన కుచపాళి నంట నామెదుగ్ధములు సహస్రధారలై యారసపుత్రి వీరుల వదన గహ్వరముల వర్షించెను. అంతట నాసమగవీరులు నివ్వెరపాటొంది సందియమువాసి యామెను దమ ప్రియజననిగా నెఱింగి హస్తమున దాల్చిన రణోపకరణముల నేలబడవైచి యామెకు ప్రణమిల్లి సమరమును విరమించిరి. పిమ్మట నీయుభయ రాజ్యములకును సంధియయ్యెను. ఉభయరాజ్యాధీశ్వరులును అర్హతులై చిరస్మరణీయులైరి. వీరి జ్ఞాపకార్థమై కట్టింపబడిన స్తూపములు నేటికిని కాననగును. ఇది పూర్వయుగము నాటి వృత్తాంతము. ఆయుగ మంతరించి నవ్యయుగారంభమైనంతనే శాక్యసింహుం డవతరించెను. ఈతడు విరాగియై బుద్ధత్వము నొందిన వెనుక నొకనాడు తనశిష్యులతో నీప్రాంతమున సంచరించుచు నీప్రదేశమును జూపి "పూర్వయుగమున శస్త్రసన్యాసముగావింపబడిన దిచ్చోటనే" యని చెప్పెను. ఇత్తెరంగున నిచ్చటిజను లీ వృత్తాంతము నెరింగి యిచ్చోట నొనాస్తూపమును నిర్మించిరి. ఇందువలననే యీస్తూపమునకు "విసర్జనశస్త్ర" స్తూపమను నామధేయము గల్గెను (శస్త్రవిసర్జన మొనర్చితావున గట్టబడిన దగుటచే). ఈవీరసహస్రమే భద్రకల్పమున + నవతరించిన బుద్ధసహస్రము.



శాక్యసింహు డానందునికి దన నిర్యాణాగమనవృత్తాంతమును జెప్పిన దీశస్త్రసన్యాసస్తూప సమీపప్రాంతమున నడచుచుండగనే ఆ వాడు గౌతముం డానందుని బ్రక్కకుబిలిచి "ఆనందా! నేనింక మూడుమాసములలో నీతనువు త్యజింపబోవుచుంటిని సుమా" యని చెప్పెను. పిశాచలోకాధిపతియగు మారుని* ప్రభావమునకు గట్టువడి యానందు డాతరుణమున

+ తాపసుల వతరించిన కల్పము. సహస్రబుద్ధులును భూవలయమున నుద్భవించునదీకల్పమునసే. అందువలననే యీ యుగమున కీనామము కల్గినది. ప్రకృతము నడచుచున్నది భద్రకల్పమే. ఈయుగమున నల్వురుబుద్ధులింతకుమున్నె యుదయించిరి. ఈ కల్పపరిమాణ మిరువదిమూడుకోట్ల యిరువది నాలుగులక్షల హాయనములు. ఈకల్ప మాగంభమై యిప్పటికి పదికోట్ల నూరువేల సంవత్సరములైనది.

* ఈతడు బౌద్ధపురాణగాథలందు వర్ణింపబడిన మృత్యుదేవుడు. సుగుణశీలములకు ప్రబలవైరి. కామక్రోధమోహమదమాత్సర్యములీతని బంటులు. "కామధాతు" పర్వతాగ్రమునందు "పరనిర్మితవశవర్తినీ" స్వర్గమీతని యావాసము. ఈతడు వికృతాకారములదాల్చి తాపసుల తపోనిష్ఠలం బాడుచేయుచుండును. వారలకు తపోభంగమొనర్చ రండని సర్వాంగసుందరులగు యువతీజనులగూడ వారిచెంతకంపుచుండును. ఈతడు గజవాహనారూఢుడనియు, శతబాహుండనియు బౌద్ధగ్రంథములందు వర్ణింపబడెను.

నిర్జీవప్రతిమవలె చైతన్యవిహీనుడై పోవుటచే "నింక కొంత కాలము భూవలయమున నుండు"మని బుద్ధుని వేడుకొనుటకైన నాతనికి నోరుగాదయ్యెను.

ఈ ప్రదేశమునకు దూర్పుదెసగా నొక యారమైలు దూరమున నింకొక స్తూపముగలదు. ఇయ్యది ద్వితీయబౌద్ధమత మహాసభ * గావింపబడిన స్థలమున గట్టబడిన స్తూపము. మున్నొకమారు, (గౌతముడు నిర్వాణమునొందిన యొక శతాబ్దమునకు) బౌద్ధభిక్షువులకొక మీమాంస గల్గెను. వైశాలీ

* ఈసభ బౌద్ధమతచారిత్రమున మిగుల ప్రాముఖ్యమైనది. శాక్యసింహుడు నిర్వాణము నొందినకొలదికాలమునకు క్రీ.పూ. 410వ సంవత్సర ప్రాంతమున, రాజగృహపట్టణమున కాశ్యపుని యాజమాన్యమున ప్రథమబౌద్ధమతమహాసభ జరిగెను. ద్వితీయమహాసభావృత్తాంతము ఫాహియా నిచ్చట వర్ణించియున్నాడు. ఇయ్యది వైశాలీనగరమున క్రీ.పూ. 300 సంవత్సరప్రాంతమున సమావేశమయ్యెను. ఈరెండు సభలును శిక్షణనియమముల బరిశీలించుటకే గావింపబడినవి. శిక్షణనియమము లత్యంతకాఠిన్యముగ నుండుటచే నాచరణయోగ్యములు గాకున్నవని కొందరు భిక్షువులు వానిని దూర్పెంచిరి. అట్టి భిక్షువుల ప్రయత్నములు శాస్త్రసమ్మతములా యని నిర్ణయించుటకై, యీ సభలు సమకూర్పబడెను. ఈ సభల సమక్షమున నా భిక్షువుల జతనములు శాస్త్రవిరుద్ధములని ఖండింపబడెను. నియమములు మరల యథాస్థితిని నిలుపబడెను. ద్వితీయమహాసభాసంధానకర్తవు, ఆనందుని ప్రియశిష్యుడగు "సౌగకఘుతుడు." ఈతడప్పటికి మిక్కిలి వృద్ధుడై యుండవలెను.



నగరమున నివసించు శ్రమణకులు కొందరు శిక్షణనియమముల నతిక్రమించి శాక్యసింహుని వచనానుసరణి, నట్లు ప్రవర్తిల్లితిమని తమ యాచరణ విధానమును సమర్థించుకొన జొచ్చిరి. అంతట వీరియాచరణ, నియమబద్ధమాయను, విషయమును బరిష్కరించుటకై ఏడువందల బౌద్ధసన్యాసులిక్షేత్రమున సమావేశమై వినయపీఠకగ్రంథముల బరిశీలింపదొడగిరి. పిమ్మట నీస్థానమున నొక స్తూపము నిర్మింపబడెను. అది నేటికిని గలదు.

# ఇరువదియారవ ప్రకరణము

—o—

## ఆనందుని యద్భుత మరణము

పిమ్మట మనపాంథు లించ్ఛోటువీడి వైశాలీనగరమునకు నాలుగుయోజనముల దూరముననున్న పంచవేణీసంగమ తీరమునం♦ దర్శించిరి. ఆనందుడు తన దేహమును వైశాలీనగరమున జాలింపనెంచి మగధరాజ్యమునుండి పయనమై పోవుచుండ తద్రాజ్యనృపతియగు నజాతశత్రుడు * అమరులవలన నావార్త నెఱింగి పరుగు పరుగున తన దివ్యస్యందనమెక్కి సైనికబలముల వెంటగొని యాతని వెన్నాడుచు నీసంగమస్థానమును జేరెను. ఇంతలో వైశాలీనగరమును బాలించు లిచ్ఛవీవంశనృపాలురును ఆనందుడు తమనగరి కేతెంచుచుండె నను సంతోషవార్తవిని ససంభ్రమమున కోలాహల మొనర్చుచు మహావైభవముతో నాతని కెదురేగిరి. ఉభయ రాజ్య నృపులు నీనదీతటమున తారసిల్లిరి. ఆనందునకు మహాసందిగ్ధతరుణమేతెంచెను. ముందునకు సాగిపోయిన అజాతశత్రు డాగ్రహిం

♦ ఈప్రదేశ మెద్దియో యిప్పటికిని గుర్తింపబడలేదు. ఇయ్యది పాటలీపుత్రమున కనతిదూరమున నుండియుండవలెను.

* మగధ రాజ్యాధీశ్వరుడగు బింబిసారనృపాలునితనయుడు. బౌద్ధమతదీక్ష బుచ్చుకొనిన నృపసత్తములలో ప్రథముడు. రాజ్యతృష్ణాపరుడై యాతడు తనజనకుని దుదముట్టించి సింహాసన మధిష్ఠించెను. తొలుత శాక్యసింహునియెడ వైరుధ్యమును దేవదత్తునియెడ స్నేహమును బాటించెను. బౌద్ధమతమును స్వీకరించిన పిమ్మట గౌతమునకు భృత్యుడై దానశీలుడై పేరుమోగెను.

చును. వెనుకకు మరలివచ్చిన లిచ్ఛవీనృపులు కినుకదాల్తురు. అందుచే నానందుని కేమియు దోచక యాచెంతనే ప్రవహించుచున్న నదీజలముల బ్రవేశించి యుత్తరంగిణీమధ్యమున నగ్నిసమాధి♦ జొచ్చి దివ్యపథమున కేగెను. అతడు తనదేహమును రెండుతునియలు జేసి యుత్తరతీరమున నొకఖండమును దక్షిణపు టొడ్డున నొకశకలమును విడచెను. మగధవైశాలీ రాజ్యనృపులీ యర్ధభాగముల దమరాజ్యములకు గొనిపోయి వానిపై స్తూపముల నిర్మించిరి.

---

♦ ఇచ్చట నగ్ని సమాధియననేమొ స్పష్టముగ దెలియవచ్చుటలేదు. అగ్నికీలలకు దేహమునాహుతియొనర్చి కైవల్యము జేరుట యని యర్థమైయుండనోపు. తరంగిణీమధ్యమున నగ్నిసమాధి యెట్లుజేరెనో యూహింపరాకున్నది. ఆనందుడట్లు అనలసమాధిజొచ్చి పిమ్మట నగ్నిదగ్ధమైన తనదేహశిథిలములను రెండుభాగములుగ జేసి యొకభాగము నుత్తరతీరమునను తక్కటిభాగమును దక్షిణపు టొడ్డునను విడచెనని మనయాత్రికుని భావమై యుండనోపు.

# ఇరువది యేడవ ప్రకరణము

—————:o:—————

## పాటలీ పుత్రము.

ఇచ్చోట నుండి మన పాంథులు పంచవేణీసంగమమును దాటి దక్షిణముగా మరలి, యచ్చటికొక యోజనము దూరమున నున్న పాటలీపుత్రమును దర్శించిరి. పాటలీ పుత్రము మగధరాజ్యమునకు రాజధాని నగరము. అశోకసార్వభౌముడు రాజ్యమేలినచోటు. ఈపురమధ్యమున విలసిల్లు రాజభవనము పిశాచ నిర్మితము. అశోకమహీపాలుడు పిశాచముల రావించి వారలచే నీదివ్య సౌధమును గట్టించెను. పిశాచగణ మత్యంతభారమగు గండశిలల దెచ్చి యొకదానిపై నొకటి బేర్చి యున్నతములగు కుడ్యముల నిర్మించి యీసౌధమును గూర్చెను. ఇయ్యది అత్యంత రమణీయముగ నున్నది. అందు మనుజమాత్రుల కలవిగాని శిల్పచిత్రములు ప్రదర్శింపబడి యున్నవి. ఈకట్టడము చాల పురాతననిర్మితమయ్యును దానిసొంపావంతయు దరుగలేదు. నేటికిని సొబగులీనుచున్నది.

అశోక చక్రవర్తి కొక సోదరుడు కలడు. ఈతడు విరాగియై యర్హత్వము నొంది ఏకాంతమున గృధ్రకూట పర్వతోపరిభాగమున నివసించుచుండెను.♦

♦ పూర్వ మీపర్వతమున దపమాచరించుకొనుచున్న యానందుని యేకాగ్రతకు భంగము గల్పించుటకై మారుడు గృధ్రరూపమును దాల్చి యానగాగ్రమున వ్రాలుటచే దీని కీనామము గల్గెనని బౌద్ధపురాణగాథలందు వర్ణింపబడినది. ఇయ్యది రాజగృహ పట్టణసమీపమున నున్నది. ఈపర్వతరాజము పెక్కు గుహావళులచే వలరారుచు ననేక ఋషిసత్తముల కావాసనీ

అశోకుం డీతనియెడ మిగుల ననురాగ పూరితుండై, యాతనికడకు బోయి "సోదరా! నీకెట్టి కొరతయు వాటిల్లకుండ నీవుకోరు వస్తుచయమునెల్ల సమకూర్తును. పాటలీపుత్రమునకు జనుదెంచి నాసౌధమున వసియింపుము. నేను మిగుల సంతసింతును. ఈ రానేలనుండ నేల?" యని తన తమ్ముని బలు తెరంగుల బ్రతిమాలుకొనెను. కాని ప్రశాంతములై జనశూన్యములై యేకాంతములగు పర్వతసీమలనుండ నభిలషించు నాసాధుపుంగవుడు జనసంకీర్ణమగు రాచనగరికి బోవ సమ్మతింపడయ్యెను. అంతట నృపాలుడు "వలయునేడ నానగరి మధ్యముననే నీకొక నిర్మానుష్యమగు పర్వతమును నిర్మింతును. దయగొని నా యాహ్వాన మంగీకరింపు" మని మరల నాతని బ్రార్థించెను. ఆతని పలుకులవిని యారాచతపసి విభ్రాంతుడై "యీతడు పురమధ్యమున పర్వతమెట్లు నిర్మింపగలడు! అయిన నీతని సామర్థ్యమును బరిశీలించెదగాక" యని తలంచి యాతడు వల్లెయనెను. అశోకుడంతట సంతోషమున నరుగజేరి యొక గొప్ప విందునకు గావలయు సామాగ్రినంతయు సమర్చి తనభూతగణముల నెల్లబిలువనంపి "భూతములారా! రేపు మీకెల్లరకును విందుజేయ దలచితిని. మిమ్ములందర నాసీనుల జేయుటకు నాసౌధమున నుచితములగు పీఠములు గానరావు. మీయాసనముల మీరలే తెచ్చుకొం"డని యానతిచ్చెను. వాని యాజ్ఞానుసారము మరునాడు భూతములన్నియు నాలుగయిదు బారల చతురము గల్గిన గండశిలల తమవెంటగొని విందుగుడువ వచ్చెను. విందు ముగిసినపిమ్మట నృపుడాశిలలనన్నియు నొకదానిపై నొకటి పేర్చి

యొక పర్వతమును నిర్మించి దానియధోభాగమున ముప్పది యడుగుల పొడవును నిరువది యడుగుల వెడల్పును పదియడుగుల యున్నతియుగల్గిన యొకవిశాలమందిరమును గట్టుడని యసురల నాభూతముల నాజ్ఞాపించెను. నిముసమాత్రమున నా భూతములు నృపుడుచెప్పినట్టు శైలమునునిర్మించి వెడలిపోయెను.

పూర్వ మీ నగరమున "రాధస్వామి"* యను బ్రాహ్మణుడొకడు నివసించుచుండెడివాడు. ఈవిప్రుడు మహాయానశాఖనుజెందిన వాడు. చాల తెలిసినవాడు. విద్యాసంపన్నుడు. మహాజ్ఞాని. సుగుణశీలుడు. దీర్ఘదర్శి. ఈ రాజ్యమేలున్న పాలుఁడీతని గురుతుల్యునిగ భావించి యమితమర్యాదలనొసంగి పూజించు చుండును. ఈతని క్షేమముల నరయుటకై నితని కడకు బోయినపుడెల్లమహీధవుఁడీబ్రాహ్మణునిసరసఁగూర్చుండ సాహసింపఁడు. వాత్సల్యమున రాజీతని కరమును స్పృశించెనేని వెంటనే యా విప్రుఁ డుదకముతో దనహస్తమును గడిగికొనును. ఈతని కేబదేండ్ల ప్రాయముండును. ఈ రాజ్యమున గల జనులెల్లరును యీవిప్రవర్యునికి జోహారులొనర్తురు. ఈ ద్విజశ్రేష్ఠుని మూలముననే యీప్రాంతమున బౌద్ధమతము చాలవ్యాప్తినొందెను. ఈతనిజూచి మతాంతరులు బౌద్ధభిక్షువులబీడింప వెరతురు.

అశోకసార్వభౌమునిచే నిర్మింపబడిన స్తూపమునకు దాపున విశాలమై యత్యంతరమణీయమగు సంఘారామ మొకటి

* ఈతనికి "రైవతు"డను నామాంతరము కలదు.



లదు. ఇయ్యది మహాయానుల నివాసార్థమై కట్టింపబడిన ...ద్ధమఠము. దీనిచెంతనే నొకహీనయానమఠముగూడ గలదు. ...రెంటియందును నివసించెడు బౌద్ధసన్న్యాసు లారేడువందలకు ...గా నుందురు. అందరును వినయశీలురు. గంభీరవర్తనులు. ...రినిజూచిన యానందము తరంగితమగును. ఇచ్చటి శిక్షణ యమములు, విద్యాదానమునకై ప్రతిష్ఠింపబడిన యిచ్చటి ...ఠశాలలు ♦ అత్యంతదర్శనీయములు. ఉత్తమశ్రమణకులును, ...ద్యాతురులును, వేదాంతరహస్యముల దెలిసికొనగోరు సన్న్యా...లును వివిధ ప్రాంతములనుండి యెడతెరపిలేక యీమహాయానమఠమును దర్శించు పోవుచుందురు.

ఇచ్చటి మహాయానవిహారమున మంజుశ్రీ యను నొక బ్రాహ్మణోత్తముడు గలడు. ఈరాజ్యమునగల శ్రమణకులును మహాయానభిక్షువులునుయీపండితవర్యునిమిగుల బూజింతురు.

మధ్యభారతమునంగల రాజ్యములలోని పట్టణముల లోకెల్ల నీమగధరాజ్యమునందలిపట్టణము లత్యంతవిశాలమైనవి. అందు నివసించు ప్రజాళి మిగుల ధనాఢ్యులు. కారుణ్యహృదయులు. ధర్మనిరతులు. దానశీలురు. ఈప్రాంతవాసులు ప్రతి వత్సరమును వైశాఖమాస అష్టమీ దివసమున విగ్రహ మహోత్సవములు సల్పెదరు. ఆనా డైదంతరముల రథము నొకదాని నాయత్తమొనర్చి దానిని నేత్రపర్వముగ నలంకరించి పురవీధుల వెంట నత్యంతకోలాహలముతో నూరే

♦ బౌద్ధమఠములు విద్యావ్యాప్తికైకూడ జాల తోడ్పడుచుండెడివి.

గింతురు. ఇత్యాది యిరువది యడుగుల యున్నతిగల్గి యాకారమున నొక స్తూపమును బోలియుండును. మనోహరములగు చిత్తరువులచేనలరారుచు, చీనాంశుకమువలె నిగనిగల జిమ్ము నొక ధవళ కాశ్మీరాంబరమును యీరథోపరిభాగమున బరచెదరు. సువర్ణరజతనిర్మితములై, మరకతమణిస్థగితములై కన్నుల మిరుమిట్లు గొల్పు ననిమిషవిగ్రహముల నీ రథాంతర్భాగమున నుంచి వాని శిరోతలమున చీనాంబరముల చాందినీ గట్టెదరు. రథమునకు నాల్గువైపులను నాల్గు ప్రతిమాస్థానములు గలవు. అందు బుద్ధ బోధసత్త్వుల విగ్రహములు ప్రదర్శింపబడినవి. బుద్ధు డాసీనుడై యుండినట్లును బోధసత్త్వు డాతనికి కైవారములు సల్పుచున్నట్లును, ఈమూర్తులు రమణీయముగ జిత్రింపబడినవి రథపార్శ్వమందు విరివిగ పతాకములు గట్టబడినవి. ఇట్టి రథము లీరాజ్యమున పలుప్రాంతములనుండి బయలుదేరును. ఆనాడీరాష్ట్రమున మొత్తమున నిరువది స్యందనములు బయల్వెడలును. అన్నియు నన్నియాకృతులుగ నుండును. ఒకదాని బోలియొకటి యుండదు. ఆనాడీ రాజ్యమంతయు కోలాహలముగనుండును. ఆయాపరిసరముల వసియించు బౌద్ధభిక్షువులును, తక్కటి ప్రజాసంతతులును, నాటి రథోత్సవముల నవలోకించుట కాసమీప ప్రాంతములకు బయనమైపోయెదరు. ఉత్సవములు జరుగు ప్రదేశములన్నియు నానాడు జనసంకీర్ణమై క్రిక్కిరిసిపోవును. రథోత్సవసమయమున గానకళావిశారదు లొకవంక గీతముల బాడుచుందురు. వీణామృదంగాదిరవము లొకమూల చె



లగుచుండును. ఒక్కయెడ భక్తిపరులు సుగంధపుష్పమాలికల రథారూఢుడై యున్న బుద్ధభగవానుని కర్పించుటకై త్రొక్కిలాడుచుందురు. రాత్రివేళ రథప్రదేశ మంతయు దీపపు కాంతులచే గనులపండువ సేయుచుండును. ఆయా పురముల నివసించు బ్రాహ్మణులు రథోత్సవముల నవలోకింప రండని బౌద్ధభిక్షువుల బిలచెదరు. భిక్షువులు బారులుగట్టి రథభూమికి నడచిపోయి, యుత్సవములు సమాప్తియగువరకు నందే యుండెదరు. ఇట్టి రథోత్సవము లార్యావర్తమున నెల్ల తావులందును జరుగుచుండును.

ఈ ప్రాంతమందలి ప్రతిపట్టణమునను, పురప్రముఖులచే నిర్మింపబడిన ఔషధాలయములుగలవు. రోగపీడితులకచ్చట నౌషధము లుచితముగ నొసంగబడును. అచ్చటగల నిరుపేదలకును, దీనులకును, వ్యాధిగ్రస్తులకును, వికలాంగులకును, పతివిహీనులకు నియ్యవి శరణ్యములు. వారికచ్చట సర్వసౌకర్యములును నొనగూర్పబడును. రోగముల బరిశీలించి వారికివైద్యులౌషధచికిత్స జేయుచుందురు. రోగులకిందే యన్నపానీయములుగూడ నొసంగబడును. చికిత్సనంది స్వస్థులైన పిదప వారలు తమతమ యావాసములకు వెడలిపోవుచుందురు.

అశోకసార్వభౌముడు పురాతన నిర్మితములగు సప్త స్తూపములను బడగొట్టించి వాని స్థానమున బ్రతిష్ఠించిన స్తూపసహస్రమున ప్రథమనిర్మితమగు స్తూపరాజమీ పాటలీపుత్ర పట్టణ సమీపముననే యీ పురమునకు దక్షిణపార్శ్వమున నొక యరమైలు దూరమున నున్నది. దీనిముంగిటనే బుద్ధునిపద

చిహ్న మొకటిగలదు. అచ్చోట నొక విహారము నిర్మింపబడి నది. ఈ విహారమునకు దక్షిణభాగమున బదునైదడుగుల కైవారముగల్గి, ముప్పది యడుగుల యున్నతిగల్గిన బ్రహ్మాండ మగు శిలాస్తంభ మొకటి గలదు. దీని శిరోభాగమున నొక ఱాతి ఫలకముపై నిట్లు లిఖయింపబడియున్నది. "అశోక సార్వ భౌముడీ జంబూద్వీపము నెల్ల బౌద్ధభిక్షువులకు ధారవోసి అశే షధనరాసుల వారికొసగి మరల దాని బ్రతిగ్రహించెను."* ఇట్లాతడు ముమ్మారు ధారవోసెను.

పైనుడివిన స్తూపమున కుత్తరముగ నాల్గయిదువందల బారల దూరమున అశోకచక్రవర్తిచే నిర్మింపబడిన 'నిలి'♦ నగరము గలదు. ఈ పురమునగూడ నొక శిలాస్తంభము నిర్మింపబడియున్నది. ఇయ్యదియు ముప్పదియడుగుల నిడివి గల్గి మేఘమండలము నొరయుచున్నది. దీని యగ్రభాగమున నొక సింహావిగ్రహము జిత్రింపబడియున్నది. 'నిలి'నగరనిర్మాణ వృత్తాంతమును సవిస్తరముగ వర్ణించు శిలాలేఖన మొకటి యీ స్తంభమున గానవగును. అందీనగరనిర్మాణమునకు గారణములును, అయ్యది నిర్మాణమైన తిథి, వార, సంవత్సర ములును వివరింపబడియున్నవి.

---

* ఫాహియాను డీశిలాలేఖనవృత్తాంత మింక కొంతవిపులముగ వ్రాసి [illegible]సినచో అశోకు డీపృథ్వీతలమున కెంతధర వెట్టెనో తెలిసి యుండెడిది.

♦ ఈనగరమెచ్చట విలసిల్లెనో తెలియవచ్చుటలేదు. ఇయ్యది పాటలీపుత్రనగర సంరక్షణార్థమై సైన్యముల నిల్పుటకై సరిహద్దు ప్రాంతమున నశోకసార్వభౌమునిచే నిర్మింపబడిన చిన్నపట్టణమై యుండనోపు.

# ఇరువది యెనిమిదవ ప్రకరణము

## రాజగృహ పట్టణము.

పాటలీపుత్రమునుండి బయలుదేరి మనపాంథు లాగ్నేయ దిశాభిముఖులై తొమ్మిది యోజనములు ప్రయాణమొనర్చి కతిపయదినముల కొకానొక క్షుద్రశైలమును ♦ సమీపించిరి. ఈ పర్వతాగ్రమున దక్షిణాభిముఖముగనుండు నొక శిలాగహ్వరము గలదు. అమరవిభునిచే నింద్రలోకమునుండి కొనిరాబడిన యనిమిషగాయకుడు "పంచశిఖుడు" విపంచీస్వరముల మీటుచు వీణాగానమొనర్చుచుండ శాక్యసింహు డానందసాగరమున దేలియాడుచు గూర్చుండిన దిచ్చోటనే. ఈతరుణముననే శక్రుడు నలువదిరెండు మహావిషయముల గూర్చి బుద్ధుని బ్రశ్నించెను. శాక్యసింహు డీ ప్రశ్నలన్ని

---

♦ యువానుచ్వాంగు దీనికి "యింద్రసీల గుహ" యని పేర్కొని యున్నాడు. ఇయ్యది గయాక్షేత్రమునకు ముప్పదియారు మైళ్ళదూరమున "పంచానన" నదీతటమున "గిర్యకు" గ్రామసమీపముననున్న పర్వతరాజమని గుర్తింపబడినది. ఈ గిరిశిఖరములు నదీజలములపై వ్రాలి యాపంచానన నదీకన్యను ముద్దాడ బోవుచున్నవో యనునట్లు భ్రమగొల్పుచున్నవి. వీనిలో నున్నత శృంగమునే ఫాహియాను డిచ్చట వర్ణించి యున్నాడు. ఈ శృంగోపరిభాగమున పెక్కు మందిరశిథిలములు గాన్పించుచున్నవి. పూర్వమిచ్చట నొక సుందర విహార ముండియుండవలెను.

టికిని దనవ్రేలితో నాచెంతనున్న గండశిలపై నుత్తరువులు* వ్రాసెను. ఈవ్రాసిన యానవాళ్లీప్రదేశమునని్ంకనుగాన్పించుచుండును. ఇచ్చోటనిప్పుడొక సంఘారామము గట్టబడియున్నది.

ఈ ప్రదేశమునకు నైరుతి భాగమున నొక్క యోజనముదూరమున "నలందా"+యను పట్టణమొకటి గలదు. ఇయ్యది సారిపుత్రుని జన్మస్థానము. తుదకాత డిచ్చోటికే తిరిగివచ్చి నిర్యాణము నొందెను. ఆతని దేహ మగ్నిసంస్కారము గావింపబడినచోట నేడొక స్తూపము నిర్మింపబడియున్నది.

నలందానుండి పశ్చిమముగ నొక్క యోజన మరిగినచో, మగధరాజ్యనృపులకు రాజధానీనగరమగు రాజగృహ ♦ పట్టణము గాననగును. ఇయ్యది నవీనరాజగృహము. దీనినజాతశత్రుడునిర్మించెను. ఇందు బౌద్ధమఠములు

---

* ఇయ్యవి "శక్రప్రశ్నసూత్ర" మున "డిక్" సంగమున నివసింపబడియున్నవి.

\+ వర్తమానబర్గాంగు పట్టణము. ఇటీవల నిచ్చట నొక బౌద్ధమఠము నిర్మింపబడెను. హర్షవర్ధనుని రాజ్యకాలమున భారతభూమిని దర్శింపవచ్చిన యువాన్ చ్వాంగీపట్టణమున నైదేండ్లు నివసించెను.

♦ "రాజభవనములచే విలసిల్లు" నగరము. మగధరాజ్యనృపులకు రాజధానీపట్టణము. ఇయ్యది గృధ్రకూటపర్వతముచెంత నున్నది. బౌద్ధమతమునకియ్యది ప్రధానదుర్గము. శాక్యసింహుడు నిర్వాణమొందిన యొక్క వత్సరమున కచ్చట నొక బౌద్ధమహాసభ గావింపబడెను. ఇయ్యదియె "ప్రథమబౌద్ధమహాసభ"యని లోకవిఖ్యాతి గాంచినది. బీహారునకు నైరుతిభాగమున పదునారుమైళ్ళ దూరమునసున్న "రాజగిరు" గ్రామసమీపమున నీపట్టణశిథిలము లిప్పటికిని గాననగును. జైనులకిది మహాపుణ్యక్షేత్రము. ఇచ్చటి కనుదినమును వందలకొలది యాత్రికులు వచ్చుచుబోవుచుందురు.



రెండుగలవు. ఈపురి పశ్చిమద్వారమునకనతిదూరమున మహోన్నతమగుస్తూపమొకటిగలదు. ఇయ్యదియె బుద్ధుని శల్యభాగములపై నజాతుడు కట్టించిన దివ్యస్తూపము. దక్షిణపురద్వారమునకు గొంచెము దక్షిణముగ, సుమారొక్క యర మైలు దూరమున నొకకొండలోయ గలదు. ఈలోయదారి నిబడి కొంతదూర మేగినచో పంచగిరులచే నావరింపబడి వలయాకారముగానుండు విశాలరమణీయప్రదేశ మొకటి గానవచ్చును. ఇయ్యది బింబిసారనృపాలుని రాజధానియగు ప్రాచీన రాజగృహ నగరము విలసిల్లినతావు. చుట్టునుండెడు పర్వతావళులు, ఈ ప్రాచీన నగరమునకు బెట్టనిగోడలై పరిఢవిల్లినవి. ఈ పట్టణము ప్రాక్పశ్చిమముగ నైదు మైలును, ఉత్తర దక్షిణములుగ నేడు మైలును పరిమాణముగల్గి విరాజిల్లినది. సారిపుత్ర మౌద్గల్యాయనులు తొలిసారి "యుపసేనుని" * తారసిల్లిన దిచ్చోటనే. నిర్గ్రంథుడగు ♦ "శ్రీ

---

* తొలుత శాక్యసింహునివలన బౌద్ధదీక్ష గైకొనిన ప్రఖ్యాత శిష్యపంచకములో నొకడు. ఈతనికి "అశ్వజిత్తు"డను నామధేయము గూడగలదు. అశ్వజిత్తనునది సైనికుల కొసంగబడు బిరుదనామము వలెగాన్పించుచున్నది (అశ్వశిక్షకుడు లేక అశ్వపాలకుడు).

♦ ఈతడొక యవధూత సన్యాసి. అష్ట తీర్థకులలో (బౌద్ధమత వైరులగు బ్రాహ్మణులు) ప్రధానుడు. జ్ఞాతవంశమున బుట్టినవాడు. అందుచేతనే యీతడు "నిర్గ్రంథజ్ఞాతి"యని కూడ బిలువబడు చుండువాడు. ఈత డాహార వస్త్రాదుల విసర్జించెను. నిరాహారవ్రతదీక్షచే నింద్రియముల జయింపనగునని యీతని యాశయము. ఈతనికి పెక్కుమంది యనుచరులు గలరు. వీరలందరును జైనమతావలంబుల మూలపురుషులు.

గుప్తు" డగ్ని కుండమును గావించి, యన్నమున విషముగలిపి, బుద్ధుని తనతోడ భుజింపరమ్మని పిలిచినతావును, బుద్ధునకు హాని దలంచి యజాతశత్రుఁడొక నల్లని, యుత్తుంగ మత్తగజ రాజమును కల్లు ద్రావించి, యాతని మీఁది కంపిన * ప్రదేశమును యీ పట్టణముననేగలవు. ఈనగరి కీశాన్యభాగమున నుండు యాంబపాలీవనమున రాజబాట యర్ధచంద్రాకృతిగ వంపు దిరిగిన యొకానొక రమ్యప్రదేశమున జీవకుఁ ♦ డొక సుందర విహారమును నిర్మించి శౌక్యసింహుని నాతని శిష్యగణము+లతో నచ్చటి కాహ్వానించి కానుకలర్పించెను. ఈ ప్రదేశములన్నియు నేటికిని గానవగును. కాని పట్టణమంతయు నేఁడు కాలవాహినిలో గలిసిపోయినది. పాడువడి నిర్మానుష్యమై భీతి గొల్పుచున్నది.

---

* దేవదత్తుని ప్రేరణముచే నీ నృపాలుఁ డిట్టి దారుణమున కొడిగట్టెను. కాని పాప మిప్పుడయినను వీరి మనోరథ మీడేరినది కాదు. ఆ కరీంద్రము బుద్ధుని సమీపించిన తోడనే సాధుశీలయై వినమ్రయయి యాతని మ్రోల మోకరించి జోహారు లొనర్చి వెడలిపోయెను.

♦ అంబపాలికి బింబిసారనృపాలునివలన గలిగిన తనయుఁడు. ఈతఁడు వైద్యశాస్త్ర ప్రావీణ్యుఁడని మిగుల ప్రఖ్యాతిగాంచెను.

\+ ఆతరుణమున బుద్ధునికడ పండ్రెండువందల యేబదిమంది శిష్యు లుండిరని ప్రతీతి.

# ఇరువదితొమ్మిదవ ప్రకరణము

——(:o:)——

## గృధ్రకూటశైలము

పిమ్మట మనపాంథులు ప్రాచీనరాజగృహ పట్టణసమీపముననున్న పర్వతకనుమ జొచ్చి పెక్కు పర్వతశ్రేణులగడచి యెట్టకేలకు పదునైదులీల యున్నతిగల్గిన యొకానొక మహీధ్రమును సమీపించిరి. ఇయ్యదియే గృధ్రకూటమహానగమని ప్రఖ్యాతిగాంచిన శైలరాజము. ఈ పర్వతశృంగమున కొక్క యరమైలు క్రిందుగ బుద్ధభగవానుఁడు తపమాచరించిన శిలాగహ్వరము గలదు. దీని కొక్కింత వాయవ్యభాగమున మరియొక పర్వతగుహ కానబడును. ఆనందుఁ డచ్చట ధ్యానతత్పరుఁడై యుండ నొకనాఁడు మన్మథుఁడు గృధ్రరూపమును దాల్చి యీ కందరమున కెదుట వ్రాలి యాతని వెరపింపఁజొచ్చెను. బుద్ధుఁ డంతట తనదివ్యమహిమవలన నచ్చట రాతిని బీటవారఁజేసి తన హస్తము నా నెరియలో జొప్పించి యానందుని భుజము దట్టి "వెరవకు"మని యాతని భయము వాపెను. ఆ పులుగు యడుగుజాడలును, ఆ శిలారంధ్రమును నేటికిని గాన్పించును. ఈ కారణముననే యీ పర్వతమునకు "గృధ్రకందర పర్వత"మను నామధేయము గల్గెను.

ఈ గుహాముంగిట బుద్ధచతుష్టయము కూర్చుండిన తావులుగలవు. అర్హతులు తపమొనర్చిన గుహలుగూడ నీపర్వతోపరిభాగమున నెన్నియో గలవు.

బుద్ధుడు తన శిలాగహ్వరముముంగిట ధ్యాననిమగ్నుడై యిటునటు దిరుగుచు బచారుచేయుచుండ, నీ పర్వతమున నుత్తరపువైపుననున్న రాలగుట్టల నడుమనుండి దేవదత్తు డాతనిపై నొక పెద్ద ఱాతిబండను విసరెను. అదృష్టవశమున నదితప్పి బుద్ధునిపాదములపై బడెను. ఈ గండశిల* నేటికిని యిచ్చట గాననగును.

మున్నీప్రదేశమున శాక్యసింహుడు బౌద్ధధర్మముల నుపదేశించుటకై కట్టబడిన విశాలమందిర మంతయు నేడు శిథిలమై యంతర్హితమైపోయినది. ఇటుకఱాలతో నిర్మింపబడిన కుడ్యములుమాత్ర మచ్చటచ్చట గాన్పించుచున్నవి. తక్కటి భవనమంతయు రూపుమాసెను.

ఈ గృధ్రకూటశైల మచ్చటగల పర్వతశ్రేణులలోనికెల్లనత్యున్నతమైనది. దీని శిఖరము మరకతమణుల గరగిపోసినట్లు పచ్చని పచ్చికచే గప్పబడి, యాకసమున కెగయుచు ప్రకృతిసౌందర్యమున కాలవాలమై కనులపండువ జేయుచుండును. మనఫాహియాను, నవీనరాజగృహపట్టణమున కుసుమదామములు, తైలము మున్నగు పూజాద్రవ్యముల సేకరించి మార్గమును జూపగల యా ప్రాంతవాసులగు బౌద్ధభిక్షువుల నిరువుర వెంటగొని, గృధ్రకూట పర్వతశిఖరము నధిరోహించి యాగిరిశృంగమునగల పావనక్షేత్రముల సేవింపదొడగెను. ఆ శృంగమునుజూచినంతనే మనపాంథుని కనివార్యమగు

* ఈశిల పదునాలుగడుగుల యెత్తును, ముప్పదియడుగుల కైవారమును గల్గిన యొక మహాశిలయని యూనిచ్వాంగు వర్ణించియున్నాడు.



విచారము గల్గెను. పైకి తరగలై పొరలివచ్చు యశ్రుధారల నాపుకొనుచు నాతడు "మున్ను బుద్ధభగవానుడు సురాంగమసూత్రముల నిచ్చటనే బోధించెను. నే నీ పాపిష్ఠి కాలమున జన్మించుటచే నా మహామహుని గన్నులారగాంచు భాగ్యము నాకు లభింపదయ్యె. ఆతడేగిన పదచిహ్నములను, ఆతడు నివసించిన పవిత్రక్షేత్రములనుమాత్ర మీక్షింప వలసెను" నని దలఁపోయుచు శాక్యసింహుని శిలాగహ్వర ప్రాంగణమున గూర్చుండి సురాంగమసూత్రముల బఠింపజొచ్చెను. అట్లు మన ఫాహియాను డారేయియంతయు నా పర్వతాగ్రముననే గడపి, తెల్లవారినంతనే రాజగృహనగరమునకు మరలిపోయెను.

---

# ముప్పదియవ ప్రకరణము

—•◆•—

### శతపర్ణశిలాగహ్వరము. ఒకానొక బౌద్ధ భిక్షువు ప్రాణత్యాగము.

పిమ్మట మన పాంథు లీ ప్రాచీన రాజగృహ పట్టణమును వీడి తన్నగరమున కుత్తరభాగమున మున్నూరు బారల దూరమున నున్న "కరండ" వేణువనమును ♦ పోయి వీక్షించిరి. అం దొక పురాతన నిర్మితమగు విహారముకలదు. ఈ ప్రాంతమున వసియించు భిక్షువులే యీ విహారమునుదుడిచి నీరముల జల్లుచుండుదురు. దీనికుత్తరమున రెండుమూడు లీల దూరమున మృతశరీరముల బారవేయు *శ్మశానవాటిక కలదు.

---

♦ ఇయ్యది బింబిసార నృపాలునిచే, శాక్యసింహునకు కానుకగ నొసంగబడిన యారామము. ఆనృపవరుడే యిందొక విహారమును గూడ నిర్మించెను. ఒక్కనాడు బింబిసారు డీవనప్రాంతమున నిద్రించుచుండ క్రూరసర్ప మొకటి యాతని గరువబోయెను. ఆ చెంతనే సంచరించుచుండిన యొక కరండమృగ మది జూచి కిచకిచధ్వను లొనర్చి యాతని మేల్కొల్పి యాతని ప్రాణముల గాపాడెను. అందుచేతనే యీ వనవాటికకు "కరందవన" మను నామధేయము గల్గెను.

* మన ఫాహియాను డిచ్చటి అగ్నిసంస్కారవిధిని మాలనాడుచున్నాడు. భూశయన విధానమొక్కటి దక్క యన్యములగు విధానము లెవ్వియు శవసంస్కరణమున కర్హములు కావని యాతని యభిప్రాయము.



ఇచ్చట నుండి పర్వతశ్రేణులనంటి, పశ్చిమముగ మూడువందల బారలదూర మేగినచో కొండలనడుమ నొకానొక పర్వతకందరము గాన్పించును. ఇయ్యదియె "పిప్పల"♦ బిలమనిప్రసిద్ధనొందిన పర్వతగుహ. బుద్ధుడిచ్చటనేయనుదినమును మజ్జన భోజనములొనర్చిన పిదప తపమాచరించుకొనువాడు.

ఇంకను గొంచెము పశ్చిమముగ నొక యరక్రోసు దూర మేగినచో మఱియొక గుహ గానవగును. ఇదియె "శతపర్ణ* గహ్వరము". బౌద్ధమత చారిత్రమున మిగులప్రఖ్యాతి వడసిన గుహారాజము. శాక్యసింహుడు నిర్వాణపదము జేరిన పిమ్మట నైదువందల యర్హతులుగూడి సూత్రముల బరిశీలించిన దిచ్చోటనే. అప్పు డిత్తావున నొక మహాసభ గావింపబడెను. నాటి సభాస్థానమున శోభాయమానముగ నలంకరింపబడిన మూ డున్నతాసనము లమర్పబడెను. వామభాగమున నుంచబడిన పీఠముపై సారిపుత్రు డాసీను డయ్యెను. దక్షిణపార్శ్వ

---

♦ ఈ బిల మొకయశ్వత్థపాదపము క్రిందనుండియుండుటచే దీని కీనామముగల్గియుండవచ్చును. ఫాహియాను డిచ్చట నీ వృక్షమును జేర్కొని యుండలేదు. మన పాంథుడు దర్శించిన కాలమునాటి కీమహీరుహము జీర్ణమైయుండనోపు.

* బౌద్ధచారిత్రమున బ్రఖ్యాతి గన్నచోటు. ఈసభాస్థానమునకై యజాతశత్రుడే యీ గుహను బ్రత్యేకముగ నిర్మించెను. ఇచ్చట నుదహరింపబడిన సందర్భములబట్టి చూచిన సూత్రము లిదివరకే వ్రాయబడినట్లు స్ఫురించుచున్నది.

మున నమర్చబడిన యాసనమును మహామౌద్గల్యాయను డలంకరించెను. సభాధ్యక్షుడగు కాశ్యపుడు మధ్యపీఠముపై నధివసించెను.

ఒక్కరుదక్క తక్కిన యర్హతులందరును విచ్చేసిరి. ఆనందుడు లోనికిరాజాలక మందిరద్వారముకడనే నిలచిపోయెను. * ఇప్పుడిత్తావున నొకస్తూపము నిర్మింపబడియున్నది.

ఈ పర్వతశ్రేణి కిరుకెలంకుల నెక్కడజూచినను అసంఖ్యాకములగు గుహాలు గాన్పించును. ఇవి యన్నియు నర్హతుల యావాసములు. వారలుతపమాచరించిన పుణ్యవాటికలు.

ప్రాచీన రాజగృహ పట్టణపు టుత్తర సరిహద్దులదాటి ప్రాగ్దిశగా నొక్కయరమైలు దూరగ మరిగిన యెడల దేవదత్తుని పర్వతావాసము గానబడును. దీని కొక్కింత దూరమున నలుచదరముగానుండు నల్లని రాతిబండయొకటి కానవచ్చును. దీని చరిత్రము కడువిచిత్రము. మున్నొకమారు బౌద్ధభిక్షు వొక్కడు దీనిపై నెక్కి యటునిటు బచారుచేయుచు నీతీరున దలపోయసాగెను. "ఈ కాయ మస్థిరము. క్షణభంగురము. మిగుమిక్కిలి దుఃఖభాజనము. మాత్సర్యపూరితము. ఇయ్యది ఇనుమంతయైన నియ్యది పవిత్రమగు పదార్థముగాదు. ఈ శరీరము నాకు కడు భారముగ దోచుచున్నది. ఇది నన్నొక పిశాచమువలె బాధించుచున్నది. ఇంక నే నీదేహమును భరింపజాలను"

* సభాస్థలికి రావలదని యాతడవరోధింపబడెనో లేక యాతడే లోనికి బోవ నిచ్చగింపక సభామండపద్వారముకడనే నిలచిపోయెనో దెలియరాకున్నది. అవరోధింపబడినట్లే గోచరించుచున్నది. సభాస్థలికి బోవుటకీత డిచ్చగింప కున్నచో ద్వారముకడ నేలనిలచియుండును?



అని వితర్కించుకొనుచు నా సన్యాసి, యొక దీర్ఘమగు ఛురికను, హస్తమున గీలించి కంఠమును దరుగుకొనబోయి యింతలో నేదియో యాతని మదికి స్ఫురింప యెత్తిన కరవాలమును క్రిందికివాల్చి, "ఆహా నేనెట్టి పాపకృత్యము నొనర్పబూనితిని? బుద్ధభగవాను డాత్మహత్య నిషేధమనిగదా శాసించియున్నాడు", అని కొంతవడి చింతించి "అయినను, నే గావింపబోవుదానిలో దోషమేమిగలదు? అజ్ఞాన, కామ, క్రోధములను చోరత్రయమును వధించుచుంటిని" అనిమరల సమర్థించుకొని హృదయపరివేదన మాపుకొని మరియొకమారు ఖడ్గమును బైకెత్తి కంఠముపయి నునిచి మహాసాహసముతో కుత్తుకను గోసికొనసాగెను. ఆ యసిధార కాతని గళసీమ యందలి రక్తనాళములు తునిగినంతనే యాభిక్షువు శ్రోతపాను డయ్యెను. కుత్తుక సగము తెగినతోడనే "యనాగామిను ♦" డయ్యెను. ఆతని కంఠము సంపూర్ణముగ దెగి నేలపై దుల్లినంతనే యా సన్యాసి యర్హతుడై కైవల్యము నొందెను.

♦ బుద్ధత్వము నొందుటకు నాలుగు సోపానములుగలవు. అందనాగామిని పథము తృతీయ సోపానము. అనాగామినులు జన్మరహితులు, మరల వారికి మనుష్యజన్మలేదు. దేవతలైయొక్కసారిస్వర్గమున జన్మించి యటుపిమ్మట ర్హతులై నిర్వాణపదము జేరెదరు.

# ముప్పది యొకటవ ప్రకరణము

## గయాక్షేత్రము.

ఇచ్చటనుండి మన యాత్రికులు పశ్చిమముగ మరలి తిన్నగ గయాక్షేత్రము♦నకు బయనమై పోయిరి. గయాపట్టణ మంతయు నిప్పుడు శిథిలమై నామమాత్రావశిష్టమై యున్నది. ఈ నగరమునకు దక్షిణభాగముననాలుగుక్రోసుల దూరమున శాక్యసింహుఁడారు దీర్ఘవత్సరము లన్నపానీయముల నెరుఁగక తదేకదీక్షతో ఘోరతప మాచరించిన పవిత్రవాటిక గలదు. ఇత్తావా యొక మహాదరణ్య మధ్యమున నున్నది.

ఇచ్చోటకు బశ్చిమముగ నొక యరక్రోసు దూరమున నొక జలాశయముగలదు. మున్నొకసారి శాక్యసింహుఁ డీతటాకమును జొచ్చి స్నానమొనర్చుచుండ యాతని కాపద సంఘటిల్లెను. నీటిలోబడి యాతడు మునిగిపోవుటకు సిద్ధమయ్యెను. ఆతరుణమున యనిమిషు డొక్కడా గమలాకరముపై వ్రాలి యున్న మహీరుహశాఖ నొక్కదానిని వంచి యాతని కందిచ్చెను. దానిసూతగాగొని బుద్ధుడొడ్డుజేరెను. * ప్రమాదము తప్పెను.

♦ మగధరాజ్యమున ప్రసిద్ధిగన్న యొకనగరరాజము. ఇప్పటి గయాక్షేత్రమునకు వాయవ్యదిశగా నుండునది. శాక్యసింహునకు జ్ఞానోదయమైన చ్చోటనే, బౌద్ధులకిది మహాపుణ్యక్షేత్రము. వేలకొలదియాత్రికు లీ ప్రదేశమును నేటికిని దర్శించి పోవుదురు.

* శాక్యసింహుడు నీటమునిగిపోవుచుండ యనిమిషు డొక్కడాతని ప్రాణములు గాపాడెనని ఫాహియా నిచ్చట సూచించుచున్నాడు.



ఈ సరోవరమున కనతిదూరమున "గ్రామిక"* బాలికలు గొందరు గౌతమ బుద్ధునకు బరమాన్నమిడిన చోటు గలదు. ఈ ప్రదేశమునకు గొంచె ముత్తరముగ నొక పాదపముక్రింద బడియుండు రాతిబండపై నాసీనుడై శాక్యసింహుడాపాయసమును గ్రోలెను. ఈ మహీరుహమును యాగండశిలయు నేటికిని ఇచ్చోట గానవగును. ఈపాషాణఫలకము ఆరనిసుల చతురమును రెండడుగుల యున్నతియు గల్గి స్నిగ్ధమై గడునిగల గ్రుక్కుచున్నది.

మధ్యభారతమున నాతపశీతలము లత్యంత తీక్షణములై దుర్భరములుగాక మృదులములై పోయి గొల్పుచుండుటచే యిచ్చటి వృక్షజాలములు సహస్రవర్షజీవులై వర్థిల్లును. కొన్ని మహీరుహములు పదివేల హాయనములు గూడ జీవించును.

ఇచ్చటికీశాన్యభాగముగ నొక క్రోసు దూరమున పర్వతబిల మొకటి గాన్పించును. మున్నొకమారు, బుద్ధుడు బోధిసత్త్వుడై యుండినకాలమున నీగుహ లోనికేగి పశ్చిమాభిముఖుడై కూర్చుండి తనలో తా నిట్లుచింతింపసాగెను. "నిక్కముగ నాకు బుద్ధత్వము సిద్ధించునేని యయ్యది యొక యద్భుతసంభవము వలన నే డిచ్చట ఋజువు గావలయు" నని పల్కునంతలో నొక శరీరచ్ఛాయ మూడడుగుల పరిమాణము గల్గినది కాంతిపుంజముల వెదజల్లుచు యాగుహా కుడ్యముపై

* సంసారముల పరిత్యజింపనివారు.

ప్రదర్శితమై వినీలాకాశమున గన్పట్టు తొలకరితీవవలె మెరయ జొచ్చెను.

ఈ శరీరచ్ఛాయ నేటికిని యత్యంత తేజోవంతమై యీ గుహాంతర్భాగమున కుడ్యముపై గాన్పించుచుండును. ఆతరుణమున భూనభోంతరాళములు కంపించెను. అంతటనాకసమునుండి "బోధిసత్వమా! నీవు బుద్ధత్వము నొందుతావిక్కియ్యదికాదు. మున్నెవ్వరును యిచ్చోట బుద్ధత్వము నొందలేదు. ముందెవరును బొందజాలరు. నీకు జ్ఞానోదయమగు ప్రదేశ మిచ్చటికి నైరుతి దిశగా నొక యర్ధయోజనము దూరమున అల్లదె యాఖర్జూర* వృక్ష సమీపమున నున్నది. అచ్చటికి బొమ్ము" అను శబ్దములు వినవచ్చెను. ఈ శబ్దములతోడనే దేవతలు నింగినుండి భూవలయమునకు దిగి మృదుమధురస్వరములతో గానమొనర్చుచు నాప్రదేశమునకు దారిజూపసాగిరి. బోధిసత్త్వుడును వారివెనువెంటనే నడువదొడగెను. ఆతృణపాదప మింకను కనుచూపుమేరదూరమున నుండగనె యానిర్జరులు పిడికెడుకుశల వానిహస్తమున నుంచి యదృశ్యులైరి. పిమ్మట పచ్చని విహంగశ్రేణి వానికెదురై బారులుగట్టి యాతనిచుట్టును ముమ్మారు ప్రదక్షిణమొనర్చి దివ్వున నెగిరిపోయెను. ఇట్లు బోధిసత్త్వుడు ఖర్జూరపాదపమును సమీపించి, యామరు లొసగిన దర్భపోచల నాజెట్టుమొదటనుంచి తూర్పుదిక్కు మొగంబై యామహీ

*ఫాహియాను దీనిని "పత్రపాదప" మని పేర్కొనియున్నాడు. దానిపర్ణము లెన్నడును వాడి రాలిపోకుంటచే నీవృక్షమున కీనామము గల్గినది.



రుహముక్రింద నాసీనుడయ్యెను. పిశాచప్రభుడగు మారుడు బుద్ధునకు తపోభంగమొనర్ప రండని కుసుమకోమలగాత్రులగు ముగ్గుర యువతీమణుల వానిచెంతకంపి దానును తనభటసందోహముతో వారివెంట బయలుదేరెను. వారినిజూచి బోధిసత్త్వుడు తన చరణాంగుళులతోడ పుడమిని స్పర్శించెను. త్రుటిలో యమకింకరులు పరుగువారిరి. ఆ నెలజవ్వనులు వృద్ధాంగనలైరి.

ఆరువత్సరములట్లు శాక్యసింహుడు కఠినతపమొనర్చిన యీ పావనక్షేత్రమునను, తక్కిన తావులందును స్తూపములు నిర్మింపబడియున్నవి. విగ్రహములు ప్రతిష్ఠింపబడినవి.

శాక్యసింహుడు జ్ఞానపరిపూర్ణుడైన పిదప నేడహోరాత్రములు బోధిద్రుమమును ధ్యానించి విముక్తి♦ సౌఖ్యమును బడసినచోటను; ఖర్జూరతరువుక్రింద నీత డేడుదినములిటునటు దిరుగుచు బచారు జేసిన తావునను; నిర్జరులు సప్తమణివిరాజితమగు నొక సుందరమందిరమును సృజియించి యందు బుద్ధున కేడురోజులు పూజలొనర్చిన ప్రదేశమునను; సర్పరేడగు "మహాముచిలిండడు"*సూర్యకిరణములు బుద్ధునిపై ప్రసరింపకుండ దన శరీరము నాతనిచుట్టును జుట్టి తనవిశాలఫణ

♦ సంసారబంధనములనుండి,

* శాక్యసింహునకు జ్ఞానోదయమైన ప్రదేశమునకు దాపుననున్న జలాశయమున నివసించు యొక నాగరేడు ఈ కమలాకరతీరమున గౌతముడు ధ్యానసమాధిలో మున్గియుండ నీ పాపరేడాతని కెండదగులకుండ గాపాడెనని జాతకకథలలో వర్ణింపబడియున్నది.

బడకుండ దన శరీరము నాతనిచుట్టును జుట్టి తనవిశాలఫణమును ఆతని శిరోతలమున విప్పి యేడుదినములాతని కఖండసేవ లొనర్చిన స్థలమునందును; బుద్ధుడు ప్రాగ్దిశాభిముఖుడై యొక మఱ్ఱిచెట్టునీడ నున్నరాతిశిలపై నాసీనుడైయుండ బౌద్ధమతసార మెరిగింపుమని బ్రహ్మదేవు డాతని బ్రార్థించిన స్థానమునను,* నలువు రనిమిషనాథులు స్వర్గలోకమునుండి మరకత శిలా నిర్మితములగు కతుపాలలదెచ్చి బుద్ధునకొసంగిన ♦ పుణ్యసీమయందున, వణిజులు గౌతమునకు మధుపిష్టమును దెచ్చి యిచ్చిన ప్రాంతమునను, కాశ్యప సోదరులకును+ వారల సహస్ర శిష్యగణమునకును శాక్యసింహుడు బౌద్ధ ధర్మముల నుపదేశించిన పవిత్రవాటికయందును, స్తూపములు కట్టబడియున్నవి.

శాక్యసింహునకు జ్ఞానోదయమైన ప్రదేశమున మూడు బౌద్ధమఠములు గలవు. వీనన్నిటిలోన భిక్షువులు గలరు. ఈ పరిసరముల నివసించు ప్రజాళి వీరికి వలయువస్తు సంభారముల నెల్ల సమకూర్చి పంపుచుందురు. సన్న్యాసవిధులను వీర లత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వర్తించెదరు. శ్రమణకులు కూర్చుండునప్పు

* లోకమున బౌద్ధధర్మముల నుపదేశింప మొదలు పెట్టుమని బ్రహ్మదేవు డీతని ప్రార్థించెను. ఈ వృత్తాంతము నిదానజాతకకథలలోనిది.

♦ ఈ చిత్రకథ పండ్రెండవ ప్రకరణమున జెప్పబడినది.

+ ఈతడు పదునారవ ప్రకరణమున పేర్కొనబడిన మహాకాశ్యపుడు గాడు. ఈతడు నదీకాశ్యపుడు. వీనికి "ఉరువిల్వ, గయ" లను యిరువురు సోదరులు గలరు. వీరు బుద్ధుని ప్రధాన శిష్యగణములోనివారు.



డును ఆసనములదిగి లేచునపుడును, సభాప్రవేశ మొనర్చు తరుణమునను బాటింపవలసిన నియమములు, పూర్వకాలమున బుద్ధుడు సజీవుడై యుండునపు డెట్లుపాటింపబడెనో నేటికిని నట్లె యిచ్చోట బాటింప బడుచున్నవి. అప్పటికిని ఇప్పటికిని నిసుమంతయు వ్యత్యాసము గాన్పింపదు. గౌతముడు జన్మించిన తావునను, ఆతనికి జ్ఞానోదయమైన ప్రదేశమునను తొలుత నాతడు బౌద్ధ ధర్మముల నుపదేశింప మొదలిడిన చోటను, ఆతడు స్థూలదేహమును విడచి కైవల్యము నొందిన ప్రాంతమునను, నాలుగు మహా స్తూపములు నిర్మింప బడవలయునని తొలుదొల్తనే నిర్ణయింపబడెను. ఈప్రదేశము లివియివి యని శాక్యసింహుడు నిర్యాణపథము జేరిన నాటగోలె నేటి దనుక నాయాప్రాంతముల నివసించు ప్రజాళిచే గుర్తింప బడుచు వచ్చినవి.

# ముప్పదిరెండవ ప్రకరణము

:o:

## అశోకనరకము

పూర్వజన్మమున అశోకనృపాలుడు పసిపాపడై యొకనాడు వీధిలో నాడుకొనుచుండ కాశ్యపబుద్ధుడు భిక్షాటనమొనర్చుకొనుచు నాదారిని బోవుచుండెను. నృపకుమారుడా పరివ్రాజకుని జూచి పరిహాసమున బిడికెడుమంటిని దీసి యాతనియొడిలో బోసి పకపకనవ్వుచు నచ్చటనుండి పరుగెత్తుకొనిపోయెను. మందస్మితుడై కాశ్యపుడామంటిని గ్రహించి "బాలకా! ఉత్తరజన్మమున నీవొక మహాచక్రవర్తివై జంబూద్వీపమెల్ల నేకఛత్రాధిపతిగ నేలెదవుగాక" యని దీవించి వెడలిపోయెను.

మరుసటిజన్మమున నాతడనినట్లె అశోకుడాఖ్యావర్తమునకెల్ల సార్వభౌముడై అఖండవైభవముగ రాజ్యపాలనమొనర్చుచు, నొకమారు తన పరిపాలన మేతీరున నడచుచుండునో చూడగోరి అమాత్యసేవకాగణపరివృతుడై తన రాజ్యమెల్ల దిరుగుచుండెను. ఇట్లు క్రుమ్మరుచుండ నాతడొకచోట వలయాకారముగ వంపుదిరిగి, యినుపగోడలవలె బలిష్ఠములై, అత్యున్నతములై మింటికెగయు రెండు పర్వతశ్రేణుల మధ్య బరిరక్షితమైయున్న యమలోకమును * దవ్వులనుండి వీక్షించి, ఔచ్చవడి "అమాత్యులారా! అల్లదె యాకాన్పించు

* ఈ యమరాజ్యము జంబూద్వీపమునకు దక్షిణదిగ్భాగమున చక్రవాళపర్వతముల కావలివైపున నున్నదని బౌద్ధవాఙ్మయమున వర్ణింపబడినది.



కొండలనడుమ నేమిగలదు?" అని తనమంత్రుల నడిగెను. అందులకు మంత్రులు సవినయముగ "అయ్యా! అదియె పిశాచఱేడగు యముని రాజ్యము. పాపకర్ము లందు శిక్షింపబడెద"రని విన్నవింప అశోకనృపాలు డాశ్చర్యనిమగ్నుడై "ఆహా! పిశాచప్రభుడే ప్రాణుల దండింప నరకమును సృజింపజాలియుండ, యీ నిఖిలభూవలయమునగల మానవాళికెల్ల జక్రవర్తినగు నేనేల దుష్టశిక్షణార్థమై యొక నరకమును నిర్మింపజాల" నని వితర్కించి తన పరివారము నవలోకించి "సచివులారా! ఈ నరకమునుబోలు నరకమును సృజియించి పాపుల నందు దండింపగలవా రెవ్వరైన మనరాజ్యమునగలరా?" యని ప్రశ్నించెను.

"మహాప్రభూ! మహాపాతకిగాని యిట్టి కార్యమును నిర్వర్తింపజాలడు" అని వారలు ప్రత్యుత్తర మిచ్చిరి.

అది విని అశోకసార్వభౌము డట్టికలుషాత్ము డెందైన గలడేని వెదకితెండని తన చారులను తత్క్షణమె నానాముఖములకు బంపెను. రాజసేవకులు పెక్కుప్రాంతములదిరిగి యెట్టకేలకు ఒకానొక సరోవరతీరమున నొక వికృతాకారుని గాంచిరి. ఆవింతమనుజుని శరీర మతిదీర్ఘమై అత్యంతబలీయమై యుండెను. ఆతని వదనము మసిపాతవలె నల్లనై భయోత్పాతము గొల్పుచుండెను. శిరోజములు పసిమివర్ణముగల్గి వికారముగ నుండెను. కన్నులు మార్జాలనయనములవలె ఆకుపచ్చవన్నెగల్గి చూపరులగుండెలవిసజేయుచుండెను. ఆతడాతటాకమున తనపాదముల గాలములభంగి నుపయోగించుచు చేపల

బట్టుచుండెను. ఈలబాడుచు, మృగవిహంగముల నెల్లన దరికి జేరబిలిచి అవి దరిజేరినంతనే నిర్దయుడై బాణవృష్టిచే వాని బరిమార్చి యొక్కటైన తప్పిపోకుండ వాని నెల్ల వధించుచుండెను. యమలోక నిర్మాణాదికృత్యములకు వీడు తగినవాడని సంతసించి రాజభటులు వాని తమ ఱేనిపాలికి గొని పోయిరి. అశోకనృపాలు డావికృతాకారుని జూచి సంతోషస్వాంతుడై, "ఓయీ! నీవొక నరకమును సృజింపవలయును. అందులకే నిన్నిచ్చటకు రప్పించితిని. నీ వతిశీఘ్రముగబోయి యూరిబైట నొక విశాలప్రదేశము నేరికొనుము. చుట్టును దాని కత్యున్నతములగు ప్రాకారముల నిర్మింపుము. అందు పలువిధములగు తరులతాదుల బాతింపుము. స్నానమాచరించుటకు నిర్మలజలపూరితములగు సరోవరముల త్రవ్వింపుము. ఇంక ననేక విధముల దానినెంతయు శోభాయమానముగ జేసి చూపరుల సమ్మోహితుల జేయునట్లొనర్పుము. ప్రాకారమున నొక్కచోట బలిష్ఠమగుద్వారమునుగట్టింపుము. ఈ బహిర్ద్వారమును దాటి యెవ్వడేని లోనికడుగు వెట్టినచో తత్క్షణమె వాని పట్టి బంధించి తగినశిక్ష విధింపుము. లోనికరిగినవాని నెవ్వని బయటకు బోనియ్యకుము. ఎంతటివానినైన శిక్షింపక విడువకుము. నేనైన గానిమ్ము, నీయావరణమును దాటి వచ్చితినేని దప్పక దండింపుము. నిన్నీనరకమున కధిపతిగా నియమించితిని పొమ్ము" అని యాకురూపున కాజ్ఞనొసంగి పంపివైచెను.

ఆవికృతాకారుడు అశోకుడు చెప్పినట్లొక యమరాజ్యమును సృష్టియొనర్చి అం దడుగిడినవారినెల్ల దయావిహీనుడై దండింపసాగెను. ఇట్లుండ నొకనాడు బౌద్ధసన్యాసి యొకడు భిక్షాటనమొనర్చుకొనుచు నామార్గమున బోవుచు నెరుగక "యీప్రదేశ మద్దియో మనోహరమై దర్శనపాత్రముగ గాన్పించుచున్నదే" యని తలంచుకొనుచు ద్వారమును దాటి యీ నరకరాజ్యమున బ్రవేశించెను. తోడనే ద్వారపాలకు లాతనిపట్టి బంధించి యమదండనకు బాల్పడజేయసాగిరి. మార్జాలమునోట జిక్కిన మూషికమువలె యా భిక్షువు భయకంపితుడై, "యమకింకరులారా! దయగొని యొకింత యాగుడు. మజ్జనభోజన మొనర్చువరకు నాకు గడువొసంగుడు. అటుపిమ్మట మీయిచ్చవచ్చినరీతిని గావింపవచ్చును" అని వారల వేడుకొనెను. ఇంతలో మరియొక బాటసారియు విధివశమున నాత్రోవనే బోవుచు సందేమిగలదో చూడ కుతూహలుడై యాభిక్షుకునివలెనే యాతురతతో లోనికరిగెను. సత్వరమున యమభటులు ఏపాపమెరుగని యాపాంథునిబట్టి యినుపరోటిలో బడవైచి యానిర్భాగ్యుని వదనగహ్వరమునుండి రుధిరము వరదలై ప్రవహించువరకును రోకండ్లతో గ్రుమ్మిరి. బౌద్ధసన్యాసి యాఘోరదృశ్యమును దిలకించి "ఆహా! కాయమెంత యస్థిరము! బుద్బుదప్రాయముగదా!" యని విలపించెను. తత్క్షణమే యాబౌద్ధశ్రమణకు డర్హతుడయ్యెను.

బాటసారిని మర్దించినపిదప నా యమరాజ్యభటులు పద, పద మని సన్యాసిని బట్టుకొనిపోయి సలసలమరుగుచున్న నొక నీరభాండమున బడవైచిరి. కాని చిత్రము! బౌద్ధభిక్షువావంతయు చలింపడాయెను. ఆతని వదనసీమను చిరునవ్వు

తాండవించుచుండెను. తత్క్షణమె అగ్ని చల్లారెను. ఆభాండమున మరిగిమరిగి యావిరులు గ్రక్కుచున్న జలరాసి చల్లబడి శీతలోదకమయ్యెను. తృటిలో నాభాండమధ్యమున నొక కమల ముద్భవ మయ్యెను. సన్యాసి యాసరసీరుహాముపై నాసీనుడై భాండోదకమున దేలుచుండెను.

ఈ యద్భుతసంభవమును గాంచి యమభటులు స్తంభితులై పరుగు పరుగున అశోకనృపాలునిపాలి కరిగి యావృత్తాంతమంతయు జెప్పి "సార్వభౌమా! దయసేయవలయు. యమలోకమున వింతలు పుట్టె" నని కలవరపడజొచ్చిరి. అశోకుడు యమరాజ్యమునకుబోవ వెఱచి "కింకరులారా! నే నానరకలోకమును త్రొక్కజాలను. తొలుత నేగావించిన శాసనముల నేనే ప్రతిఘటించుట పాడిగా" దనెను. "నృపోత్తమా! ఇది యల్పవిషయమని తలంపవలదు. ఇది నియమముల పాటింపవలసిన తరుణముగాదు. సత్వరమున దయసేయవలయు" నని యమభటులు వేగిరపడసాగిరి. అశోకు డెట్టకేలకు వల్లెయని యాభటులవెంట నరకరాజ్యమునకు పయనమైపోయి యాయద్భుతమును గాంచి వెరగంది నిశ్చలప్రతిమవలె జూచుచుండ భాండసలిలముల నుత్పన్నమైన రాజీవప్రసూనమున నాసీనుడైయున్న భిక్షు వాతని జూచి చిరునగవు నవ్వి "రాజా! భయమొందకు" మని యాతని వెరపుదీర్చి యాతనికి బౌద్ధధర్మముల నుపదేశించి అశోకసార్వభౌముని నరకబాధనుండి దప్పించెను. అశోకభూమీశుడు తానొనర్చిన యపరాధమునకు పశ్చాత్తప్తుడగుచు తత్క్షణమే యానరకరాజ్యమును నిర్మూల



ను జేయుడని తనసేవకుల కానతిచ్చెను. నాటనుండియు నీ పృథ్వీపాలుడు బౌద్ధమతస్వీకారుడై మణిత్రయమును పూజించుచు అష్టమార్గముల నాచరించుచు ననుదినమును బోధిద్రుమముకడకుబోయి తానొనర్చిన కలుషములకు బరితాప మొందుచు కాలము గడుపజొచ్చెను.

అశోకుని మనోగతమున గల్గిన యద్భుతపరివర్తనమును జూచి యాతని మనోహారిణి చింతాకులయై తన ప్రియవల్లభుడనుదినమును నెచ్చటికిబోయి ప్రొద్దులుబుచ్చుచుండునని పరిచారకుల నడిగెను. వారలు, "తల్లీ! ఇచ్చటి కనతిదూరమున నొక బోధివృక్షము గలదు. సార్వభౌము డనుదినమును అచ్చటికేజనుచుండును" అనిచెప్పిరి. రాజపత్ని యావృత్తాంతమును విని అసూయాగ్రస్తయై నృపు డావృక్షముచెంతలేని సమయమును గనిపెట్టి యా మహీరుహమును నిర్మూల మొనర్చి రండని దన యంతఃపుర సేవకుల కానతిచ్చెను. మహారాజ్ఞియానతి శిరమునదాల్చి సేవకులు బోధివృక్షమును నరకివైచిరి.

కొంతసేపటికి సార్వభౌము డెప్పటియట్ల పిప్పలివృక్షముకడకేగి చూచుసరికి యాతరు శిఖరము ఖండింపబడి నేలపొర్లాడుచుండెను. అశోకుడు మితిలేని శోకమున మునిగిపోయెను. "ఆ! ఎంతపని జరిగె" నని కెవ్వున యఱచి నేలబడి మూర్ఛిల్లెను. చెంతనున్న సేవకులు శీతలోపచారము లొనర్చిరి. కొంతవడికి మూర్ఛదేరి యశ్రువుల రాల్చుచు యానృపవరుడు తెగిన మొండెముచుట్టును యిటుకరాలతో నొకపడియ గట్టించి-

నూరుబానల గోక్షీరముల దెప్పించి యందు బోయించెను. పిమ్మట నావృక్షమున కెదురుగ వినమితమస్తకుడై సాష్టాంగ మొనర్చి, "ఈతరురాజము జీవింపకున్న నే నిచ్చోటనుండి లేవనొప" నని బ్రతిన వట్టెను. నృపాలుని నోటనుండి యా పల్కులు నిర్గమించినంతనే యామోడు పల్లవింపదొడగెను. క్షణమాత్రమున నలుముఖముల శాఖలు విస్తరించెను. ఇట్టిపాదపము నేటికిని పెరుగుచునే యున్నది. ఈ మహీరుహ మిప్పుడు నూరడుగుల యెత్తునకు బెరిగి మహోన్నతవృక్షమై తనరారుచున్నది.

—:o:—

# ముప్పదిమూడవ ప్రకరణము

—:o:—

## గురుపాద శైలము.

మన తెరువరు లిచ్చోటనుండి దక్షిణదెసగా మరలి యొక యరక్రోసుదూర మరిగి 'గురుపాద'* పర్వతమును దర్శించిరి. ఈ పర్వతగర్భమున నిప్పటికిని మహాకాశ్యపుని దేహముగలదు. ఈతడీపర్వతాగ్రమున నొక నెరియ గావించి యీ శైలగర్భమున బ్రవేశించెను. ఆతడొనర్చిన రంధ్రము నేటికిని గాననగును. ఈసొరంగ మిప్పుడొక్క మనుజుడైన చొర శక్యముగానంత చిన్నదిగ నున్నది. ఇంతటి క్షుద్రబిలమున నాకాశ్యపుని దేహ మెట్లిమిడెనో యాశ్చర్యకరము. ఆ సొరంగమునుజొచ్చి కడుదూరము క్రిందికిబోయినచో శైలగర్భమున నెచ్చటనో యొకగుహ కాన్పించును. ఇచ్చటనే మహాకాశ్యపుని కళేబరము పరిరక్షితమై యున్నది.

ఈ పర్వతశృంగమున కాశ్యపుడు గావించినసొరంగ ద్వారముకడ నావిరాగి హస్తప్రక్షాళన గావించుకొనువపు డుపయోగించిన కర్దమము గలదు. ఈపరిసరప్రాంతముల నివసించు జనులు తమ శిరోభాగమున నెచ్చటనైన బాధగల్గెనేని యీ కర్దమమును గొనిపోయి యా ప్రదేశమున లేపనముగ బూ

* "కుక్కుటపాద" పర్వతమనిగూడ దీనికి నామాంతరముగలదు. కుక్కుటపాదమునుబోలి యీ శైలమునకు మూడుశృంగము లుండుటచే యీ పర్వతమున కీనామము గల్గినది. ఈ శైలము గయాక్షేత్రమున కాగ్నేయభాగముగ నేడుమైళ్ళ దూరమున నున్నది. కాశ్యపబుద్ధుని వాసస్థాన మియ్యదియె. ఈ శైలగర్భమున కాశ్యపునిదేహము నేటికిని గలదని బౌద్ధుల విశ్వాసము.

యుదురు. త్రుటికాలమున బాధ నివారణమగును. ఇప్పటికిని యీ శైలోపరిభాగమున అర్హాతులు నివసించుచుందురు. ప్రతివత్సరమును యీపర్వతమునకు దాపుననున్న రాజ్యముల నుండి యసంఖ్యాకులగు బౌద్ధయాత్రికు లరుదెంచి యీగిరిరాజమును దర్శించి. కాశ్యపుని సేవించి పోవుచుందురు. హృదయమాలిన్య మెరుగని నిష్కళంక బౌద్ధమతావలంబులకు నిశాసమయములందు అర్హాతులు ప్రత్యక్షమై వారలతో సంభాషించి వారలమనముల నెలకొనియున్న సందియముల దీర్చి యదృశ్యు లగుచుందురు.

ఈ పర్వతోపరిభాగమున ముండ్లపొదలు దట్టముగ బెరిగి యున్నవి. సింహ, శార్దూల, వృకాది వన్యమృగసంకీర్ణమై యీ శైలము భీతావహ మగుటచే యిం దొంటరిగ ప్రయాణ మొనర్చుట మిగుల ప్రమాదకరము.

# ముప్పదినాల్గవ ప్రకరణము

## వారణాసి

గురుపాదశైలమును వీక్షించి మన ఫాహియాను గంగానదీతీరమునంటి వెనుకకు మరలఁజొచ్చెను. ఇట్లు మరలి పశ్చిమాభిముఖుఁడై యాతడు పదియోజనముల దూర మరిగి "అరణ్యాసీమ" యను నామమునబరగు నొక విహారమును గాంచెను. ఇయ్యది బుద్ధుడు కొంతకాలము నివసించిన పుణ్యస్థలి. ప్రస్తుతము పెక్కు బౌద్ధసన్యాసుల కావాసభూమియై తనరారుచున్నది.

పిమ్మట పశ్చిమముగనే యింకను గొంతదూర మేగి మన బాటసారి "వారణాసీ"♦ పురమును గాంచెను. వారణాసి 'కాశీ' రాజ్యమున విలసిల్లు గొప్ప నగరము. ఈపట్టణమున కీశాన్యభాగమున నొక క్రోసుదూరమున "కురంగారామ" మను వనవాటిక యొకటిగలదు. అం దత్యంతసుందర మగు విహార మొందు నిర్మింపబడియున్నది. పూర్వ మీ వనభూమియం దొక ఋషిసత్తముఁడు నివసించువాడు. ఈపరిసరారణ్య ప్రాంతమున సంచరించు హరిణములు గుంపులు గుంపులైవచ్చి ప్రతిరేయియు యీముని వర్యుని యాశ్రమమున విశ్రమించి పోవుచుండెడివి. అందువలననే యీవనసీమకు 'ఋషికురంగారామ' మను నామధేయము గల్గెను. జగత్కల్యా

♦ "వరుణ", "అసి" నదులమధ్య విలసిల్లు పట్టణముగాన వారణాసి యయ్యెను.

ణుడగు శాక్యసింహునకు జ్ఞానోదయమగు తరుణ మాసన్నమైనంతనే నభోంతరాళమునుండి “శుద్ధోదనమహీపాలుని తనయుండు భార్యాసుతుల విడనాడి సర్వసుఖముల పరిత్యజించి వైరాగ్య పథమున చరించుచున్నాడు. ఇక నేడుదినములలో నీతడు బుద్ధుడగును” అను శబ్దము లీప్రాంతముననే వినవచ్చెను. ఈ యారామవాసియగు మునివర్యు డీవచనముల నాలకించి జీవముల బాసెను. శాక్యసింహునకు జ్ఞానోదయమైన పిదప నీప్రాంతమున నివసించు జను లీ వనవాటికయందొక విహారము నిర్మించిరి.

కౌండిన్యు* నకును యాతని నల్వురు మిత్రులకును బౌద్ధమత దీక్షయొసంగవలె నని యొకనాడు శాక్యసింహునకు తలంపు గల్గెను. వార లీతని సంకల్పమును గనిపెట్టి వారిలో వారిట్లు సంభాషించుకొన జొచ్చిరి. “గౌతమశ్రమణకు డారు దీర్ఘవత్సరములు శరీరసౌఖ్యముల నొల్లక దేహమును శుష్కింపజేసి ఒక్క జనపపల్కును, ఒక్క బియ్యపుగింజను మాత్రము భుజించుచు ఘోరతపోనిష్ఠల మున్గితేలినను జ్ఞానపథము నరయ జాల డయ్యెను. ఇప్పుడు తపశ్చర్య లన్నియు చాలించి,

* మగధరాజ వంశమున బుట్టినవాడు. శాక్యసింహుని మేనమామ. శాక్యసింహు డీతనికి “అజ్ఞాతు” డనుబిరుద నామ మొసంగెను. అందువలన నీతడు బౌద్ధవాఙ్మయమున “అజ్ఞాత కౌండిన్యు”డని పేర్కొనబడుచుండును. ఈతడును యాతని నల్వురుమిత్రులును శాక్యసింహుని వైరాగ్యమునకు వెరగందుచు నాతనికి పరిచర్య లొనర్చుటకై నతని వెంట “ఉరువిల్వ” యెడారికి పయనమై పోయిరి.



ఏకాంతవాసమును విడనాడి మానవ ప్రపంచమున సంచరించుచు నీతడిప్పుడు జ్ఞాన పరిపూర్ణు డెట్లు గానేర్చును? నే డీతడు మన కెదురువచ్చెనేని మన మీతని పల్కరింపక తొలగి పోయెదము.”

ఈ యారామ పరిసరములందు పెక్కు స్తూపములు గలవు. బుద్ధు డరుదేరినంతనే కౌండిన్యుడు మున్నగు వారలు తమయాసనముల డిగ్గి యాతని కభివందన మాచరించిన తావులందును, అచ్చటి కుత్తరముగ నరువదిబారల దూరమున శాక్యసింహుడు ప్రాగ్దిశాభిముఖుడై వారికి బౌద్ధధర్మముల నుపదేశించిన చోటులందును, బుద్ధుడు మైత్రేయాగమన వృత్తాంతమును జెప్పిన ప్రదేశమునను, “ఇలాపత్రి” ♦ యను నాగుడు, “నే నీ తుచ్ఛశరీరమును వీడి మానవజన్మమును బొందుటెన్న” డని బుద్ధుని బ్రశ్నించిన స్థానమునను, స్తూపములు నిర్మింపబడియున్నవి. ఇంతియగాక నీ వసభూమియందు రెండు సంఘారామములుకూడ గలవు. ఈ రెంటియందును పెక్కు శ్రమణకులు నివసించుచున్నారు.

కురంగ వనవిహారమునకు వాయువ్యభాగమున పదమూడు యోజనముల దూరమున “కౌశాంబీ” * యను రాజ్య

♦ ఈ నాగుని గూర్చిన వృత్తాంతము మన కంతగా తెలియదు.

* ఈరాజ్య మెచ్చట విలసిల్లెనో సరిగ తెలియవచ్చుటలేదు ప్రస్తుత “కురా”కు సమీపమునయున్న కుసియా యని కొందరును, ప్రయాగక్షేత్రమున కుత్తరముగ యమునానదీ తటమున నున్న “కోశా”మే యీ కౌశాంబీరాజ్యమని కొందరును తలంచుచున్నారు.

మొకటికలదు. "గోక్షీరవన"+ మను నామమున బాగు ప్రసిద్ధ విహార మిందేగలదు. బుద్ధుడు గొన్నినాళ్లీవిహారమున నివసించెను. ఈప్రదేశమున గూడ చాలమంది బౌద్ధభిక్షువులు గలరు. వీరందరును హీనయాన మత శాఖను జెందిన వారు.

గోక్షీరవనమున కెనిమిది యోజనముల దూరమున బుద్ధభగవానుడు, "ఆలవాక" యను భూతమునకు కైవల్య* మొసంగినతావు గలదు. ఇచ్చోట నొక బౌద్ధమఠముగూడ నిర్మింపబడి యున్నది. ఇందు కొలదిమంది సన్యాసులు మాత్రమే నివసించుచున్నారు. ఈ సమీపప్రాంతమున బుద్ధుడు విహరించినప్రదేశములం దెల్లెడను స్తూపములు నెలకొల్పబడి యున్నవి.

---

+ గోక్షీరుడను వాడొక వైశ్య శ్రేష్ఠుడు. ఇచ్చట బేర్కొనబడిన యుపవనమును యందలి విహారమును ఈతడే బుద్ధునకు దానమొసంగెను.

* ఈ కథ "ఆలవాక సూత్రము" నందు వర్ణింపబడియున్నది.

# ముప్పది యైదవ ప్రకరణము

—:o:—

## దక్షిణాపథము:—కపోత విహారము.

కౌశాంబీరాజ్యమునకు దక్షిణముగ నిన్నూరు యోజనముల దూరమున "దక్షిణాపథ" మను దేశముగలదు. ఇచ్చట కాశ్యపబుద్ధుని గౌరవార్థమై గట్టింపబడిన గిరివిహార మొకటి కలదు. ఇది యొకమహోత్తరమగు పర్వతమునుండి దొలువబడిన ఐదంతస్తుల దివ్యభవనము. ఈహర్మ్యమునందలి ప్రథమాంతరము గజాకృతిగ నిర్మింపబడి ఐదువందల గదులతో నలరారుచున్నది. ద్వితీయాంతరము సింహమును బోలి నన్నూరుగదులు గల్గియున్నది. మూడవయంతస్తు అశ్వాకృతిగనుండి మూడువందల గదులుగ విభజింపబడినది. నాల్గవది వృషభాకారముగ గట్టబడినది. ఇందు రెండువందల గదులు మాత్రమే గలవు. కడపటి యంతర మచ్చముగ పారావత విహంగమును బురిడించుచుండును. ఇది యన్నిటిలోన చిన్నది. ఇందు నూరుగదు లున్నవి. ఈ భవన శిరోభాగమున నొక జలధార సర్వదా స్రవించుచుండును. ఈ ప్రసవణోదకము సెలయేటి ధారలవలె గదుల ముంగిట ప్రవహించుచు కొన్నితావులయం దర్ధచంద్రాకృతిగను, కొన్నిచోట్ల వలయాకారముగను మెలికలు దిరుగుచు నన్నియంతస్తులను జుట్టి యాకాశతరంగిణివలె క్రిందికి దిగిపోవుచున్నది. గదులకు వెలుతురు నిచ్చుటకై కుడ్యములయందు రంధ్రములు గావింపబడియు

న్నవి. ఇవియె గవాక్షములభంగి నుపకరించుచు విహారమందిరముల కాంతివంతముగ జేయుచున్నవి. ఒక యంతరమునుండి యొకయంతరమునకు బోవుట కీభవనమునకు నాలుగు మూలలను నాలుగు సోపానపంక్తు లమర్పబడినవి. ఇందువలననే యీ విహారమునకు "పారావత" విహారమను పేరుగల్గెను. ఇందెప్పుడును అర్హతులు నివసించుచుందురు. కపోతవిహార సమీపప్రాంతమంతయు జనశూన్యమగు రాతిప్రదేశము. ఇచ్చట సస్యములు ఫలింపవు. ఈ విహారమునకు కడుదూరమునగాని జనసంకీర్ణమగు పల్లె లెవ్వియు గానరావు. అందందు నివసించు జనుల మత భావములు విరుద్ధముగ నుండును. వారు బౌద్ధధర్మముల నెఱుగని మూఢులు. బ్రాహ్మణమతము మున్నగు విమతధర్మములైన నీదక్షిణాపథమున ప్రాబల్యము నొందినట్లు గన్పింపదు. రెక్కలపై నెగిరివచ్చి యీవిహారమును దర్శించి పోవు పురుషుల నెందరినో యీ ప్రాంతవాసు లనుదినమును జూచుచుందురు. ఒక్కమారు దూరదేశములనుండి యాత్రార్థము పాదచారులై నీప్రాంతమున కరుదెంచిన పాంథుల గాంచి యీ విహారసమీపమున నివసించుజను లీవిధమున ప్రశ్నించిరి. "అయ్యా! మీరిట్లు పుడమిపై నడచి వచ్చుచుంటిరేల? ఇచ్చటి కరుదేరు యాత్రికు లెల్లరు విహంగములభాతి గగనపథమున నెగిరివచ్చెదరే!" అందుల కాయాత్రికులు, "మాకింకను పక్షము లేర్పడలేదు. అందువలననే పాదచారులమై పోవుచుంటిమి" అని ప్రత్యుత్తర మొసగి వెడలిపోయిరి.



దక్షిణాపథమంతయు జొరశక్యముగాని పర్వత ప్రదేశము. ఇచ్చట బాటలసౌకర్యము లంతగా లేకపోవుటచే నీప్రాంతమున ప్రయాణమొనర్చుట మిగుల కష్టసాధ్యము. దుర్గమారణ్య భూములలో ప్రయాణముసల్పు నెఱింగిన పాంథులైన నీ పర్వతసీమ నొంటరిగ బ్రయాణముజేయ సాహసింపరు. ఈ ప్రాంతమును దర్శింప నభిలషించు తెరువరులు మున్నుగా తమ యభిమతము నీ దక్షిణాపథమునేలు రాజేశ్వరున కెరుకపరుపవలయు. అంతట నీతడు తనచారుల నాపథికుల వెంట నంపి మార్గమధ్యమున వారల కెట్టిహానియు సంభవింపకుండ నంచెలపై వారిని గమ్యస్థానమున జేర్చును.

మన ఫాహియాను దక్షిణాపథమును దర్శింపలేదు. ఏనసీ విశేషముల నాప్రాంతవాసులవలన నెఱిగి ఇచ్చట వర్ణించి యున్నాడు.

# ముప్పదియాఱవ ప్రకరణము

:o:

## పాటలీపుత్రము

కాశీక్షేత్రమునుండి మనపాంథులు ప్రాగ్దిశగా మరలి మరల పాటలీపుత్రమునకు బోయిరి. వినయసూత్రగ్రంథముల వెదకికొనిపోవుటకే ఫాహియాను డార్యావర్తమునకు బయలు దేరెను. కాని యుత్తరభారతమం దెచ్చటను లిఖింపబడిన సూత్రగ్రంథములు గానరావయ్యెను. పెక్కు పురుషాంతరములనుండి నేటిదనుక కంఠస్థమై వాగ్రూపమున విలసిల్లుటయె గాని యీసూత్రము లుత్తరఖండమున నెచ్చటను గ్రంథస్థము గా లేదు. అందుచేతనే మన ఫాహియాను, ఉత్తరదేశమంతయు తిరిగి తిరిగి తుదకు మధ్యభారతమునకుగూడ రావలసి వచ్చెను.

ఇచ్చట నదృష్టవశమున నొక మహాయాన విహారమున వినయసూత్రప్రతి యొకటి ఆతనికి లభించెను. ఇం దుదహరింపబడిన సూత్రములు శాక్యసింహుని నిర్వాణమునకు పూర్వమునుండియు బౌద్ధభిక్షువులచే నాచరింపబడుచు ప్రథమ బౌద్ధమహాసభయం దామోదింపబడినవి. ఈప్రతియొక్క మాతృక పెక్కుశతాబ్దములనుండి సువర్ణవనవిహారమున♦ బరిరక్షి

♦ ఫాహియాను దర్శించిన కాలమునాటికె సూత్రగ్రంథము జీర్ణమై యదృశ్యమై యుండనోపు. లేనియెడల యిత డీగ్రంథమును పేర్కొని యుండును.



తమై యున్నది. దీనికి పదునెనిమిది ప్రతులు లిఖింపబడినవి. ఈ ప్రతు లన్నిటికిని వ్యాఖ్యానములుగూడ వ్రాయబడినవి. ప్రధానవిషయములం దీప్రతులలో విభేదములు గన్పింపవు. అచ్చటచ్చట కొన్నితావులందు తారతమ్యము† లున్నను నవి యంతగా పాటింపతగినవికావు. మన ఫాహియానునకు లభించినది సంపూర్ణప్రతి. అందు వ్యాఖ్యలుగూడ గలవు.

ఇంతియగాక మనపథికున కిచ్చట "సర్వాస్తివాద" శాఖీయుల* సూత్రగ్రంథముగూడ యొకటి లభించెను. ఈసూత్రము లేడువేల గాథ§లలో (శ్లోకములు) వ్రాయబడినవి. చీనాసామ్రాజ్యమునందలి శ్రమణకులచే ననుకరింపబడు సూత్రము లివ్వియే. ఇవియు పెక్కుశతాబ్దము లిచ్చట కంఠస్థమై వరలినవి. మఱియు నీ సంఘారామమున, "సంయుక్తాభిధర్మహృదయ" శాస్త్రమును (ఏడువేల శ్లోకములు గలది), రెండువేల శ్లోకములలోనున్న యెన్ని¶ సూత్రగ్రంథమును, "వైపుల్యపరినిర్వాణ" సూత్రములలోని యొక ప్రకరణమును

† ఈవిభేదము లెట్లుగల్గెనో యూహింప శక్యముగా కున్నది.

* వైభాషికమహాశాఖలోని యొకయుపశాఖ. దృష్టికి గోచరించు సర్వభూతములును నిత్యమని వీరివాదన.

§ బౌద్ధవాఙ్మయమున "గాథ"యన శ్లోకమని యర్థము. ఈ గాథలకు సాధారణముగ రెండేసి పాదము లుండును. వీనికి ఛందోనియమములు గూడ గలవు.

¶ ఈ సూత్రము లెవ్వియో దెలియవచ్చుట లేదు.

మహాసాంఘిక ♦ అభిధర్మ సూత్రములనుగూడ మనయాత్రికునకు లభించెను.

ఫాహియానుని యన్వేషణము ఫలించుటచే నాతడు సంస్కృతభాష నభ్యసించుచు సంస్కృతగ్రంథముల పఠించుచు వినయసూత్రములకు ప్రతులవ్రాయుచు మూడువత్సరము లిచ్చటనే (పాటలీపుత్రమున) గడపెను.

ఇంతలో నాతనిమిత్రుడగు "టోచింగు" ఉత్తరభారతఖండమంతయు గ్రుమ్మరి పాటలీపుత్రముననున్న ఫాహియానుని గలిసికొనెను. టోచింగు మధ్యభారతమున నివసించు శ్రమణకుల యాచార నడవడులగాంచియు, వారల విమలవర్తనముల వీక్షించియు నివ్వెరపడి తన మాతృదేశమగు చీనాసామ్రాజ్యమునందలి సోదరశ్రమణకు లిట్టి శిక్షణనియమముల పాటింపకుండుట సంతాపకరమని తలపోయుచు నిట్లు చింతింపసాగెను: "నేను బుద్ధత్వము* నొందువరకు నన్య దేశములలో జనింపకుందునుగాక!" అని కృతనిశ్చయుడై

♦ "మహాసాంఘిక" యన" బౌద్ధమహాజనసభయందు తర్కింపబడిన" యని యర్థము.

* బుద్ధత్వము నొందుటయే శ్రమణకుల వాంఛితము. ఇయ్యది పెక్కుజన్మము లెత్తినగాని సిద్ధింపదని బౌద్ధుల సిద్ధాంతము. భారత వర్షమున నివసించుటవలన బుద్ధత్వము శీఘ్రకాలముననే లభించునని టోచింగుయాత్రికుని విశ్వాసము.



టోచింగు సిన్నరాజ్యమునకు దిరిగిపోవక నార్యావర్తముననే యుండిపోయెను. అచ్చటనే తుదకు మృతినొందెను. కాని ఫాహియాను సూత్రగ్రంథముల సిన్నరాజ్యమునకు గొనిపోవుటకే యుద్దేశించె గావున నాతడిందుండనొల్లక తక్షణమే చీనారాజ్యమునకు తిరిగి పయనమయ్యెను.

# ముప్పదియేడవ ప్రకరణము

—:o:—

## చంపా, తామ్రలిప్తిరాజ్యములు.

### ఫాహియాను భారతఖండమునువీడి సింహళమునకు బోవును.

పాటలీపుత్రమునువీడి మన పాంథుడు ప్రాగ్దిశాభిముఖుడై గంగాతీరమునంటి పదునెనిమిది యోజనములరిగి చంపా♦ రాజ్యమును జేరెను. ఇయ్యది గంగాతరంగిణికి దక్షిణతీరమున విలసిల్లు నొక విశాలరాజ్యము. ఇందు బుద్ధుని విహారమొకటి గలదు. ఇచ్చట శాక్యసింహుడు ధ్యాననిమగ్నుడై తన విహార సామీప్యమున పచారుజేసిన తావునను, బుద్ధచతుష్టయము కూర్చుండి భాషించిన పవిత్రవాటికయందును స్తూపములు నిర్మింపబడినవి. ఈ స్తూపపరిసరములందు పెక్కు శ్రమణకులు నివసించుచుందురు.

ఇచ్చటనుండి మరల పయనమై మన బాటసారి తూర్పు దెసగా నేబదియోజనములేగి తామ్రలిప్తి* రాజ్యమును గాంచెను. దీని రాజధాని యొక గొప్ప రేవుపట్టణము.

♦ "బాగిలీ" పురమునకు మూడుమైళ్ళదూరమున నున్న నవీన చంపా నగరసామీప్యముననే యీరాజ్యము విలసిల్లెను.

* హుగ్లీనదీ ముఖద్వారమున నున్న ప్రస్తుత "టామ్లూకు" పట్టణ పరిసరములందే యీరాజ్యము విస్తరిల్లినది. ఈ టామ్లూకే ప్రాచీన తామ్రలిప్తి. పూర్వకాలమున ఈనగరము చీనాసింహళరాజ్యములతో అపారమగు వాణిజ్యము నడిపి ప్రఖ్యాతిగాంచిన రేవుపట్టణము.



ఈ రాజ్యమున ఇరువదినాల్గు బౌద్ధమఠములు గలవు. అన్నిటిలోన శ్రమణకులు గలరు. బౌద్ధమత మీరాజ్యమున మిగుల వ్యాప్తిగాంచినది. సూత్రములకు ప్రతులువ్రాయుచు అచ్చటి విగ్రహములకు చిత్తరువులు రచియించుచు మనయాత్రికు డిచ్చోట రెండు హాయనము లుండెను.

పిమ్మట నొక పెద్దవర్తకపు టోడనెక్కి సముద్రజలముల దేలుచు ఆగ్నేయదిశగ బోవసాగెను. శీతకాల మప్పుడే ప్రారంభమయ్యెను. గాలి యనుకూలముగ వీచుచుండెను. పదునాల్గురోజు లట్లు దివారాత్రములు సముద్రయానమొనర్చి మనఫాహియాను సింహళ♦ ద్వీపమును జేరుకొనెను. తామ్రలిప్తినగరమునకు సింహళరాజ్య మేడువందల యోజనముల దూరమున్నదని తద్వీపవాసులు జెప్పెదరు.

ఈ రాజ్య మేబదియోజనముల వెడల్పును ముప్పది యోజనముల పొడవును గల్గిన యొకమహాద్వీపమున విలసిల్లుచున్నది. ఈ ద్వీపమున కిరుకెలంకులందును దూరదూరముగ చెదరియున్న నూరు చిన్నద్వీపములు గలవు. వీనియన్నిటిలోన నమూల్యమగు రత్నములును ముత్తియములును పుష్కలముగ దొరకును. ఇం దొక ద్వీపమున, స్వచ్ఛమై కాంతివంతములగు

♦ "సింహళ" యనునది భారతఖండనివాసియగు ఒకానొక వర్తకుని నామము. ఈసింహళుడే యీ ద్వీపమును కనుగొనెనని ప్రతీతి. ఈతని జనకుని పేరు సింహుడు. అందుచేతనే యీద్వీపమునకు, సింహళద్వీపమనియు సింహద్వీపమనియు పేరుగల్గెను.

మణిపూసలు లభించును. సింహళదేశాధీశ్వరుని సేవకానీకము వేళ నీద్వీపమును కావలిగాయుచుండును. ముత్తియముల తీయువారలు తాము ప్రోవుచేయు ముత్తియములలో పదింటికి మూడు ముత్తియముల నృపున కొసంగవలయును.

# ముప్పదియెనిమిదవ ప్రకరణము

:o:

## సింహళ ద్వీపము.

తొలుత నీసింహళద్వీప మంతయు నిర్జనారణ్య భూమియై నాగులకును భూతములకును నిలయమై భీతిగొల్పుచుండెను. ఈ భూతములతోడనే వణిజులు పూర్వకాలమున వర్తకవ్యాపారముల నెరపుచుండెడివారు. వాణిజ్యము జరుగునపుడీభూతము లదృశ్యములగుచుండెడివి. వానికడనుండు నమూల్య వస్తుచయములపై చీట్లవ్రేలగట్టి యాపత్రములపై వస్తువుల మూల్యముల నుదహరించి వాని నాపణప్రదేశమున ప్రదర్శించి పోవుచుండెడివి. వర్తకు లామూల్యముల నొసంగి యా సంబారములం గొనిపోవుచుండిరి. ఇట్లు వణిక్సంఘముల రాకపోకలచే నీ ద్వీప సౌభాగ్య సౌందర్యములు ప్రపంచమున వెల్లడియై పరదేశములనుండి పెక్కుజనసంతతుల నాకర్షించెను. ఇట్లే ఈద్వీపమంతయు జన సంకీర్ణమయ్యెను.

ఇచ్చట శీతోష్ణస్థితు లత్యంత మనోహరమై హాయిగొల్పుచుండును. గ్రీష్మహేమంత ఋతువుల కిచ్చట తారతమ్యమే గాన్పింపదు. సర్వకాలములయందును యిచ్చట సస్యములు ఫలించును. తరులతాదులు ఫలపుష్పముల నొసగును. ఇచ్చటి జనులు తమ యిచ్చవచ్చినప్పుడెల్ల సేద్యము జేయుచుందురు. కృషికి ఈ ద్వీపమున ఋతునిర్ణయము లేదు.

ఈ రాజ్యమున నివసించు క్రూరనాగుల వికృతాకారముల బోగొట్టి వారికి మనుష్యరూపముల ప్రసాదించి బౌద్ధ ధర్మముల నుపదేశించుటకై మున్నొకసారి శాక్యసింహుడు సింహళద్వీపమును దర్శించెను.♦ అప్పు డాతడీ ద్వీపపు రాజధానీ పట్టణమున కుత్తరభాగముననున్న ప్రదేశమున నొక్కడుగును అచ్చటకు బదునైదుయోజనముల దూరముననున్న "సమస్త కూటపర్వతాగ్రము" * న నొక్కయడుగును వైచెను. ఆతని యడుగుజాడ లింకనూ ఈ ప్రదేశములందు గాన్పించును. రాచనగరు కుత్తరమున బుద్ధుడు తన పాదముంచిన తావున సింహళరాజ్య విభుడొక పెద్దస్తూపమును గట్టించెను. ఇయ్యది నన్నూరడుగుల యున్నతిగల్గి సువర్ణవిరాజితమై మణిస్థగితమై యొప్పారుచున్నది. దీనిచెంతనే యీరాజ్య నృపుడొక విహార

♦ శాక్య సింహుడు సింహళద్వీపమున కేగెనా యను యంశ మింకను సంశయాస్పదముగనె యున్నది. ఐన ఫాహియాను దర్శించిన కాలమునాటికె (అనగా నైదవ శతాబ్దారంభమునాటికె) యిచ్చట బౌద్ధమతము వ్యాపించి యుండెనని ఫాహియాను వ్రాతలవలన స్పష్టమగుచున్నది. అశోక సార్వభౌముడు క్రీ. పూ. 250 సంవత్సరప్రాంతమున తనతనయుడగు మహేంద్రునంపి యీద్వీపమున బౌద్ధమతము వ్యాపింపజేసెనని చరిత్ర పరిశోధనల వలన దేలుచున్నది. అప్పుడు "తిస్స" నృపుడు సింహళద్వీపము నేలుచుండెను.

* ఇప్పుడు "ఆడమ్సు పర్వత శృంగమని" వ్యవహరింపబడుచున్నది. దీనికి సంస్కృతమున "సమస్త కూటమని" పేరు. దీని యగ్రభాగమున నైదడుగుల మూడుమ్ముప్పాతికంగుళముల పొడవును రెండున్నర యడుగుల వెడల్పును గలిగిన యొకపల్లముగలదు. దీనినే హిందువులు శివునిపాదమనియు, మహమ్మదీయు లాడమ్సు పాదమనియు, బౌద్ధులు బుద్ధుని పదచిహ్నమనియు భావింతురు.



మును గూడ నిర్మించెను. దీనికే "యభయగిరి" * విహారమని పేరు. ఇప్పు డీమఠమున నైదువందల బౌద్ధసన్యాసులు గలరు. ఇందు "బుద్ధమంటప" మనునామమున బంగరు సుందరమంటప మొకటిగలదు. ఇది బంగరు నగిషీలతోడను మణిద్యుతులతోడను కన్నుల మిరుమిట్లుగొల్పు చుండును. ఈమంటపమున మరకత మణులతో చెక్కబడిన బుద్ధ విగ్రహ మొకటిగలదు. ఈ మూర్తి యిరువది యడుగుల పొడవుగల్గి రత్నఖచితమై రమణీయముగ నున్నది. దీనివదనసౌష్ఠవము చూపరుల హృదయసీమలందు ప్రశాంతభావముల స్ఫురింప జేయుచు గంభీరముగ నున్నది. ఈ ప్రతిమ దక్షిణహస్తమున నొక యమూల్య మౌక్తికము గలదు.

ఫాహియాను తనమాతృదేశమును వీడి పెక్కువత్సరము లయ్యెను. ఈత డేకాకియై యున్నవాడను జూచి యెరుంగని దూరదేశముల దిరుగుచుండెను. తన్నివాసులు తన కపరిచితులు. తాగాంచుదృశ్యములు నూతనములు. పసితనమునుండియు తా నెరింగిన నదీ నదములు, వృక్షములెవ్వియు కంటికి గానబడవు. తనతో ప్రయాణ మొనర్చిన సోదర యాత్రికు

* భయము బాపుశైలమని యర్థము. 'అభయగిరి'యను స్తూప మొకటి నేటికిని సింహళమున గలదు. ఈ ద్వీపమున గల స్తూపములన్నిటిలో నిది మిగుల పెద్దది. ఇయ్యది క్రీ. పూ. 90 సంవత్సరమున పాటలీపుత్ర మహాసభానంతరము, బుద్ధుడు కైవల్యము నొందిన మూడువందల ముప్పది వత్సరములకు "వటగామిని" నృపాలునిచే నిర్మింపబడిన దని తెలియుచున్నది. ఈతని రాజ్యకాలముననే పిటకత్రయము గ్రంథస్థము గావింపబడినది.

ఈ రాజ్యమున నివసించు క్రూరనాగుల వికృతాకారముల బోగొట్టి వారికి మనుష్యరూపముల ప్రసాదించి బౌద్ధధర్మముల నుపదేశించుటకై మున్నొకసారి శాక్యసింహుడీ సింహళద్వీపమును దర్శించెను.♦ అప్పుడాతడీ ద్వీపపు రాజధానీ పట్టణమున కుత్తరభాగముననున్న ప్రదేశమున నొక్కయడుగును అచ్చటకు బదునైదుయోజనముల దూరముననున్న "సమస్త కూటపర్వతాగ్రము" * ననొక్కయడుగును వైచెను. ఆతని యడుగుజాడ లింకనూ ఈ ప్రదేశములందు గాన్పించును. రాచనగరు కుత్తరమున బుద్ధుడు తన పాదముంచిన తావున సింహళరాజ్య విభుడొక పెద్దస్తూపమును గట్టించెను. ఇయ్యది నన్నూరడుగుల యున్నతిగల్గి సువర్ణ విరాజితమై మణిస్థగితమై యొప్పారుచున్నది. దీనిచెంతనే యీరాజ్య నృపుడొక విహార

♦ శాక్య సింహుడు సింహళద్వీపమున కేగెనా యను యంశ మింకను సంశయాస్పదముగనె యున్నది. ఐన ఫాహియాను దర్శించిన కాలమునాటికె (అనగా నైదవ శతాబ్దారంభమునాటికె) యిచ్చట బౌద్ధమతము వ్యాపించి యుండెనని ఫాహియాను వ్రాతలవలన స్పష్టమగుచున్నది. అశోక సార్వభౌముడు క్రీ. పూ. 250 సంవత్సరప్రాంతమున తనతనయుడగు మహీంద్రునంపి యీద్వీపమున బౌద్ధమతము వ్యాపింపజేసెనని చరిత్ర పరిశోధనల వలన దేలుచున్నది. అప్పుడు "టిస్స" నృపుడు సింహళద్వీపము నేలుచుండెను.

* ఇప్పుడు "ఆడమ్సు పర్వత శృంగమని" వ్యవహరింపబడుచున్నది. దీనికి సంస్కృతమున "సమస్త కూటమని" పేరు. దీని యగ్రభాగమున నైదడుగుల మూడుమ్ముప్పాతికంగుళముల పొడవును రెండున్నర యడుగుల వెడల్పును గలిగిన యొకపల్లముగలదు. దీనినే హిందువులు శివునిపాదమనియు, మహమ్మదీయులాడమ్సు పాదమనియు, బౌద్ధులు బుద్ధుని పదచిహ్నమనియు భావింతురు.



మును గూడ నిర్మించెను. దీనికే "యభయగిరి" * విహారమని పేరు. ఇప్పుడీమఠమున నైదువందల బౌద్ధసన్యాసులు గలరు. ఇందు "బుద్ధమంటప" మనునామమున బాగు సుందరమంటపమొకటిగలదు. ఇది బంగరు నగిషీలతోడను మణిద్యుతుల తోడను కన్నుల మిరుమిట్లుగొల్పుచుండును. ఈమంటపమున మరకత మణులతో చెక్కబడిన బుద్ధ విగ్రహ మొకటిగలదు. ఈ మూర్తి యిరువది యడుగుల పొడవుగల్గి రత్నఖచితమై రమణీయముగ నున్నది. దీనివదనసౌష్ఠవము చూపరుల హృదయసీమలందు ప్రశాంతభావముల స్ఫురింప జేయుచుగంభీరముగ నున్నది. ఈ ప్రతిమ దక్షిణహస్తమున నొక యమూల్యమౌక్తికము గలదు.

ఫాహియాను తనమాతృదేశమును వీడి పెక్కువత్సరములయ్యెను. ఈతడేకాకియై యున్నతను జూచి యెరుంగని దూరదేశముల దిరుగుచుండెను. తన్నివాసులు తనకపరిచితులు. తాగాంచుదృశ్యములు నూతనములు. పసితనమునుండియు తానెరింగిన నదీ నదములు, వృక్షములెవ్వియు కంటికి గానబడవు. తనతో ప్రయాణ మొనర్చు సోదర యాత్రికు

* భయము వాపుశైలమని యర్థము. 'అభయగిరి'యను స్తూపమొకటి నేటికిని సింహళమున గలదు. ఈ ద్వీపమున గల స్తూపములన్నిటిలో నిది మిగుల పెద్దది. ఇయ్యది క్రీ. పూ. 90 సంవత్సరమున పాటలీపుత్ర మహాసభానంతరము, బుద్ధుడు కైవల్యము నొందిన మూడువందల ముప్పది వత్సరములకు "వటగామిని" నృపాలునిచే నిర్మింపబడినదని తెలియుచున్నది. ఈతని రాజ్యకాలముననే పిటకత్రయము గ్రంథస్థము గావింపబడినది.


లు తన్నుబాసిరి. కొందరు మృత్యువువాతబడిరి. మఱికొందరు వేరుమార్గముల బట్టిపోయిరి. తానుఛాయామాత్రసహచరుండై పరదేశమున దిరుగ వలసెను. వీని నన్నిటిని దలంచుకొని మన ఫాహియాను విషాదపూరితు డయ్యెను. ఆతని హృదంతరాళమున విచారభావము లావరింపజొచ్చెను. అతడనిర్వాచ్యమగు మనోవేదన ననుభవింపసాగెను. ఒక్కనాడు మరకతవిగ్రహముచెంత నొక వణిజుడు తెల్లని చీనాంశుకానిర్మితమగు నొక తాలవృంతము నామూర్తికి సమర్పించుచుండెను. మన పాంథుడాతనిజూచి చకితు డయ్యెను. ఆతని ముఖలక్షణములు వీక్షించినంతనె యాతని కనుగవలనుండి యశ్రుజలములు జలజల రాలెను.♦

పూర్వ మీద్వీప మేలిన నృపవరు డొకడు మధ్యభారతమునకు దన చారులనంపి బోధివృక్షశాఖ నొకదానిని దెప్పించి బుద్ధమంటప సామీప్యమున బాతించెను. ఈకొమ్మ వేరుదొడగి రెండు వందల యడుగుల యెత్తునకు బెరిగి మహావృక్ష మయ్యెను.* కొంతకాలమున కీ మహీ

---

♦ ఈవీవన నొసంగినవర్తకుడు చీనాదేశమునుండి యరుదెంచిన యొక పథికుడని తోచుచున్నది. ఆతనిజూచినంతనే యంతర్గర్భితమైయున్న యాతని హృదయ తాప మొక్కసారిగ పెల్లుబికెను. నేత్రయుగ్మములనుండి బాష్పధారలు గురిసెను.

* సింహళద్వీపమున విలసిల్లు ప్రఖ్యాతబోధి ద్రుమవృత్తాంతము నిచ్చట మనఫాహియాను సవిస్తరముగ వర్ణించియున్నాడు. ఈపాదప మిప్పటికిని సింహళమున గలదు. బౌద్ధధర్మముల బోధించుటకై అశోకతనయుడగు మహేంద్రుడు సింహళమునకు బోయెనని వేరొకచోట జెప్పియుంటిమి.



సింహళద్వీపమందలి ప్రఖ్యాతబోధిద్రుమము. బ్రహ్మాండమగు ఛాయలుగల యీ ప్రాచీనమగు వృక్షరాజము.

(156)

దుహా మాగ్నేయదిశగా నొరగిపోవుటచే సింహళరాజ్య మ్మపుడది నేలబడిపోవునేమో యని భీతిల్లి యెనిమిదిజానల కైవారముగల్గిన యొక కాష్ఠమును దానికి, ఊతగా వెట్టెను. ఈ యూతకఱ్ఱ, వృక్షమును గలసినచోట నాతరువు చిగిరింపదొడగెను. ఒకయంకుర మాతరుకాండమును చీల్చుకొని క్రిందికి దిగి భూమిలో బ్రవేశించి వేరులదొడిగెను.

ఈ యంకురముయొక్క కైవార మిప్పుడు నాలుగు జానలుండును. ఈయూడ చీల్చుకొని పోవుటవలన నాకాష్ఠము, పొడుగునను చీలి బ్రద్దలైనను కాష్ఠశకలము లాయంకురము నుండి తొలగిపోవక దాని నంటియే యున్నవి.

ఈ పాదపముక్రింద నిప్పు డొక విహారము నిర్మింపబడి

తనకు చేదోడుగా నుండుటకై యీతడు తన చెలియలగు "సంఘమిత్రి"ను గూడ తనకడకు రావించుకొనెను. ఈమె బౌద్ధభిక్షుణియై బౌద్ధమతప్రచారమునందే తనజీవితమంతయు గడపిన మహాసాధ్వి. తపస్విని. ఈసన్యాసిని సింహళద్వీపమునకు బోవుచు బుద్ధగయాక్షేత్రమునందలి బోధివృక్షశాఖను నొక దానిని దీసికొనిపోయి యచ్చట బాతించెను. ఇది పెరిగి మహావృక్షమయ్యెను. ఇయ్యదియే యితిహాసప్రసిద్ధమై భూమండలములోని కెల్ల మిగులపురాతన వృక్షమని పేరువడసిన బోధిద్రుమము. దీనికంటెను పురాతనమగు వృక్షమీ ప్రపంచమున లేదని చరిత్రపరిశోధకులు నిర్ణయించియున్నారు. ఇది రెండు వేల హాయనములనుండి జీవించుచున్నది. సింహళనృపుడు తనచారుల గయాక్షేత్రమునకంపి, దానికొమ్మను దెప్పించెనని ఫాహియాను డీమహీరుహ జన్మవృత్తాంతమును వేరొకవిధమున వర్ణించియున్నాడు. ఈతడు మహేంద్ర సంఘమిత్రల కథనమును వినియుండలేదని యూహింపవలసి వచ్చుచున్నది.

యున్నది. ఆసీనుడై యుండినట్లు చెక్కబడిన బుద్ధవిగ్రహ మొకటియిచ్చోటగలదు. బౌద్ధయాత్రికు లెడతెరపిలేక యీ మూర్తి నెప్పుడును దర్శించి పోవుచుందురు.

సింహళద్వీపరాజధానీనగరమున నింకొక విహారము గలదు. ఇది బుద్ధుని దంతమునకై గట్టబడిన విహారము. సప్తమణివిరాజితమై మనోహరముగ నున్నది.

సింహళప్రజల భక్తివిశ్వాసములు మనయాత్రికున కాశ్చర్యము గొల్పెను. ఈరాజ్యవిభుడును మిగులభక్తిపరుడు. మతధర్మముల నాతడు కడుభక్తిశ్రద్ధలతో నిర్వర్తించును. రాజ్యస్థాపనమైననాటనుండియు నీద్వీపమున పోరాటములు శూన్యమయ్యెను. విప్లవకల్లోలములు జనింపవయ్యెను. అనావృష్టిదోషమావహిల్లినదిలేదు. క్షామదేవత పొడగానరాదయ్యెను. ప్రజ లెట్టి కష్టము నెరుంగక హాయిజెందిరి.

ఈద్వీపమందలి శ్రమణకుల ధనాగారమున మణులును, రత్నములును, మౌక్తికములును కుప్పలుగా బడియున్నవి. ఒక్కమారు సింహళరాజ్యమును పాలించునృపాలు డొక్కడీభాండారమును దర్శించుట సంభవించెను. ఆమణిరాసులజూచి యాతని కన్నులు గుట్టెను. వాని గొనిపోవలె ననుదురాశ యాతనిమనము వరించెను. కాని మూడుదినములైనగతింపకమున్నె యాతనిమనస్సువిరిగిపోయెను. ఆతడుపశ్చాత్తప్తుడై శ్రమణకులకడకేగి శిరమును నేలపైగొట్టుకొని తాను దుర్భావప్రేరితుడైనందులకెంతెయు పరితాపము నొందుచు "శ్రమణకులారా! రాజ్యాధిపుడనైన నీభాండారమున నడుగువెట్టనీయకుడు. సన్యాసి దీక్ష



గైకొని నలువది దీర్ఘవత్సరములు తిరిపె మెత్తికొనుచు దేశాటన మొనర్చిన విరాగులుదక్క నన్యులెవ్వరును దీని ప్రవేశింపరాదని కఠినముగ శాసింపుడు" అని విలపింపసాగెను.

సింహళనగరమున వైశ్యకుటుంబము లెన్నియో గలవు. వారిగృహములు రాజసౌధములవలె వైభవోపేతములై రమణీయముగ నున్నవి. పురవీథులన్నియు చదునై విశాలములై మలినవిహీనములై ప్రశాంతముగ నున్నవి. నాలుగువీథులును గలసిన మొగదల ప్రదేశములందు పెద్ద పెద్ద సభామంటపములు నిర్మింపబడినవి. ప్రతిమాసమునను అష్టమి, చతుర్దశీ, పూర్ణిమా దినములందీమంటపములలో సభలు గావింపబడి బౌద్ధధర్మము లుపదేశింపబడును. ఆదినములలో నీసభాస్థానము లన్నియు జనులతో గిటకిట లాడుచుండును. మతోపదేశముల నాలకించుటకై పురజనులు పలుప్రాంతములనుండి యీ సభాస్థలములకు గుంపులు గుంపులుగ తరలిపోయెదరు.

సింహళద్వీపమున నరువదివేల బౌద్ధసన్యాసులు గలరని ప్రతీతి. వీరలకు భోజనము లొసగుటకు అన్న సత్రములు కట్టింపబడినవి. సింహళ నృపుడు తన రాజధాని నగరమున నైదారువేల బౌద్ధశ్రమణకుల కనుదినమును భోజనము లిడుటకై ధర్మశాలల నిర్మించెను. భిక్షువులు క్షుద్బాధాపీడితులైనపుడెల్ల నీధర్మశాలల కరిగి తమ కక్షపాలల నిండ నన్నమును గొని వచ్చి భుజించుచుందురు.

ఇచ్చట ప్రతియేడును "దంతమహోత్సవములు" జరుగును. ఈ యుత్సవములు జ్యేష్ఠమాసాంతమున ప్రారంభ

మగును. ఉత్సవ ప్రారంభమునకు ముందుగ సింహళవిభుఁడొక మత్తేభమును రావించి నేత్రపర్వముగ దాని నలంకరించి రాచయుడుపుల దొడిగిన యొక మనుజుని దానిపై గూర్చుండ నియమించును. ఈ మనుజు డాదంతావళముపై నధివసించి భేరీమ్రోగించుచు పెద్దకంఠస్వరముతో నిట్లుపన్యసించుచు నా గజమును పురవీధుల వెంబడి దోలుకొని పోవుచుండును:—

“బోధిసత్త్వుడు మూ డసంఖ్యేయకల్పములు * లోక కల్యాణమునకై భూమండలమున సంచరించెను. ధర్మసంస్థాపనకై తన జీవముల భారవోసెను. రాజ్యవైభవముల బరిత్యజించెను. దారాసుతల విడనాడెను. శరీరసౌఖ్యముల తృణీకరించెను. తన నయనములబెరికి సోదరమానవునకు కానుకగ నొసంగెను. తనమేని కండలగోసి నాళువమునకు విసరి భయార్తయగు కపోతవిహంగమును రక్షించెను. తనశిరమును దరిగి యొకమనుజునికి దాన మిచ్చెను. ఆకలిగొన్న వ్యాఘ్రమునకు తనదేహము నాహారముగ నిడెను. ఈ ప్రపంచమందలి జీవరాసుల క్షేమమునకై ఆతడిట్టి బాధల ననుభవించెను. బుద్ధు

* సృష్ట్యాది లయపర్యంతము వ్యాపించు కాలమునకు కల్పమనబడును. అట్టి కల్పములు పెక్కు గలిసి యొక అసంఖ్యేయకల్ప మగును. అట్టి యసంఖ్యేయకల్పములు నాలుగుగూడిన యొక మహా కల్పమగును. చీనాగణిత శాస్త్రజ్ఞు లసంఖ్యేయమన, 1,000,000,000,000,000,00 గల సంఖ్యయని నిర్ణయించి యున్నారు. త్రివిష్టప, సింహళ శాస్త్రజ్ఞులు అసంఖ్యేయమన యొకటి తరువాత తొంబది బిందువులు గల సంఖ్యయని నిర్వచించి యున్నారు.



డై అతడీ భూవలయమున నలువదియైదువత్సరములు జీవించి మానవాళికి బౌద్ధ ధర్మముల నుపదేశించెను. వేలకొలది ప్రజానీకమునకు బౌద్ధదీక్ష యొసంగెను. ఆత్మశాంతిలేక పరితపించెడు మానవులకు, చిత్తశాంతి నొనగూర్చి కైవల్యపదమునకు దారిజూపెను. జీవకోటులకు తానొనర్పవలసిన దంతయు నొనర్చి యాతడీలోకమును వీడిపోయెను. అప్పటినుండియు (పదునాల్గు వందల తొంబదియేడు వత్సరములనుండి) పృథ్వీమండలమున జగజ్జ్యోతి యస్తమించెను. జీవరాసులన్నియు దుఃఖమున మునిగి యున్నవి. “ఇంక పదిదినములలో బుద్ధునిదంతము బయటకు దీసికొనిరాబడి, అభయగిరి విహారమునకు గొనిపోబడును. కాన ప్రజలందరును, సౌఖ్యముల బడయుదలతురేని, పురవీధుల నూడ్చి సలిలముల జల్లుడు. గృహావళుల మనోహరముగ నలంకరింపుడు. కుసుమజాలములను కర్పూరాది పూజాద్రవ్యములను సమకూర్చి దంతమున కర్పింపుడు” ఇట్లు ప్రకటించుచు నా మనుజుడు పురవీధు లన్నియు దిరుగును.

పిమ్మట సింహళాధిపుడు, సామ, సుదాన, గజరాజ, హరిణ, అశ్వ మున్నగు బోధిసత్త్వుని యవతార ♦ విగ్రహ

♦ బోధిసత్త్వు డిట్టియవతారముల నైదువందల నెత్తెనని బౌద్ధ వాఙ్మయమున వర్ణింపబడినది.

సామ—ఈ యవతార కథనము “సామజాతకమున” వర్ణింపబడినది. ఈ యవతారమున బోధి సత్త్వుడు సౌదామినీలతయై భూమండలమున మెరసెను,

సుదాన—బుద్ధావతారమునకు బూర్వపు యవతారము నందీ వృత్తాంతము “వెస్సంతర” జాతకమున [వర్ణింపబడినది. ఈ యవతార

ములను, తన నగరి ప్రధానవీధి కిరుకెలంకులందును బ్రదర్శించును. ఈ చిత్తరువులు భావగర్భితమై జీవకళ లుట్టిపడునట్లత్యంత మనోహరముగ జిత్రింపబడినవి. సజీవములతో నున్నవాయని చూపరుల మనముల భ్రమింపజేయుచుండును.

అనంతరము బుద్ధుని దంతమీ మార్గముననే అభయగిరివిహారమునకు గొనిపోవబడును. మార్గమధ్యమున ప్రతిగృహము వాకిటను జను లీదంతమునకు కుసుమఫలాదు లొసగి జోహారు లొనర్తురు. ఇట్లీదంతము మహావైభవముతో గిరివిహారము జేరును. అచ్చట తొంబది యహర్నిశములు మహోత్సవములు గావింపబడును. వీని నవలోకించుటకై పలుప్రాంతములనుండి వేలకొలది జనసంతతు లరుదెంతురు. విహారపరిసరము లన్నియు జనసమూహములచే గ్రిక్కిరిసిపోవును. ఉత్సవములు సమాప్తియైనపిమ్మట నీదంతము మరల పురమందలి విహారమునకు గొనిపోబడి యథాస్థానమున నుంచబడును. ఉపవాసదినములం దీవిహారద్వారములు తెరువబడి యథావిధిగ నారాధనకృత్యములు నిర్వర్తింపబడుచుండును.

మున “సుదానుడై యుద్భవిల్లి, బోధిసత్త్వుడు మహాత్యాగియై, దానశీలుడై పరిఢవిల్లెను. సుదానావతారమున బోధిసత్త్వుడొక్కమారిట్లు బల్కినట్లు నిదానకథయందు జెప్పబడినది:— “ఈ పృధ్వి, సుఖదుఃఖముల నెరుగని యచేతన పదార్థమయ్యు నా దానకర్మలచే యుద్భవిల్లిన మహాశక్తిచే, నేడు సారులు చలించెను.” “సామ”, “వెస్సంతర” జాతక కథావర్ణనలు సాంచి స్తూపశిల్పచిత్రములలో గాన నగును.

తక్కినయవతార వృత్తాంతములుగూడ జాతకకథలలో సవిస్తరముగ వర్ణింపబడియున్నవి.



అభయగిరివిహారమునకు ప్రాగ్దిశగా నలువదిలీలదూరమున నొకపుణ్యశైలము * గలదు. ఈ నగోపరిభాగమున “ఛద్రిక” యనబడు విహారమొండు గలదు. ఇందు రెండువేలమంది బౌద్ధసన్యాసులు నివసించుచుందురు. వీనిలో ధర్మగుప్తుడను శ్రమణుడొకడు గలడు. ఈతడు మిగుల మహిమాఢ్యుడని యిచ్చటి ప్రజలెల్ల రీతనికి నమస్కరింతురు. ఈతడు నలువదివత్సరము లేకాగ్రముగ నొక పర్వతగుహయందు నివసించెను. ఈతడు తన కారుణ్యప్రభావముచే మూషిక, భుజంగముల నొకచెంతనే నివసింపజేయగల్గెను. ఈదుష్టకీటకము లీతని గహ్వరమున తమ సహజవైరమును మరచి కలిసిమెలంగి మనుచుండును.

---

* ఇయ్యది “మహింటాల” యనబడు నొక పుణ్యనగము. బోధి వృక్షమునకు తూర్పుదెసగా నెనిమిది మైళ్ల దూరమున నున్నది.

# ముప్పది తొమ్మిదవ ప్రకరణము

## ఒకానొక యర్హాతుని దహనసంస్కారము.

సింహళపురికి దక్షిణభాగమున నొక యరక్రోసుదూరమున “మహావిహార”మను పేరుగల్గిన విహార మొండు గలదు. ఇచ్చట ప్రసిద్ధుడగు శ్రమణకుడొక్కడు నివసించువాడు. ఈతడు మిగుల సాధుశీలుడు. ప్రవిమలవర్తనుడు. మహాతపస్వి. ఈ సన్న్యాసి అర్హాతుడని ప్రజలు చెప్పుకొనజొచ్చిరి. ఈతని నిర్వాణకాలము సమీపించినంతనే సింహళరాజ్యనృపు డతని ప్రేతమున కెట్టి దహనసంస్కారవిధులు గావింపవలెనో నిర్ణయించుటకై భిక్షువుల నందరిని బిలువనంపి యొకసభ గావించెను. సభాసదులందరు నాశ్రమణకశ్రేష్ఠు డర్హాత్వము నొందెననియు అర్హాతుని ప్రేతమువలెనే యాతని దేహమును సంస్కరింపబడవలెననియు నిర్ణయించిరి. నృపాలుడును ఇతడు దివికేగినంతనే విధివిధానముగ అర్హాతుని ప్రేతమున కొనరింపవలసినరీతిని యాతని మృతశరీరమున కగ్ని సంస్కారము గావించెను.

“మహావిహారము”నకు తూర్పుభాగమున నృపాలుడు ముప్పదియడుగుల చతురమును ముప్పదియడుగుల యున్నతియు గల్గిన యొకపెద్ద చితిని చేర్పించి దానియుపరిభాగమున చందన, కర్పూర, కర్పూరాది సుగంధకాష్ఠముల బరిపించెను. ఈ చితి నధిరోహించుటకు నాల్గువైపులను నాలుగు సోపానశ్రేణు లమర్పబడెను. అర్హాతుని మృతకళేబరమునకు దెల్లని కాశ్మీరవలువ జుట్టి దాని నొక శవవాహనమున నుంచి చితికడకుం గొనిపోయిరి. నృపాలుడును, శ్రమణకులును పాదచారులై శవము వెంట చితిప్రదేశమునకు బోయిరి. ఆదహనసంస్కారము నవలోకించుటకై జనసంతతులు వేలకొలది యా చితిప్రదేశమున మూగిరి. శవవాహనము చితిప్రదేశమును జేరినంతనే అచ్చట జేరియున్న జనసంతతులు దానిపై కుసుమవర్షము గురిపించిరి. కొందరు కర్పూరహారతు లిచ్చిరి. పిమ్మట శవవాహనమును చితిపై నెక్కించి చితికాష్ఠములపై తులసీతైలమును జల్లి చితి కగ్ని ముట్టించిరి. చితానలము రగుల్కొని భగభగమని మంట లెగయుచుండ, చూపరులనుండి హాహాకారములు జనించెను. కొందరు తమ కంఠసీమలనుండి వ్రేలెడు యుత్తరీయములదీసి చితిపైకి విసరిరి. కొందరు తమ హస్తములనుండెడు తాళవృంతముల, గొందరాతపత్రముల నాయగ్ని జ్వాలాగ్రమున బడవైచిరి. దహనసంస్కారము పూర్తియైన పిమ్మట నా యర్హాతుని యస్థికలనేరి వాని నొక్కచోట నిక్షిప్తమొనర్చి యాప్రదేశమున నొక స్తూపమును గట్టించిరి. ఫాహియాను సింహళద్వీపమున కొక్కింత యాలస్యముగ బోవుటచే నాయర్హాతునిజీవములతో జూచుభాగ్య మతనికి లేకపోయెను. కాని యాతని దహనసంస్కారమునుమాత్ర మీక్షింపగల్గెను.

ఈ తరుణమున సింహళరాజ్యమును పాలించు రాజు బౌద్ధ సన్యాసుల యావాసమునకై నూతనవిహారమొకటి కట్టింప నెంచి బిక్షువుల బిలువనంపి యొకమహాసభ గావించెను. సభకు విచ్చేసినశ్రమణకులకు భోజనాదులొసగి యటుపిమ్మట బలిష్ఠములై, మిసమిసలాడు నొకవృషభముల జతను దెప్పించి వానిశృంగములకు మణిస్థగితములగు భూషలదొడిగి యొక బంగరునాగలి కాయెద్దులబన్ని నృపాలుడు తానే నాగలికఱ్ఱను హస్తమునబట్టి యొకవిశాలభూప్రదేశమునకు నాల్గువైపులను నాలుగుచాళ్లనుగీచి యామధ్య భాగమునవిహారమును గట్టించెను. ఆపరిసరములనుండు గ్రామములను, మాన్యములను, గృహములనుభిక్షువులకు దానమొసంగి వారలాచంద్రతారకముగ ననుభవింప లోహఫలకములపై దానశాసనముల వ్రాయించెను.

ఫాహియాను సింహళద్వీపముననుండగ, ఆర్యావర్తమునుండి అచ్చటి కొక బౌద్ధసన్యాసి యేతెంచెను. ఈతడొక సూత్రపండితుడు. అత్యున్నతమగు నొక శిలావేదికపై నిలుచుండిసూత్రముల పఠించుచు నీశ్రమణకుడిట్లుపన్యసింప దొడగెను:—

♦ ఈ నృపుడు క్రీ. శ. 410 సంవత్సరము నుండి 432 వరకును సింహళ ద్వీపమునేలిన "మహానామ" యై యుండును. ఈతనికి పూర్వము సింహాసన మధిష్ఠించిన "ఉపతిస్స" (368-410) నృపాలుని రాజ్యకాలమున పీతికాత్రయము సింహళభాషలోనికనువదింపబడెను. మహానాముని పరిపాలనమున "బుద్ధఘోషుడు" భాష్యముల వ్రాసెను. ఈ రాజులిరువురును పెక్కు విహారముల గట్టించి కీర్తివడసిరి. వీరి చరిత్రము "మహావంశమున" సాకల్యముగ వర్ణింపబడినది.



"బుద్ధుని కఱ్ఱపాల తొలుత వైశాలీరాజ్యమున నుండెడిది. ఇప్పుడది గాంధారమునఁనున్నది. ఇన్ని శతాబ్దములైన పిమ్మట (ఫాహియానుశ్రమణకుడు వివరించిన సంఖ్య మరచిపోయెను) నిది పశ్చిమ తుఖారమునకుబోవును. ఇన్నిశతాబ్దములు దాటినవెనుక కుస్తానమునకేగెను. అచ్చట కొన్ని శతాబ్దములుండి యటుపిమ్మట ఖరస్కార ♦ దేశమునకు వెడలును. ఖరస్కారమునుండి తిన్నగ చీనాకుబోవును. అటనుండి సింహళమునకరుగును. సింహళమునుండి మరల మధ్యభారతముకేగి యచ్చోటనుండి కడకు తుషితస్వర్గము నధిరోహించి యదృశ్యమగును. తుషితస్వర్గమున కేగినంతనే, మైత్రేయబోధిసత్త్వుడీకఱ్ఱపాలనుగాంచి "శాక్యసింహుని కఱ్ఱపాల యరుదెంచిన" దని సంతోషభావము లొనర్చుచు, తక్కిన యమరుల బిలువనంపి వారితోగలిసి దీనికేడుదినములు, స్వర్ణకుసుమములతో పూజలొనర్చి కర్పూర నీరాంజనములిచ్చును. తదుపరి యాకఱ్ఱపాల మరల జంబూద్వీపమునకు మరలిపోవును. జంబూద్వీపవాసియగు నొకనాగులఱేడీకఱ్ఱపాల కెదురేగి, దానినితన సౌధమునకుగొనిపోవును. మైత్రేయునకు బుద్ధత్వము సిద్ధించుతరుణమాసన్నమైనతోడనే యీ కఱ్ఱపాల, నాలుగు కఱ్ఱపాలలుగ విడిపోవును. పిమ్మటనివినాలుగును తమ నిజనివాసమగు "అన్నపర్వత" ✱ శృంగమునకు బోయిచేరును.

♦ ఈ రాజ్యము తీన్‌షన్ పర్వత శ్రేణులకు సమీపమున, బోష్టన్ సరస్సున కుత్తరభాగమున నున్నది.

✱ మేరువుచుట్టును వలయాకారముగనుండు పర్వత శ్రేణులలోనొక శ్రేణి.

మైత్రేయుడు బుద్ధుడైనవెనుక నల్వురు నిర్జరవిభులు నీ కత్తుపాలల మరల నొక్కటిగజేయుదురు. భద్రకల్పమున నవతరింపబోవు సహస్ర బుద్ధులును దీనినే ధరింతురు. ఇది భూమండలమునుండి యదృశ్యమైనపుడు, బౌద్ధమత మస్తమించును. అంగట నీక్షోణీతలమున నివసించు ప్రజాళికి పెక్కుసంకటములు గల్గును. మానవులజీవిత పరిమాణము హ్రస్వమగును. జను లైదేండ్లకంటె నెక్కువ కాలము జీవింపరు. భూమండలమున ధాన్యక్షీరములకు గరవగును. ప్రజలు దుర్ణయులై దౌష్ట్యములకు గడగెదరు. వారుస్పర్శించు తరు లతాదులు ఖడ్గములు మున్నగు మారణోపకరణములుగ మారిపోవును. జను లొకరిపై నొకరు గవిసి, దారుణముగ బొడుచుకొని హతు లగుదురు. పృథ్వియంతయు రుధిరపూరితమైపోవును. వీరిలో సుజనులగువారలు తమ యావాసములవీడి పర్వత ప్రాంతములకు బారిపోయి, ప్రాణముల గాచుకొందురు. దుష్టజనులందరు నిశ్శేషమైనపిమ్మట, వీరు మరల తమనివాసములకు మరలి పశ్చాత్తప్తహృదయులై తమలో తా మిట్లు చింతిల్లెదరు: “పూర్వకాలమున జనులు చిరకాలజీవులై వర్ధిల్లిరి. మనమో, అల్పాయుర్దాయులమై ఐదేండ్లకే మృతినొందుచు క్షయ మొందుచుంటిమి. దురాచారులమై వర్తిల్లుటచేతనే మన కీదురవస్థ సంఘటిల్లినది. మన యాయు వల్పమైనది. ఇప్పుడైనను సత్పథమున చరించెదముగాక! ధర్మనిరతులమై, సోదరమానవులయెడ ప్రేమాస్పదులమై మెలగితిమేని మన యాయుఃప్రమాణము ద్విగుణీకృత



మగుచు నెనుబదివేల హాయనములవరకును వృద్ధినొందును. మైత్రేయబోధిసత్త్వుడు భూలోకమున నవతరించి బౌద్ధధర్మముల నుపదేశింప మొదలుపెట్టునపుడు శాక్యసింహునిచే నుపదేశమంది సంసారసౌఖ్యముల త్యజించి, సన్న్యాసి దీక్షగైకొనినవారికిని, త్రిశరణ్యముల స్వీకరించి, పంచ నిషేధములను అష్టవర్జితములను నుపవసించుచు మణిత్రయమును పూజించువారలకును, తొలుదొల్త కైవల్యము నొసంగును. పూర్వకర్మఫలితముగ నీజన్మమున బౌద్ధమతస్వీకారము లభించుచు వారలకు పిదప ముక్తినొసంగును.”

ఈ మనుజుని వాక్యపుంజములు సూత్రభాగములోనివని దలంచి మనఫాహియాను వానిని వ్రాయబోవుచుండ నాతడు “ఈవచనములు నావియెగాని యేసూత్ర మూలములోనివిని గా”వని తెల్పుటచే మన పధికుడు దత్ప్రయత్నముల విరమించెను.

# నలువదియవ ప్రకరణము

:o:

సింహళతీరమున యోడనెక్కి ఫాహియాను చీనాకు బోవును.

ఫాహియాను సింహళద్వీపమున రెండు వత్సరములు నివసించి మరికొన్ని బౌద్ధగ్రంథముల సముపార్జించెను. "మహేశా" ♦ శాఖీయులకు ప్రమాణగ్రంథమగు వినయపీఠికయు, దీర్ఘాగమ సంయుక్తాగమ సూత్రములును, * సంయుక్తసాంఖ్యపీఠికయు ‡ మున్నగు నపూర్వ సంస్కృతగ్రంథము లాతనికి లభించెను. ఇవి చీనాదేశమున నెచ్చటను గానరానివి. ఇట్టి యమూల్య గ్రంథరాజముల నెంటఁగొని యాతడొక పెద్ద వర్తకనౌక నెక్కి సింహళమునుండి చీనాసామ్రాజ్యమునకు బయనమయ్యెను. ఈ యోడపై నిన్నూరుమంది బాటసారులుండిరి. తుపానువీచి ప్రమాదము సంభవించునెడల, పాంథులప్రాణరక్షణార్థ ముపయోగపడుటకై చిన్న నావయొకటి యీ నౌకకు వ్రేలాడ గట్టబడియుండెను. గాలి యనుకూలముగ వీచుచుండ ప్రాగ్దిశాభిముఖమై యోడ మెల్లగ సింహళతీరమునుండి బయలుదేరెను. మూడుదినముల వఱకును నౌక సురక్షితముగ బ్రయాణమొనర్చెను. నాల్గవ దినమున నాకసమున తుపానులక్షణములు గన్పించెను. క్రమముగ సమీరములు ప్రచండమై భీకరమయ్యెను. ఈ ప్రళయమారుతమున కాయోడ మద్యమునుద్రావి మత్తిల్లిన మనుజుని పగిది నడిసముద్రమున నూగులాడజొచ్చెను. తీవ్రవాయుఘాతముల భరింపజాలక మరికొంతవడికి దది పగిలి చిల్లిపడెను. ఆ రంధ్రమునుండి జొర జొర సముద్రజలములు లోనికి ప్రవహింప దొడగెను. ఆ యోడలోని బాటసారులగుండె లవిసిపోయెను. ఓడలోనుండిన చావు నిక్కమని భీతిజెంది వారలోడకు గట్టబడియున్ననావలో నెక్కి ప్రాణముల రక్షించుకొనుటకై త్రోసుకులాడజొచ్చిరి. కాని యదియు నసంభవమయ్యెను. ఆచిన్న నావలో నిన్నూరుపాంథు లొడ్డుచేరుటెట్లు? అందరును యాక్షుద్రనౌకలోని మునుగుటకు సిద్ధముగుచుండ, ప్రమాదము వాటిల్లునని దిగులొంది యోడనావికులు సాహసించి నావకు గట్టబడియున్న త్రాళ్లను తెగనఱికిరి. నావ త్రుటిలో నా భయంకర సముద్రమునబడి యదృశ్యమైపోయెను. పాంథులయాశ లడుగంటెను. నౌక నీటితో నిండిపోవుచుండెను. ఓడలో ప్రయాణముసల్పు వణిజు లందరును వెనుకముందు లారయక తమకడనుండు భారమగు సరకుల నెత్తి సముద్రమున బడవేయసాగిరి. ఫాహియాను తన "కుండిక"ను, (పాత్రను) మరికొన్ని వస్తువులను జలధిలో జారవిడిచెను. భార

---

♦ మహేశా శాఖ. సర్వాస్తివాద శాఖలోని యొక యుపశాఖ.

* హీనయాన సూత్రములకు "ఆగమము" లని పేరు. ఇవి చతుర్విభాగములుగ విభజింపబడినవి. అందు ప్రథమ విభాగమునకు దీర్ఘాగమములనియు, తృతీయ విభాగమునకు సంయుక్తాగమములనియు పేళ్ళు. ప్రథమవిభాగమున సన్యాసులు పాటింపవలసిన శిక్షణనియమములు వివరింపబడినవి.

‡ ఈపీఠిక బౌద్ధవాఙ్మయమున చతుర్థపీఠికగ బరిగణింపబడెను. కాని బౌద్ధ వాఙ్మయమున నిప్పుడీగ్రంథ మెచ్చటను గానరాకున్నది. కాలవాహినిలో గలిసిపోయి యుండవోవు.

తవర్షమునుండి గొనివచ్చుచున్న గ్రంథరాజములను, బౌద్ధ విగ్రహములను నావికులెక్కడ నీటిలో బారవైచెదరోయని దిగులుపడుచు మన ఫాహియాను యవలోకితేశ్వరునిపై చిత్తము నిల్పి, 'దయామయా! యీ యుపద్రవమును దప్పింప నీయదియే భారము. బౌద్ధధర్మముల నెరుంగుటకై కడుదూరము ప్రయాణముసల్పితిని. ఇప్పుడీనడిసముద్రమున జిక్కువడితిని. నీయద్భుతమహిమచే నన్నుమరల చీనాసామ్రాజ్యమున జేర్చి రక్షింపు"మని ధ్యానింపజొచ్చెను.

ఇట్లీ మహాతుపాను మహాభయంకరముగ పదమూడహోరాత్రములు వీచెను. ఎట్టకేలకు ఓడగొట్టుకొనిపోయి యొక ద్వీపమును జేరెను. అంతట వాయువేగము తగ్గెను. తరంగముల యుధృతము చల్లారెను. ప్రమాదముదప్పెను. ఓడయడుగున బడినరంధ్రము గాన్పించెను. చిల్లి కప్పివేయబడెను. ప్రయాణము మరలయథాస్థితిగ సాగెను. కాని యిప్పుడైనను ఓడ సురక్షితముగ గట్టుచేరుననుయాశ లేకుండెను. ఒకగండము దప్పిన మరియొకటి యెదురగుచుండెను. ఆపరసరి సముద్రప్రాంతమంతయు నోడదొంగలకు స్థావరము. వారికంటబడిన నౌకదప్పించుకొనిపోవుట కల్ల. దరిగాన్పింపదు. కనుచూపుమేర దూరమున నెటుజూచినను మహాజలరాశి, అపారపారావారమే గాన్పింపజొచ్చెను. ఓడ యేదిశకు బోవుచుండెనో తెలియదయ్యెను. దిక్కులు తెలిసికొనుట దుస్సాధ్యమయ్యెను. సూర్యచంద్రనక్షత్రగణములగతినిబట్టియే నావికులోడను నడుపజొచ్చిరి. ఆకసము మేఘావృతమై చీకట్లు గ్రమ్మి నక్షత్రరాసులు గానరానవు



నోడ వాయుదేవుని హస్తమున బందియై యాతడు గొనిపోయినచోటికెల్ల బోవుచు నడువజొచ్చెను. నిశాసమయముల నవిలకాంతుల బురుడించు తళుకుల గ్రక్కుచు బడును లేచుచుండు తరంగమాలికలుదప్ప వేరెవ్వియు గానబడవయ్యెను. అప్పుడప్పుడు సముద్రజలముల నివసించు నూత్రనక్ర మహాకచ్ఛపాది జీవరాసులు దృష్టిపథమున బడుచుండెను. దారియు తెన్నును గానక పవనఘాతములకు గురియగుచు, నామహాసముద్రమున జిక్కుకొనుట గాంచి యేమిగతియని పాంథులు దిగులుపడజొచ్చిరి. అచ్చటి సముద్రమంతయు మహాయగాధమగుటచే లంగరువైచి యోడ నాపుటకైనను సాధ్యపడకుండెను. నాలుగయిదుదినము లిట్లు గడచెను. ఓడ గాలి కొనిపోయినకెల్లల బోవుచు యాయంధకారబంధురమున బడి ప్రయాణమొనర్చెను. ఐదవనాడు భాగ్యవశమున మబ్బులు విడిపోయెను. అంబరవీధి ప్రశాంతమై తారకాగణములు గాన్పింపదొడగెను. దిక్కులు తెలియజొచ్చెను. పాంథుల మోములు వికసించెను. నౌక సరియగుమార్గమును బట్టెను. కాని యంతటితో కష్టములు గడచిపోవలేదు. సముద్రజలములలో మహాశిలలు మణగియుండును. వాని దాకెనేని యా యుపద్రవమును దప్పింప నెరికిని శక్యముగాదు. ఓడ వ్రయ్యలై వికావికలగును. పాంథుల కింక బ్రతుకెక్కడిది?

ఇట్లు చిత్తసంక్షోభమునకు గురియగును. ఎప్పుడేప్రమాదము వాటిల్లునో యని ప్రాణములరచేత నిడుకొని యా బాటసారులు తొంబదిదినములు ప్రయాణమొనర్చి యెట్టకేల

కు "యావ" ద్వీపమను నొక ద్వీపమును జేరిరి. ఇచ్చట బ్రాహ్మణమతము మున్నుగాగల కుమతములె మిగుల ప్రబలముగనుండెను. బౌద్ధమతము కడు దైన్యస్థితియందుండెను.

మన ఫాహియాను యావద్వీపమున నైదుమాసములుండి పిమ్మట నొకవర్తకనౌక నెక్కి మరల బయలుదేరెను. ఈ యోడపైగూడ నిన్నూరుపాంథు లుండిరి. ఏబదిదినములకు సరిపోవు సంబారములు మాత్రమీ "జలవాహిని" పై నుండెను. ఆషాఢబహుళ విదియా దినమున, గాలి యనుకూలముగ విసరుచుండ నోడ యీశాన్యదిశాభిముఖమై బయలుదేరెను.

వాంగ్‌ఛౌ పట్టణము మన బాటసారుల గమ్యస్థాన మగుటచే నోడ యీశాన్యదిశగా బోవుచుండెను. వార లొక్క మాస మెట్టిప్రమాదము నెరుంగక సురక్షితముగ ప్రయాణమొనర్చిరి. అంతట కష్టములు మరల ప్రారంభమయ్యెను. ఒక్కనాటిరేయి రెండవ యామమున నాకస్మికముగ గగనభాగమంతయు మేఘావృతమై భీకరమగు తుపాను వీవదొడగెను. హోరున వర్షము గురియజొచ్చెను. ఆయుత్పాతలక్షణములగాంచి బాటసారుల ప్రాణము లెగసిపోయెను. ఫాహియానుడు రక్షింపుమని యవలోకితేశ్వరుని ప్రార్థింపసాగెను. వాని యనుగ్రహమువలన నెట్టిహానియు దొరలకుండ యారేయి గడచెను. ప్రభాతమైనతోడనే యా యోడలోని బ్రాహ్మణమతావలంబు లందరును నొక్కచోట సభదీర్చి యిట్లు వితర్కింపసాగిరి. "మన యోడలో నీబౌద్ధసన్యాసి యుండుట



వలననే మనకీ మహావిపత్తు సంభవిల్లినది. మనమీతని నీ ప్రాంతముననుండు ద్వీపములలో నేదేని యొకద్వీపమున దించిపోయితిమేని మన కీయాపద దప్పును. ఒక్క మానవుని కొరకై యిందరి ప్రాణముల గోల్పోవుట మిగుల యవివేకము." అదృష్టవశమున నాయోడపై ఫాహియానుని కొక మిత్రుడుండెను. ఆతడు వీరల దుష్ప్రయత్నముల కర్ణాకర్ణిగ విని వెరగుపడి యొక్కపరుగున వారికడకుజని "నిర్దయులారా! మీరొనర్చు దురాలోచనము నాకు దెలిసినది. మీ రీశ్రమణకుని నిందెచ్చటనైన విడచి పోయెదరేని, నన్నును నాతనితో దించిపోవుడు. లేదేని నన్ను చంపివేయుడు. దయాశూన్యులై యాతనికి హానితలంతురేని, హాన్నుసామ్రాజ్యమును జేరిన వెనుక, ఆరాజ్య నృపునికడకేగి మీచెయ్దములు సర్వమును వాని కెరిగింతును. చీనాసామ్రాజ్యవిభుడును బౌద్ధమతావలంబుడేయని గుర్తెరుగుడు. భిక్షువులయెడ యాతని కమితమగు పూజ్యభావము. వారి కెట్టిహాని సంభవించినను ఆతడు సైరింపడు" అని వారింప నావణిజులు భయభ్రాంతులై అట్టి దారుణమున కొడిగట్ట సాహసింపరైరి.

తుపాను క్రమముగ ప్రచండమై భీకరమయ్యెను. గగనతలమంతయు కారుమబ్బులచే నావరింపబడెను. పెక్కు దినములవరకును దినకరుడు గాన్పింపడయ్యెను. నల్గడల చీకట్లుగ్రమ్మి మార్గము గానరాకుండెను. కర్ణధారి యోడను తప్పుత్రోవ బట్టించెను. ఇట్టి తుపాను ప్రళయాంభీలముగ డెబ్బదియహోరాత్రములు విసరెను. ఓడలోని సంబారములు హ్రస్వమయ్యెను. త్రాగుటకు ఉదకముగూడ కరవ

య్యెను. శాకపాకములకు సముద్రజలమునే ఉపయోగించుచు బాటసారులు మంచినీటిని అపురూపముగ వాడుకొనవలసివచ్చెను. కొంతకాలమున కదియు శూన్యమైనది. ఎంతకును దరిగాన్పింపదయ్యెను. ఆహారవిహీనులై పాంథులా నడిసముద్రమున జీవముల బాయవలసినట్లుండెను. అంతట నావికులందరును గూడి కర్తవ్యమును యోజింపసాగిరి. "మన మీసరికే వాంగ్ ఛౌనగరమును చేరియుండవలసినది. ఈపట్టణమును జేరుట కేబదిదినములకంటె నెక్కువకాలముబట్టదు. గడువు దాటి పెక్కుదినములు గతించినవి. చూడ, యోడ మార్గము దప్పినట్లు దోచుచున్నది" అనినిర్ణయించి, యేదేని యొడ్డు జేరుకొనుట క్షేమకరమని దలచి ఓడను, వాయవ్యదిశగా మరల్చిరి. పండ్రెండుదినము లట్లు ప్రయాణమొనర్చి యెట్టకేలకు, చన్గాంగు మండలపు సరిహద్దులలో 'లో' పర్వతప్రాంతపరిసరములందు ఒడ్డుజేరిరి. అచ్చట వారికి సలిలమును, శాకాది తినుబండములును పుష్కలముగ లభించెను. గండముదప్పెను.

ఎన్నియో కష్టములబడి, గండముల గడచి, భీకర సమీరములకుగురియై, ఆకస్మికముగ యొడ్డుజేరుట యీపాంథుల కెంతయు ఆనందదాయక మయ్యెను. ఆదేశలక్షణముల బరికించి తాము జేరుకొనినది చీనారాజ్య మనికూడ గుర్తించి వారలు పులకితగాత్రులైరి. కాని యాపరిసర మంతయు జనశూన్యమై మనుష్యసంచారమే కానరాని నిర్జనప్రదేశమగుటచే అది యేప్రాంతమైనదియు దెలిసికొనుట వారికి కష్టమయ్యెను. వాంగుఛౌ పట్టణమింకను ముందే



యున్నదని కొందరును, దాటివచ్చితిమని కొందరును వాదులాడజొచ్చిరి. అడిగి తెలిసికొనుటకైన నాదాపున నెచ్చటను మనుష్యులయలుకుడు వినరాదయ్యెను. ఎవ్వరేని మనుజులు గాన్పించినయెడల అదియేప్రాంతమో అరసివచ్చెదమని యీపాంథులలో గొందరు సాహసు లొకనావనెక్కి యాంచెంతనే ప్రవహించుచున్న యుప్పుటేటిప్రవాహమున బడిపోయిరి. అట్లుకొంతదూరమేగుసరికి అదృష్టవశమున మృగయావినోదార్థమై యాప్రాంతమున దిరుగుచుండిన ఇరువురు మనుజులు దూరమున వారికంటబడిరి. అందుల కెంతయు సంతసించుచు వారిని కేకవెట్టి యామృగయుల తమవెంట యోడకడకురమ్మని కొనివచ్చిరి. ఓడలోని బాటసారులందరును చీనాభాషనెరుగని యన్యదేశీయులగుటచే ఫాహియానుని బిలిచియానూతనపురుషులతో సంభాషింపుమనిరి. ఫాహియాను వారితో నిట్లు మాటలాడసాగెను.

ఫాహియాను—అయ్యా! మీరెవ్వరు?

నూతనపురుషులు—మేము బుద్ధుని యనుచరులము.

ఫాహి—ఈపర్వతప్రాంతమున కేలవచ్చితిరి?

నూ.పు—(వెలవెలబోవుచు) + బుద్ధభగవానుని కర్పింపమధుర ఫలముల గోసికొనిపోవుటకై వచ్చితిమి. రేపాశ్వయుజ పౌర్ణమి. పర్వదినము.

---

+ నిజముగ వీరలు జీవహంతకులగు వేటగాండ్రు. వినోదమునకై మృగముల సంహరించుటకే యచ్చటకు వచ్చిరి. కాని తాము బుద్ధుని యనుచరులమని చెప్పినచో కాషాయాంబరధారియగు ఫాహియాను చింతించునని అట్లు వచించిరి.

ఫాహి.—ఇది యేప్రాంతము?

సూ. పు.—ఈ కనుపడునవి 'చన్గాంగు' మండలపు సరిహద్దులు. ఈప్రదేశమంతయు సిన్నువంశజులచే పరిపాలింపబడు "చింగ్‌ఛౌ" రాజ్యములోని యంతర్భాగము

అది విని ఆయోడలోని వణిజులు గమ్యస్థానమును జేరుకొంటిమిగదాయని సంతోషస్వాంతులై దమ సరకుల నన్నిటిని ఒడ్డుజేర్చి చెన్గాంగు నగరమునకు బంపివైచిరి.

చెన్గాంగునగరాధీశ్వరుడగు 'లీయీ' బౌద్ధమతావలంబకుడు ధర్మనిరతుఁడు. దూరదేశములకేగి బౌద్ధగ్రంథముల, విగ్రహములవెంటగొని యెవ్వరోయొకశ్రమణకుడే తెంచెనను వార్త వినినతోడనే యాతడు పరివారసమేతుడై మన ఫాహియానున కెదురేగి యాతని దన రాజధానికి దోడ్కొని పోయెను. తక్కటి వణిజులు 'యాంగ్‌ఛౌ' బట్టమునకు మరలి పోయిరి. చెన్గాంగుబట్టణమునుండి ఫాహియాను చింగ్‌ఛౌ మండలాధిపునిచేనాహ్వానింపబడిఆతనినగరమునకరిగివర్షఋతువు గతించువరకు నందే యుండెను. అచ్చటనుండి యాతడు తిన్నగ చెంగన్నగరమునకు బోవ నభిలషించెను. చెంగన్నగర మాతని నివాసము. దాని నతడు విడిచి చాలకాల మయ్యెను. అచ్చటి బాల్యమిత్రుల జూచి యేండ్లు గడచెను. దాని నొక్కసారి చూచిపోవుదమని మన ఫాహియానున కాతురత గల్గెను గాని యంతకంటెను అవశ్యముగ నిర్వర్తింప



వలసిన పవిత్రకార్య మింకను నిర్వర్తింపబడవలసియే యుండుటచే నతడు సత్వరముగ చీనాసామ్రాజ్యరాజధానియగు "నాన్కింగు" నగరమునకుబోయి అచ్చటి బౌద్ధసన్యాసులకు తాను గొనివచ్చిన సూత్రగ్రంథముల నొసంగిధన్యుడయ్యెను. ఆతని సంకల్ప మీడేరినది.

ఫాహియాను చెంగన్నగరమునుండి బయలుదేరి ఆరుదీర్ఘవత్సరములు ప్రయాణమొనర్చి మధ్యభారతమును జేరెను. అచ్చట బౌద్ధగ్రంథముల పఠించుచు, సంస్కృత భాష నభ్యసించుచు ఆరేండ్లు గడపెను. పిమ్మట అచ్చట నుండి పయనమై ఓడనెక్కి, మూడేండ్లకు నిజరాజ్యమును జేరుకొనెను. మార్గమున నాత డెన్నియో రాజ్యముల సందర్శించెను. గోబీయెడారిమొదలు పశ్చిమమున భారతవర్షము వరకును విలసిల్లిన దేశములయందు నివసించు భిక్షుకసంఘముల సౌజన్యవర్తనమును వీక్షించినాడు. అందలిజనసంతతులలో బౌద్ధమతముగల్పించిన యద్భుత పరివర్తనమును జూచి ఆనందించినాడు. చీనారాజ్యమున గలసోదరశ్రమణకులిట్టి చోద్యముల నెన్నడును విని యెఱుగరు. మార్గమునఅమితకష్టములబడి శ్రమలకోర్చి ఎట్టకేలకుఫాహియాను చీనారాజ్యమునకు మరల తిరిగి వచ్చెను. సముద్రయానమున నాతని కెన్నియోఆపదలుసంఘటిల్లెను. అమణిత్రియప్రభావముచేఅన్నియు గడచి యాతడు సురక్షితముగ నిల్లుచేరగల్గెను. తక్కటి

శ్రమణకులు గూడ తాగాంచిన వింతల నాలకించి ఆనంద పారవశ్యులగుట్కై తనయాత్రావృత్తాంతమునాతడు వెదురు పలకలపైనను చీనాంబరములపైనను వ్రాసెను.

స ం పూ ర్ణ ము.

END OF TITLE